
# సాహిత్య వ్యాసావళి



సంకలన కర్త
బి.యస్. రెడ్డి (భూమన్)

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి

# సాహిత్య వ్యాసావళి


సంకలన కర్త:

**బి.యస్. రెడ్డి (భూమన్)**

ాలకులు, తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు, 'శ్వేత'

తి.తి.దే, తిరుపతి.



ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2009**

# SĀHITYA VYĀSĀVAḶI

(A Collection of Literary Essays)

Compiled by
BHUMAN (B.S.REDDY)
DIRECTOR
"SVETA", T.T.D., TIRUPATI.

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved
First Edition: 2009
Copies : 1000

Published by
DR. K.V. RAMANACHARY, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

శ్రీనివాసో విజయతే

# నా మాట

**డా॥ కె.వి.రమణాచారి,ఐ.ఏ.ఎస్.,** 21.04.2009

కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

ప్రాచీన యుగాల్లో ప్రసిద్ధులయిన కవీశ్వరులు చాలా మంది లౌకిక జీవితానికీ, సాహితీ జీవితానికీ సముచితమైన ప్రాధాన్యాన్ని సంతరించి జీవయాత్ర సాగించిన సుగృహీత నామధేయులు.

మఱి కొందఱు మాత్రం విశ్వశ్రేయస్కరమైన వాఙ్మయాన్ని సృజించటమే జీవిత ధ్యేయంగానూ, జీవితమంతా కవితా కళామయంగానూ మమేకంగా మనుగడ సాగించిన మహితాత్ములు!

చిరస్మరణీయులయిన అలాంటి మహనీయుల్లో బమ్మెర పోతన, తాళ్ళపాక అన్నమాచార్యులు, తరిగొండ వెంగమాంబ - ముఖ్యులైన ఆధ్యాత్మిక సాహిత్య మూర్తులు.

తిరుమల తిరుపతి దేవస్థానములు శ్వేత భవనంలో తరిగొండ వెంగమాంబ పేరిట వాఙ్మయ పీఠాన్ని నెలకొల్పినప్పటి నుండీ ఆ ప్రాజెక్టు ఇదివరకు అరుదైపోయిన ఆ మహాకవయిత్రి రచనలను పరిష్కరించడంతోపాటుగా, వేర్వేఱు సాహితీ సదస్సుల్లో

విద్వాంసులు వెల్లడించిన అమూల్యాభిప్రాయాలతో గూడిన ఉపన్యాసాలనూ, ప్రసంగ వ్యాసాలనూ ప్రకటిస్తూ వుండటం, అభినందింపదగింది.

ఆ విధమైన సాహిత్య సంశోధనాత్మక వ్యాస సంకలనాల్లో ఈ "సాహిత్య వ్యాసావళి" రెండవది కావడం ముదావహం.

ఈ సహజ కవయిత్రి సృజించిన మహనీయ వాఙ్మయరాశి యొక్క స్వరూప, స్వభావాలను, వైశిష్ట్యాన్ని సహృదయ పాఠకలోకానికి విశదీకరించే ఇలాంటి సంశోధనాత్మక వ్యాస సంపుటులను ఈ ప్రాజెక్టు ఇతోధికంగా ప్రచురించగలదని ఆశిస్తున్నాను.

సదా శ్రీనివాసుని సేవలో

డా॥ కె.వి.రమణాచారి

# మనవి

**"భూమన్"** 21.04.2009

సంచాలకులు,
మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,
"శ్వేత", తి.తి.దేవస్థానములు, తిరుపతి.

క్రీశ. 18వ శతాబ్ది తెనుగు సాహిత్య చరిత్రలో ఒక విశిష్టమైన ఘట్టం. ఆ కాలంలో తిరుమల క్షేత్రం ప్రముఖ సారస్వత కేంద్రంగా విలసిల్లటం ఈ సందర్భంలో ప్రస్తావింపదగిన చారిత్రకాంశం. పరమభాగవత కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 1750-1817 మధ్య కాలంలో వేంకటాద్రిపై నివసించి, వేర్వేఋ రచనా ప్రక్రియలలో అనేక గ్రంథాలను వెలయించి, ఆంధ్ర సాహిత్యాన్ని సుసంపన్నం కావించింది.

అయితే ఆ'మధుర కవితా సరస్వతి' సృజించిన కృతుల వివరాలు గాని, ఆ'పరమ యోగిని' పవిత్ర జీవితానికి సంబంధించిన విశేషాలుగాని ఇటీవలివరకు చాలా భాగం అజ్ఞాతంగానే ఉంటూవచ్చాయి.

ఇలా ఉండగా, తిరుమల తిరుపతి దేవస్థానములు ఈ మహాకవయిత్రి రచనల ప్రాశస్త్యాన్ని గుర్తించి, 2006 ఆగష్టులో "శ్వేత" భవనంలో తరిగొండ వెంగమాంబ పేరిట వాఙ్మయ ప్రాజెక్టును నెలకొల్పింది. ఆనాటి నుండీ ఈ భక్తకవయిత్రి జీవితానికీ, సాహిత్యానికీ సంబంధించిన అనేక విశేషాలు క్రమేపీ లోకానికి వెల్లడౌతూవచ్చాయి. ఈ కారణంచేత ఈ మహనీయురాలి సారస్వత మూర్తిమత్త్వం (Literary Personality) ఈ నాడు విశ్వవిఖ్యాతమై విరాజిల్లుతూవుంది.

ఈ వాఙ్మయప్రాజెక్టు ఇంతవరకు వెంగమాంబ రచనలను పదునాలుగింటిని ప్రచురించింది. ఆమె రచనల్లోనుండి

ఎంపికచేసిన పాటల సి.డి.లను పదింటిని ఆవిష్కరించింది. హైదరాబాదు, కాకినాడ, విజయవాడ, అనంతపురం మొదలైన చోట్ల జాతీయ సాహిత్య సదస్సులను, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది.

ఈ వాఙ్మయ ప్రాజెక్టు ఈ మేనెల 8వ తేదీ శుక్రవారంనాడు తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తూవుంది. అందులో భాగంగా ఈ క్రింది అయిదు పుస్తకాలను ప్రచురిస్తున్నది:

1. శ్రీభాగవతము (ద్విపద కావ్యము) దశమ స్కంధము - ప్రథమ సంపుటము } మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
2. రాజయోగామృత సారము (ద్విపద కావ్యము)..మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
3. తరిగొండ వెంగమాంబా విజయము (వచనము)..'విద్యారణ్యపంచానన', 'విద్యా వాచస్పతి' శ్రీమాన్ కళత్తూరు వి్రకాల రామచంద్రాచార్యులు
4. శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము (వచనము)..శ్రీ రంగ ప్రకాశ దాసు
5. సాహిత్య వ్యాసావళి (వ్యాస సంకలనం).. సంకలనకర్త బి.యస్. రెడ్డి (భూమన్)

పైన పేర్కొన్న ఐదు గ్రంథాల్లో చివరిది ఈ "సాహిత్య వ్యాసావళి". ఇందులో 15 వ్యాసాలు ఉన్నాయి. ఈ వ్యాసాలు ఇతఃపూర్వం జరిగిన సాహితీ సదస్సుల్లో ప్రముఖులు సమర్పించిన ప్రసంగవ్యాసాలనుండీ, అనుభవజ్ఞులు రచించిన "ఆంధ్ర యోగులు", "తెలుగు యోగులు" మొదలైన జీవిత సంగ్రహాల సంపుటుల నుండీ ఎంపిక చేయబడినటువంటివి.

ఇలాంటి సంకలన గ్రంథాన్నొకదానిని ఈ ప్రాజెక్టు 2007లో వెలువరించింది. ఈ "వ్యాసావళి" ఆ కోవలో రెండవది.

ఈ వ్యాస సంకలనాలు వెంగమాంబ వాఙ్మయంపై పరిశోధనలు సాగించే విద్యార్థినీ, విద్యార్థులకేగాక, జిజ్ఞాసువులయిన

పాఠకుల కందరకూ చక్కని పథనిర్దేశం కావించే కరదీపికలు కాగలవు.

తి.తి.దే. తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలను ఇతోధికంగా విస్తరింపచేయటానికి పూనిక వహించి, అకుంఠిత దీక్షతో పురోగమిస్తూవుందని తెలియజేస్తున్నాను.


తరిగొండ వెంగమాంబ కృతులపై కూలంకషంగా పరిశోధించి ప్రప్రథమంగా పిహెచ్.డి. డిగ్రీని పొందిన వ్యక్తి డా॥కృష్ణమూర్తిగారు ఈ కవయిత్రి సారస్వతంపై ఇంచు మించు 30 సంత్సరాల క్రితం కావించిన విశేషకృషి ఈనాడు దైవికంగా ఈ వాఙ్మయ ప్రాజెక్టు రూపంలో సత్ఫలితాల నిస్తున్నదని చెప్పవచ్చు.

వెంగమాంబ జీవితగాథపై టెలీసీరియల్ నిర్మించి, ప్రకృతం చలనచిత్రాన్ని నిర్మిస్తూవున్న ప్రసిద్ధ సినీ నిర్మాత శ్రీయుతులు వి.దొరస్వామిరాజు (ఎక్స్ యమ్.యల్.ఏ.) గారికి వీరు కథాపరమైన సలహాలను ఇస్తుండటం ఈ సందర్భంలో ప్రశంసింపదగిన ఉదంతం.

మొత్తం మీద, తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మాంబ (తిమ్మక్క)ను ఆంధ్ర సాహితీప్రపంచానికి పరిచయం చేసిన ఘనత కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి చెల్లినట్లే, తరిగొండ వెంగమాంబను బహుగ్రంథకర్త్రి యైన మహా కవయిత్రిగా ఆవిష్కరించిన కీర్తి ఆచార్య కృష్ణమూర్తి గారికి దక్కింది.

ఈ వయస్సులో వీరు ఈ వాఙ్మయ ప్రాజెక్టులో పరిష్కర్తగా అత్యంత నిబద్ధతతో కృషిచేస్తూ, ప్రాజెక్టు యొక్క అభ్యుదయానికి చక్కగా సహకరిస్తూ వున్నందులకు ఆయనను హృదయపూర్వకంగా అభినందిస్తూవున్నాను.

భూమన్



## సాహిత్య వ్యాసావళి

## విషయ సూచిక


| విషయము. | పుటలు. |
|---|---|
| నామాట | iii |
| మనవి | v |
| 1. తరిగొండ వెంగమాంబ రచనలలో ప్రతిఫలించిన సామాజిక విశేషాలు<br>-ఆచార్య కాత్యాయనీ విద్మహే. | 1 |
| 2. తరిగొండ వెంగమాంబ మన మీరాబాయి<br>**-ఆచార్య పి. కుసుమ కుమారి.** | 30 |
| 3. దయాపయోనిధీ!<br>**-శ్రీమాన్ పి.ఆర్.రంగరాజన్.** | 35 |
| 4. ఆంధ్ర యోగినులలో అగ్రగణ్యురాలు<br>**-తరిగొండ వెంకమ్మ**<br>**-శ్రీ మేడపాటి వెంకటరెడ్డి.** | 40 |
| 5. మహాకవి, మాతృశ్రీ మధ్య భక్తి సామ్యం<br>**-ఆచార్య కె.జె.కృష్ణమూర్తి.** | 54 |
| 6. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఎలా మేల్కొంచారు? గత చరిత్రలో ప్రధానఘట్టాలు<br>**-శ్రీ వరకాల పట్టాభిరామారావు.** | 61 |
| 7. The Rebellious Devotees<br>**-Sriman A.D.Ranga rajan.** | 70 |

| విషయము | పుటలు |
|---|---|


8. సాహితీ తపస్విని తరిగొండ వెంగమాంబ 72

**-డా॥ ఎన్. అనంతలక్ష్మి.**

9. తరిగొండ వెంకమ్మ 84

**-ఆచార్య బిరుదు రాజురామరాజు.**

10. శ్రీ వెంకన్న భక్త కవయిత్రి తరిగొండ వారి హారతి 98

**- శ్రీ మెరుగు రాధాకృష్ణ.**

11. తరిగొండ వెంకమాంబ 108

**-శ్రీ శ్యామప్రియ.**

12. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం - 112

వెంగమాంబ వైదుష్యం

**-డా॥ పి. నాగమల్లీశ్వరరావు.**

13. వెంగమాంబ కథ 122

**-ఆర్.వి. శ్రీనివాసరావు, బి.ఏ.,**

14. తరిగొండ వెంగమాంబ 139

**- ఆచార్య ఎన్. గంగప్ప.**

15. తరిగొండ వెంగమాంబ యక్షగానాలు 147

- ఒక సమీక్ష

**-ఆచార్య కె.జె.కృష్ణమూర్తి.**

# తరిగొండ వెంగమాంబ రచనలలో ప్రతిఫలించిన సామాజిక విశేషాలు

- ఆచార్య కాత్యాయనీ విద్మహే

ప్రాచీన తెలుగు సాహిత్యం వందలకొద్ది కవుల సృజనాత్మక ప్రతిభతో వికసించింది. ఆ కవులు ప్రధానంగా పురుషులు. సాహిత్య వస్తువును, ప్రక్రియను, భాషాభివ్యక్తిరీతులను వారసత్వంగా నిరంతరంగా అభ్యసించిందీ, అభివృద్ధిచేసిందీ వాళ్ళే. అందువల్ల ఆ వస్తు ప్రక్రియా రీతులు పురుష దృక్పథంతో రూపొందటం అనివార్యం అయింది. ఈ ప్రధాన స్రవంతి సాహిత్యప్రపంచంలో స్త్రీల ప్రవేశం దాదాపు నిషిద్ధమే అయింది. స్త్రీల జీవితం సమాజ సాహిత్యకళారంగాలకు సంబంధించినది కాక, కుటుంబానికి, ప్రైవేటు ప్రపంచానికి సంబంధించినదిగా నిర్దేశించబడటం, ఆ పరిధిలోనే నిరంతరం కొనసాగటం అందుకు కారణం. ఈ పరిస్థితులను, చట్టాలను దాటి స్త్రీలు సాహిత్యసృజనకారులు కావటం అరుదుగా జరిగింది. అందువల్లనే తొమ్మిది వందల సంవత్సరాల ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో మొల్ల, తాళ్ళపాక తిమ్మక్క, ముద్దుపళని, రంగాజమ్మ, తరిగొండ వెంగమాంబ - ఐదుగురే స్త్రీలు సరిగ్గా వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంతమంది - కవులుగా కనబడతారు.

పురుష నిర్మిత సామాజిక వ్యవస్థలో స్త్రీల జీవితం కుటుంబానికి, భక్తికి సంబంధించినది. లేదా పురుషుల భోగలాలసాపరితృప్తికి తనను తాను సిద్ధం చేసుకొనటానికి, సమర్పించుకొనటానికి సంబంధించినది. స్త్రీ ఇల్లాలుగానో,

వేశ్యగానో జీవించటం తప్ప అన్యమార్గం లేదు. వుంటే అది భక్తియోగమార్గం తప్ప మరొకటి కాదు. తెలుగు సాహిత్య చరిత్రలో తాళ్ళపాక తిమ్మక్క విషయమే చూస్తే ఆమె అన్నమాచార్యుని ఇల్లాలు. ఇల్లాలుగా జీవించింది. ఆ అనుభవకోణం నుండే 'సుభద్రాకళ్యాణం' ద్విపదగా వ్రాసింది. పెద్దగా అభిమానానికి నోచుకోకపోయినా అభిశంసనకైతే గురి కాలేదు. ముద్దుపళని, రంగాజమ్మ రాజవేశ్యలుగా జీవించారు. ఆ అనుభవకోణంనుండే రాధికాసాంత్వనం, మన్నారు దాసవిలాసం వంటి శృంగార కావ్యాలు వ్రాశారు. నీతిమాలిన సాహిత్యం వ్రాసినవాళ్ళుగా నిందకు గురయినారు. ఇక మిగిలినవాళ్ళు మొల్ల, తరిగొండ వెంగమాంబ. మొల్ల అవివాహిత. వెంగమాంబ వితంతువు. అవివాహితకు అయినా, వితంతువుకు అయినా భక్తి ఒక్కటే తమ అస్తిత్వాన్ని నిరూపించుకొనటానికి, తమను తాము వ్యక్తీకరించుకొనటానికి మార్గాలు.

నిజానికి వివాహితలయినా కుటుంబంలో ఎదుర్కొన వలసివస్తున్న అధికార ఆధిపత్యరూపాలను, శారీరక మానసిక హింసలను మౌనంగా భరించి భరించి, ఆ ఒత్తిడికి ఒక ఉపశమన మార్గంగానో, సంసారంపై కలిగిన ఏవగింపునకు ఒక ఆమోదయోగ్యమైన అభివ్యక్తి మార్గంగానో భక్తిని ఆశ్రయించటం తరచూ జరిగేదే. వీరశైవమత ఉద్యమం ఉనికిలోకి తెచ్చిన అనుభవమంటపంలో తమకొక పబ్లిక్ ప్రదేశాన్ని ఏర్పరచుకొన్న అక్కమహాదేవి వంటి వాళ్ళుగానీ, ఆంధ్రదేశంలో హేమారెడ్డి మల్లమ్మ, మహారాష్ట్రలో సక్కుబాయి, ముక్తాబాయి, రాజస్థాన్‌లో మీరాబాయి, కాశ్మీర్ దేశంలో లల్లాదేవి మొదలైన వాళ్ళు ఏదో ఒక

పరిధిలో కుటుంబంలో అమలయ్యే అధికారంపై ఒక పరోక్ష ధిక్కారంగా భక్తిని ఆశ్రయించిన వారే నని చెప్పవచ్చు.

స్త్రీకి పతిభక్తి స్థానంలో భగవద్భక్తి ఆమోదయోగ్యమైనదే. పెళ్ళి కాకపోయినా, అయి భర్తలేకపోయినా, భర్తవున్నా అతనితో సఖ్యత లేకపోయినా పతిని సేవించేందుకై స్త్రీకి బాల్యంనుండి ఇయ్యబడిన శిక్షణ అంతా వ్యర్థమవుతుంది. భర్తకు ఉపయోగపడని స్త్రీ సేవాసక్తులు, శ్రద్ధ భగవంతుని వైపు మరలించదగినవి అవుతాయి. ఏకవీర నవలలో విశ్వనాథ ఏకవీర గురించి అన్నమాటలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోదగినవి. ఏకవీరకు భర్తప్రేమ లభించలేదు. వివాహానికి పూర్వము తను ప్రేమించిన యువకుడిమీదికి పదేపదే మనసు మళ్ళటానికి అది కారణమైంది. అటువంటి ఒకానొక ఉన్మత్తదశలో ఆమెకు తొల్లిటి ప్రియుడు కనబడ్డాడు. ఆమె మైమరచిపోయింది. ఆ తరువాత ఒళ్ళు తెలిసి అక్కడి నుండి పారిపోతూ వీథిలో క్రైస్తవమత ప్రచారానికై తత్త్వబోధకస్వామిగా అవతార మెత్తిన రాబర్ట్ డి నొబిలీతో మతచర్చచేసి ఓడించి, అతను అక్కడి నుండి మకాం ఎత్తివేసేటట్లు చేసింది. అప్పు డామెను గురించి విశ్వనాథ 'భర్తను సుఖపెట్టుటకు తల్లి నేర్పించిన చదువు ఈనాడు సుందరేశ్వరుని నిలబెట్టటానికి ఉపయోగపడినది' - అని అంటారు. అంటే స్త్రీ చదువు సంధ్యలు, సేవలు, సంపాదన-చివరకు బ్రతుకంతా అయితే భర్తకో, లేక భగవంతునికో ఉపయోగపడవలసినవన్నమాట. ఈ భావజాల నేపథ్యం నుండి చూచినప్పుడు మొల్ల, తరిగొండ వెంగమాంబ కుటుంబ చట్రంలో భక్తులై ఆ చట్రం మీద ఒక విమర్శను పరోక్షంగా వినిపించారని అనుకొనవచ్చు. ఆ రకంగా వాళ్ళిద్దరూ భక్త కవులు.

భక్తులుగా వారి సాహిత్యవస్తువు భగవంతుడు. భగవంతుడిని నాయకుడిగా చేసి పురుషు లెందరో దైవ మాహాత్మ్య, క్షేత్ర మాహాత్మ్య కావ్యాలు వ్రాశారు. ఆ క్రమంలోనే మొల్ల అయినా, తరిగొండ వెంగమాంబ అయినా, ఆమె శ్రీరామచంద్రుడిని, ఈమె వేంకటేశ్వరుడిని కావ్య నాయకులుగా స్వీకరించారు. వారిచుట్టూ తమ భావనాప్రపంచాన్ని నిర్మించుకొన్నారు. అయితే, దానిని వ్యక్తీకరించటానికి పురుషనిర్మిత సాహిత్య రూపాలను, ప్రక్రియలను భాషాభివ్యక్తిరీతులను వాళ్ళు ఆశ్రయించటం అనివార్యం అయింది. కావ్యహేతువులైన ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసాలకు అవకాశం లేని సామాజిక స్థితిలో జీవిస్తున్న స్త్రీలు ఈ విధమైన సాహిత్య ప్రపంచపు వీథులలో దారి తెలియని ప్రయాణీకులే అవుతారు. ఆ భయం వాళ్ళలో ఆత్మన్యూనతగా వ్యక్తమవుతుంది. పురుష ప్రపంచం ముందు వినమ్రులై తమ మాటలను వినమని, తప్పులుంటే క్షమించమని అడుగుతారు. 16వ శతాబ్దపు మొల్ల దయినా అదే పరిస్థితి. 18వ శతాబ్ది వెంగమాంబదీ అదే పరిస్థితి.

[illegible] 1730-35 [illegible] 181[illegible] [illegible] బ్రిటీషు వలస పాలన స్థిరపడుతూ భారతదేశం ఆధునికత వైపునకు తొలి అడుగులు వేస్తున్న కాలం అది. సంప్రదాయ సాహిత్యపు చివరి మెరుపుగా తరిగొండ వెంగమాంబ తెలుగు సాహిత్యాకాశంలో వెన్నెల వెలుగులు విరజిమ్మింది. వెంగమాంబకు బాల్యంనుండే దైవభక్తి అలవడింది. ఆమె భక్తితాదాత్మ్యాలు స్త్రీ నిర్వహించవలసిన

గృహస్థధర్మానికి ఎక్కడ అవరోధా లవుతాయేమో నని తల్లిదండ్రులు కొంచెం భయపడ్డారు. కూతురిని నియంత్రించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నాలు అంతగా ఫలించలేదు. వివాహమే ఆమెను సరియైన దోవన పెడుతుందని భావించారు. ఇంజేటి వెంకటాచలపతితో ఆమె వివాహాన్ని నిర్ణయించారు. ఆ వివాహం తనకు వద్దని చెప్పిచూచింది వెంగమాంబ. అయినా తండ్రి ఆమె మాట వినిపించుకోలేదు. ఆడపిల్లకు పెళ్ళి తప్పని సరి అని, ఎదిరించటానికి వీలులేదని ఆ కార్యం కాస్తా నిర్వర్తించారు. తన శరీరంపై, బ్రతుకుపై అధికారం వేంకటేశ్వరుడిదే నని ఆమెభావం. ఏమైతేనేం ఆమె వైవాహిక జీవితం విఫలమైంది. భర్త అచిరకాలంలోనే మరణించాడు. ఆమె భక్తి మార్గానికి అవరోధమైన ఆ ఐహికబంధం ఒకటికూడా నశించటంతో తరిగొండ వెంగమాంబ మరింత స్వతంత్రురాలుగా ముందుకు సాగింది; ఎదిగింది.

వెంగమాంబ భర్త మరణానంతరం మంగళచిహ్నాలను విడనాడనని. జుట్టు తీయించుకోనని గొప్ప విప్లవాన్ని సృష్టించింది. తిరుపతి వేంకటాచలపతిని భర్తగా తలచే తనకు వైధవ్యం లేదని ఆమె వాదన. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆమె ధ్యాన మననాలకు కేంద్రపీఠం అయింది. తరిగొండ నృసింహశతకంతో ఆమె సాహిత్యసృజనకు, వాఙ్మయ సాధనకు తెర తీసింది.

వెంగమాంబ వివాహంపై ఆసక్తి చూపలేదు. వివాహానంతర పరిణామాలకు దిగులు చెందలేదు. పైగా, వేంకటపతే తనకు భర్త అని నిర్ద్వంద్వంగా ప్రకటించి, తాను పెళ్ళాడిన ఇంజేటి వెంకటాచలపతి వితంతువుగా జీవించటానికి నిరాకరించింది. కానీ,

తన కావ్యలలో తనను "ఎలమిని పెంపుసొంపొదవ నింజెటి వంశజుఁడైన వేంకటాచలపతి నామ ధేయుని నిజాంగన" (తరిగొండ నృసింహ శతకం)నని చెప్పుకొనటం మాత్రం ఒక వైరుధ్యమే. ఎంత విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని సమాజానికి ఎదురీదే ప్రయత్నం చేసినా, ప్రధానస్రవంతి సమాజసంస్కృతీ వలయంలో మనుషు లెంతగా తమకు తెలియకుండానే పరిభ్రమిస్తుంటారో దీనినిబట్టి గ్రహించవచ్చు. "వేంకటాచలపతిపాద/వనజయుగ్మంబు భావంబు నందుంచి/యనుపమంబైన మోక్షాసక్తితోడ," ద్విపదభాగవతం వ్రాస్తున్నా నని చెప్పుకొన్న మాటలు మరణించిన భర్తనే మనస్సు నందుంచుకొని స్వర్గంలో అతనిని కలుసుకొనే పర్యంతం వితంతుస్త్రీ మోక్షానక్త అయి జీవించాలని చెప్పిన మనుధర్మాన్నే ప్రతిధ్వనిస్తున్నాయి.

తరిగొండ వెంగమాంబకు ఆధ్యాత్మిక విద్యాగురువు రూపావతారము సుబ్రహ్మణ్యయోగి వున్నాడు. కానీ సాహిత్యవిద్యా గురువులు ఎవరూ వున్నట్లు కనబడదు. "నా చిన్ననాఁట నోనామాలనైన/నాచార్యులెవరు నా కానతీలేదు" (ద్విపద భాగవతావతారిక) అని చెప్పుకొన్నది.

"నా చిన్ననాఁట నోనామాలనైన నా
 చార్యుల చెంత నేఁ జదువలేదు
పరఁగ ఛందస్సులోఁ బది పద్యములనైన
 నిక్కంబుగా నేను నేర్వలేదు
లలి కావ్యనాటకాలంకారశాస్త్రముల్
 వీనులనైనను వినఁగలేదు

*పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్*
*శోధించి వరుసగాఁ జూడలేదు"*

*(శ్రీ వేంకటాచలమాహాత్మ్యము 1ఆ. - 21)*

అని చెప్పుకొన్న మాటలు వ్యవస్థీకృత అక్షరజ్ఞానవిద్యకు స్త్రీలను పరాయీకరించిన ఒకానొక సామాజిక స్థితిని సూచించటంతో పాటు, పురుషులదైన సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నప్పుడు స్త్రీ వాళ్ళందరి ఆమోదాన్ని పొందటానికి, తాను వాళ్ళకంటే తెలివైనదానిని, జ్ఞానవంతు రాలిని కా దని వినమ్రతతో చెప్పుకొన వలసిన స్థితిలో వుండటాన్నికూడా చెప్పకనే చెబుతాయి.

ఇంత వినయాన్ని ప్రకటించినా , వెంగమాంబ కవిత్వం ప్రతికూల విమర్శలను ఎదుర్కొనవలసి వచ్చిందని తరిగొండ నృసింహశతకం సాక్ష్య మిస్తున్నది:

*"కరుణయు లేక కొందఱు వికల్పకవిత్వమటంచుఁబల్కినన్*
*సరగుననీవు వారలకు సమ్మతిఁజెప్పి పరాకుసేయకే*
*పరువడితోను నీశతక పద్యము లింక ధరిత్రిమీఁదటన్*
*గుఱుతుగ నిల్పవయ్య తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!,*

స్త్రీల రచనల పట్ల సమాజం ఎంత నిర్దయగా వ్యవహరిస్తున్నదో, అది కవిత్వమే కాదని ఎంత నిర్లక్ష్యం చేస్తున్నదో అనుభవించిన ఒక నిస్సహాయవేదననుండి వెంగమాంబ తనది కవిత్వమని వాళ్ళను ఒప్పించే పనిని తాను నమ్ముకొన్న దైవానికే అప్పగించింది.

వేంకటాచల మాహాత్మ్యము (1-19)లోని మరొక్క పద్యంకూడా సాహిత్యప్రపంచం ముందు వెంగమాంబ వినయవ్యక్తీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుంది:

*"పండితాగ్రణులార! ప్రజలార! యిపుడు నా*
*బాలభాష కసూయ పడక వినుఁడు!*
*తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కుల*
*కానంద మొందెడు నట్ల యిందు*
*మీరు నా తప్పొప్పు లేరీతిగా నైన*
*గేలిసేయక చిత్తగింపవలయు"*

తనను ఎవరు విమర్శిస్తున్నారో వాళ్ళనే - ఆ పండితులనే, ఆ ప్రజలనే ఈ పద్యంలో వెంగమాంబ సంబోధించింది. తనది 'బాలభాష' అని వాళ్ళ పెద్దరికాన్ని ఆమోదించింది. 'అసూయ పడక వినుఁడు' అని కోరింది. ఈ వేడుకోలు గమనించదగింది. తనది బాలభాష. వాళ్ళది పరిణత భాష. తాను చిన్నపిల్ల. వాళ్ళు తల్లిదండ్రులవంటివారు. ఈ పోలికలు చెప్పటం వలన, తనతో వాళ్ళు పోటీపడనవసరం లేదని, పోటీ లేదు కనుక అసూయ చెందవలసిన పనిలేదని చెప్పినట్లయింది. తనది తప్పొప్పుల కవిత్వమని, దానిని హేళనచేయక ఆదరించమని తనను తాను తగ్గించుకొని అడగటంలో పండితుల అహాన్ని తృప్తిపరచటమే వుంది. పురుష కవులు కూడా సాహిత్యప్రపంచంలో వినమ్రతను ప్రకటించిన సందర్భాలు వున్నాయని, ఇది తరిగొండ వెంగమాంబలవంటి స్త్రీలకే ప్రత్యేకం కాదని ఎవరైనా అనవచ్చు. కానీ, ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి వుంది.

ఈ సమాజంలో వినయం పురుషులకు అదనపు గుణం. స్త్రీలకు మాత్రం అత్యవసర అనివార్య గుణం. సాహిత్యప్రపంచంలో నిలదొక్కు కొనటానికి వ్యతిరేకశక్తులతో స్త్రీలు ఎంతగా సంఘర్షించవలసి వస్తున్నదో దానికి తరిగొండ వెంగమాంబ జీవితమే ఒక ఉదాహరణ. ఇంతటి ప్రతికూల పరిస్థితులలోనూ విస్తృతంగా వ్రాయటం వెంగమాంబ వ్యక్తిత్వధీరతకు నిదర్శనం.

నృసింహశతకం కాక, నారసింహవిలాసకథ, శివ నాటకము, కృష్ణ నాటకము, గోపికా నాటకము, జలక్రీడా విలాసము, ముక్తికాంతా విలాసము, పారిజాతాపహరణము, చెంచు నాటకము, శ్రీరుక్మిణీ నాటకము- అనే తొమ్మిది యక్షగానాలను, రాజయోగ సారము, రమా పరిణయము, శ్రీభాగవతము, వాసిష్ఠ రామాయణము మొదలైన ద్విపదకావ్యాలను, శ్రీకృష్ణమంజరి అనే మంజరీద్విపదస్తుతి కావ్యాన్ని, శ్రీవేంకటేశ్వర మాహాత్మ్యము, అష్టాంగ యోగసారము - మొదలైన పద్యకావ్యాలను, కొన్ని కీర్తనలను వ్రాసింది తరిగొండ వెంగమాంబ.

స్త్రీగా తా నొక తిరుగుబాటుసంకేతమై, స్త్రీలకు పరాయీకరించబడిన సాహిత్యవిద్యాతత్త్వజ్ఞానప్రపంచంలోకి ప్రవేశించి, స్థిరపడిన విలువలతో సంఘర్షించి, పరిమితులలోనే అయినా వాటిని సంస్కరించటానికి ప్రయత్నించింది తరిగొండ వెంగమాంబ. ఆమె భక్తురాలనికానీ, ఆమె రచనలలోని భక్తితత్త్వం గురించికానీ ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. ఎందుకంటే ఆమె ముందు తరిగొండ నృసింహుడి భక్తురాలు. తరువాత శ్రీవేంకటేశ్వరస్వామి భక్తురాలు. తరిగొండ నృసింహుడికి

వేంకటేశ్వరునకు అభేదాన్ని భావించి ఆ భేదమెరుగని తత్త్వాన్నే నిత్యచింతనలో సజీవంగా నిలుపుకొన్న భక్తురాలు. ఆ భక్తిపారవశ్యంలో, తానారాధించే భగవంతుడి లీలలను జనసమూహంలోకి తీసుకొని వెళ్ళాలనే తపనతో చేసిన రచనలు ఆమెవి. అయితే ఆమె సామాజిక చేతనాలక్షణం ఆమెను, ఆమె సాహిత్యాన్ని కూడా విశిష్టంగా నిలబెట్టింది. కనుకనే తరిగొండ వెంగమాంబ రచనలలో ప్రతిఫలించిన సామాజికవిశేషాల విశ్లేషణకు ఈ పత్రాన్ని పరిమితం చేస్తున్నాను.

## II

తరిగొండ వెంగమాంబ తాను పుట్టిపెరిగిన ఊరికో, మెట్టినింటి గ్రామానికో తనను తాను కట్టిపడేసుకొన్న స్త్రీ కాదు. ఆధ్యాత్మిక తత్త్వజిజ్ఞాసా మార్గంలో తరిగొండనుండి తిరుమలదాకా ప్రస్థానంచేసింది. ఈ క్రమంలో భిన్నప్రాంతాల, భిన్నవర్గాల ప్రజలజీవితాన్ని సన్నిహితంగా, నిశితంగా పరిశీలించే అవకాశం ఆమెకు లభించింది. అందువల్లనే విష్ణుభక్తి అనే ఒకే ఒక ఛత్రచ్ఛాయలో కూడా వైవిధ్యభరితమైన సామాజిక మానవజీవన సౌందర్యాన్ని చూపగలిగింది. వివాహంపట్ల తన కెంత మక్కువ లేకున్నా, కుటుంబం అంటూ తనకు లేకపోయినా, వివాహ విధులను, ఆచార వ్యవహారాలను, ఆహారపుటలవాట్లను, దాంపత్యసంబంధాలను, బహుభార్యాత్వ వ్యవస్థలోని పరిణామాలను, కుటుంబజీవన సంస్కృతిని వాస్తవికంగా చిత్రించి, ప్రదర్శించింది. జీవితానికి సంబంధించిన విలువలను ప్రస్తావించింది. ప్రశ్నించింది. స్త్రీగా స్త్రీల అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేసింది. ఆత్మగౌరవ చైతన్యస్ఫూర్తిని కనబరిచింది.

**1. వివాహం:** చెంచునాటకము, వేంకటేశ్వర మాహాత్మ్యం మొదలైన రచనలలో పెళ్ళిళ్ళ పద్ధతులను వివరంగా పేర్కొన్నప్పటికీ, ప్రత్యేకంగా పెళ్ళినే వస్తువుగా చేసుకొని వ్రాసిన రచన రమాపరిణయము. వేంకటేశ్వరుడు దేవతల కోరికమీద రమను పెళ్ళాడటం ఇందులో వస్తువు. విష్ణువు లక్ష్మీదేవిని తన కొరకు అడగటానికి బ్రహ్మాదులను సముద్రుడి దగ్గరకు పంపటం దగ్గరనుండి ముహూర్తం పెట్టటం, వరపూజ, మంగళ స్నానాలు, స్నాతకం, కాశీయాత్ర, పెళ్ళివరకు అన్నిప్రధాన ఘట్టాలను చివరకు నాలుగవనాటి రాత్రి దొంగ చెంబు ఎత్తుకొని పోయే ఆచారంవరకు అన్నీ ఈ పాటలో వచ్చాయి. దీనిని పూర్తిగా పెండ్లిపాటగానే రచించింది వెంగమాంబ. 'బువ్వంబంతి' మొదలైన పద్ధతులన్నీ విపులంగా వర్ణించబడ్డాయి. శివుడు వధువు పక్షం వహించి అన్నగారి హోదాలోనూ, పార్వతి వరుడి పక్షం వహించి ఆడబిడ్డ హోదాలోనూ, పరస్పరం చేసిన సంభాషణలు, వదినా మరదళ్ళ సంభాషణలు, బావా బావమరదుల సరస చమత్కార భాషణలు ఈ పెళ్ళిపాటను తెలుగువారింటి ఉత్సవ ప్రదర్శనగా చేశాయి. ప్రకృతిని మానవీకరించే ప్రక్రియకు వెంగమాంబ పూనుకోవటం కనిపిస్తుంది. అందువల్లనే రమా వేంకటేశ్వరులు, పార్వతీ పరమేశ్వరులు తెలుగింట నడయాడే రక్త బంధువులు, దంపతులు కాగలిగారు.

అదేవిధంగా వేంకటేశ్వర మాహత్మ్యంలోకూడా వివాహవిధి సమగ్రంగా చిత్రించబడింది. శుభలేఖ వ్రాయించి పసుపు కుంకుమలు పెట్టటం దగ్గరనుండి, పెళ్ళికి అవసరమైన ధనంకొరకు వెదుక్కొనటంతో సహా అన్ని ఘట్టాలు ఇందులో ప్రస్తావించబడ్డాయి. పెళ్ళికి తరలివెళ్ళటం, వివాహం, విందులు,

అప్పగింతలు అన్నీ సాంగోపసాంగంగా వర్ణించబడ్డాయి. పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం నెపంగా దేశీయ వివాహవిధిని వెంగమాంబ ఇందులో నమోదు చేసింది.

చెంచునాటకంలో చెంచువారి పెండ్లిళ్ళ పద్ధతి వర్ణించబడింది:

*"దంతిదంతములు కమ్మలు*
*కళలీను సంకు ఉంగరాలు*
*బండి గురివింజదండలు*
*కోరదండలు*
*పారుటాకుల చీరెలు - - - "* ఇవి

వధూవరుల అలంకారాలు. తప్పెట్లు వాయిస్తూ 'దంతపు బొట్టు' వధువు మెడలో కట్టించటంతో పెళ్ళితంతు పూర్తవుతుంది. గూడెం గూడెం కలిసి కూడు కుడచటం పద్ధతి. తియ్యని మామిడి పండ్లరసం, జుంటి తేనె, గెనుసు గడ్డలు - ఇవి వాళ్ళ ఆహారం.

**౨. బహు భార్యాత్వవ్యవస్థ:**

మగవాడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకొనటానికి వెసులుబాటున్న సమాజం ఇది. ఒక పురుషుడికి అనేకమంది భార్యలు సమాజం ఆమోదించినదే. ఒక పురుషుడిని అనేకమంది పంచుకొనవలసిన స్థితిలో కలిగే ఈర్ష్యాసూయలు, ఆశాభంగాలు స్త్రీలను లోలోపలి నుండి హింసకు గురిచేస్తుంటే, తా నొక్కడూ అందరినీ సంతృప్తి పరచవలసిన పురుషుడు ఒకరికన్ను గప్పి మరొకరిని ఆనందపెట్టటానికి నిరంతరం వ్యూహాలు పన్నుతూవుండటం బహుభార్యాత్వవ్యవస్థలో సహజం.

పారిజాతాపహరణం, బాలకృష్ణనాటకం, శివనాటకం, వేంకటేశ్వర మాహాత్మ్యం ఈ అన్నింటిలోనూ తత్సంబంధమైన బీభత్సం ఒకటి మానవసంబంధాలలో భాగమై వాళ్ళను ఆగం పట్టించటం చూస్తాం.

బాలకృష్ణ నాటకం అనే యక్షగానంలో రాధ శ్రీకృష్ణుడు తనను వదలి గోపికలను లాలిస్తున్నాడని పరితపిస్తుంది. ఈర్ష్యపడుతుంది. శ్రీకృష్ణుడిని 'దొంగ' అని నిందిస్తుంది. "ముగ్ధలను గోరితివి, వొద్దనిన విడుతువా? వొట్టి భ్రమగాని" - అన్న రాధ మాటలలో ఆడవాళ్ళ అసహాయ దుఃఖ సముద్రపు హోరు వినబడుతుంది. కృష్ణుడు గోపికలతో సంబంధం పెట్టుకొనటం రాధకు ఇష్టంలేదు. అతను తన కొక్కదానికే పురుషుడు కావాలి. అందువల్ల అతనిని గోపికలతో సంబంధం వదులుకోమని అడగాలనిపించింది. అడిగినా వదులుకోని పురుషనైజం తెలిసిన మనిషి. కనుకనే 'వొద్దనిన విడుతువా? వొట్టి భ్రమగాని' అని తనది నెరవేరనికోరిక అని తెలిసి, ఒక నిరాశానుభవంలోకి క్రుంగిపోయింది. కృష్ణుడిని గోపికల వెంటపడకుండా ఆపలేని అశక్తత, తాను అతనిని వదులుకోలేని బలహీనత ఏకకాలంలో రాధను నీరుగార్చాయి. "నీ మదికి దోచని నీతు లికను లే;వేమికను చెప్పుదును" - అనటమే కాదు; 'నీకు సమ్మతమైన దే కార్యమైన మతి నాకు సమ్మతి గాదె' అని తన అయిష్టాన్ని లోలోపల అణచుకొని, అతనికి ఇష్టమైన దానినే తన ఇష్టంగా మలచుకొనే స్థితికి చేరుతుంది. బహుభార్యాత్వ వ్యవస్థలో స్త్రీకి ఈ నిస్సహాయ ఆక్రోశం, దానితో పాటే రాజీ అనివార్యమైన విషాదాలు.

పారిజాతాపహరణము యక్షగానంలోనైనా, శివనాటకం యక్షగానంలోనైనా బహుభార్యలు కల పురుషుడి ప్రవృత్తి - తన అవసరాలు - తన సుఖాలు - ప్రయోజనాలు తప్ప, ఆడవాళ్ళ అంతరంగాలను పట్టించుకోని ప్రవృత్తి - ఈ ప్రవృత్తి లక్షణం తెలుస్తూ కూడా పురుషుడిని ఏమీ అనక, అతని దయకై పాకులాడుతూ, బ్రతిమిలాడుతూ తమ ఆక్రోశాలను తోటిస్త్రీలమీద, సవతులమీద, వెళ్ళగ్రక్కి, ఘర్షణపడటంలో అస్తిత్వాలను వెతుక్కొనే స్త్రీల స్వభావం వర్ణిత మయ్యాయి. తనకంటే పూర్వకవులరచనలలోకంటే భిన్నంగా, వాస్తవంగా పాత్రస్వభావచిత్రణ చేయటంలో వెంగమాంబ నిశిత సామాజిక పరిశీలనాదృష్టి కనబడుతుంది.

పారిజాతాపహరణం యక్షగానాన్ని చూస్తే శ్రీకృష్ణుడు 'సత్యభామా లోలుడు' అన్న మాటలో యథార్థం ఏమీ లేదని స్పష్టమవుతుంది. పురుషులు ఎప్పుడూ ఏ స్త్రీకి లోబడినవాళ్ళు కారు. అవసరాలకొరకు, ప్రయోజనాలకొరకు ఒక స్త్రీకి లోబడిన వాళ్ళుగా కనబడతారంతే. సత్యభామకు పారిజాతం తెచ్చియిస్తానన్న కృష్ణుడు ఆమెనిద్రలో వుండగానే చెప్పకుండా శృంగారవనానికి వెళ్ళటం, రుక్మిణి, రాధ మొదలైన ప్రియురాండ్రను అక్కడకు పిలిపించుకొని వనవిహారం చేయటం, సత్యభామ కబురుచేస్తే ఆమె దగ్గరకు వెళ్ళటం, అలిగిన ఆమె తిరస్కరిస్తే మళ్ళీ వెళ్ళి రుక్మిణి మొదలైన వాళ్ళతో యథాప్రకారం క్రీడించటం, సత్యభామ జాబు వ్రాసి పంపితే వెళ్ళ నిరాకరించటం, సత్య స్వయంగా వెళ్ళి బ్రతిమిలాడి భంగపడటం, ఆ తరువాత కృష్ణనామజపం చేసి, చేసి, చివరకు అతడిని ప్రసన్నుడిని

చేసుకొనటం-ఈ ఘటనల వరుస అంతా సత్యభామ కాకపోతే మరొక్కరు అన్న ధీమాతో కృష్ణుడు ప్రవర్తించటాన్ని, కృష్ణుడు తప్ప మరొక్క మార్గంలేక అతని దయకు పాకులాడే సత్య దైన్యాన్ని ఏకకాలంలో ప్రదర్శించింది.

ఈ యక్షగానంలో మరొక విశేషంకూడా వుంది. తిమ్మన పారిజాతాపహరణం కావ్యంలో రుక్మిణీ సత్యభామలు ఇద్దరే ప్రధానం. నారదుడు పారిజాతం తెచ్చివ్వగానే దానిని వీళ్ళిద్దరిలో ఎవరికి ఇవ్వాలనే ప్రశ్న వచ్చింది; కానీ కృష్ణుడి మనస్సులోకి మిగిలిన ఆరుగురు భార్యలు రానేలేదు. అలాగే పువ్వును శ్రీకృష్ణుడు రుక్మిణికి ఇచ్చాడని తెలియగానే ఆ అరుగురు తమతమ కోపాలను, అసంతృప్తులను లోలోపల అణచుకొన్నారు. సత్యభామ ఒక్కతే అస్తిత్వ నిరూపణకు ప్రయత్నించి విజయం సాధించింది. అయితే వెంగమాంబ వ్రాసిన ఈ విష్ణుపారిజాతంలో మిగిలిన ఆరుగురూకూడా సత్యభామ అంతటి అస్తిత్వస్పృహ కలవారే కావటం గమనించదగింది. శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని తెచ్చి సత్యభామ పెరటిలో నాటించిన తరువాత ఆ అరుగురూ శ్రీకృష్ణుడిని అడ్డగించి 'దాని కిచ్చినట్ల తరువొక్కటొక్కటి పూని మా కియ్యక పోనీము కృష్ణ!' - అని గొడవచేశారు. శ్రీకృష్ణుడు వారి నందరినీ శాంతింపచేయటానికి రుక్మిణిని పిలిపించటం, ఆమె వారందరినీ శాంతింపచేయటం వేరే సంగతి. వారి అసంతృప్తులకు ఒక పరిష్కారంగా కృష్ణుడు సత్యభామకు చెప్పి, అందరికీ పారిజాతాలు ఇప్పించటం మరొక సంగతి.

**ఈ యక్షగాన రచనలో భామాకలాప పద్ధతి అనుసరించబడిందని పరిశోధకులు స్పష్టంచేశారు.**

భామాకలాపంలో సత్యభామ తనను తాను పరిచయం చేసుకొనటం ఒక ముఖ్యాంశం. వెంగమాంబ తన రచనలో ఒక్క సత్యభామచేతనేకాక రుక్మిణి మొదలైన తదితర అష్టభార్యలచేత, రాధచేతకూడా స్వీయపరిచయవాక్యాలు పలికించే వృత్తాంతాలను కూర్చింది. పురుషుని దృష్టిలో ఒక స్త్రీ ప్రధానం, మరొక స్త్రీ అప్రధానం కావచ్చు కానీ, స్త్రీ లందరూ మానవవ్యక్తులే కనుక, ఎవరికి వారికే వాళ్ళ ఉనికి, ఆకాంక్ష ముఖ్యమైనవి అవుతాయి. ఎవరికైనా ఉపేక్ష భరించరానిదిగానే వుంటుంది. అందువల్లనే వెంగమాంబ రుక్మిణీ సత్యలనే కాక మిగిలిన ఆరుగురినికూడా వారి మనోభావాలు వ్యక్తమయ్యేట్లు కథలో భాగం చేయగలిగింది.

సవతుల వైరుధ్యాల సమస్య బహుభార్యాత్వవ్యవస్థ తెచ్చిపెట్టి పెంచిపోషిస్తున్న సమస్య. ఈ సమస్యను గుర్తించటం తన రచనలలో దానిని ప్రధానం చేయటం వెంగమాంబ రచించిన పారిజాతాపహరణ యక్షగానంతోపాటు శివనాటకంలోనూ కనబడుతుంది. ఒక వ్యక్తిని ఇద్దరూ పంచుకొనవలసి రావటమే ఈ వైరుధ్యానికి మూలం. అందుకు కారకుడైన పురుషుడు నిత్యచిదానందుడు. ఆ వైరుధ్యాల తీవ్రతలో జీవితాన్ని గురించిన నిత్యఅభద్రతలో ఎప్పటి కప్పుడు ఉనికిని కాపాడుకొనటానికి ప్రయత్నంచేసే క్రమంలో స్త్రీలు ఈర్ష్యాళువులు, గయ్యాళులు అవుతున్నారు. శివనాటకంలో శివుడు గౌరిమీద అలిగి గంగ యింటికి వచ్చాడు. మళ్ళీ గౌరిమీదకు మనసుపోయి అబద్ధాలు ఏవో చెప్పి, గౌరి ఇంటికి వెళ్ళాడు. శివుని జాడ వెతుక్కొంటూ వచ్చిన గంగ చెలికత్తె తిరిగి రమ్మని అడిగితే నిరాకరించాడు. గంగ స్వయంగా వచ్చి అడిగినా నిరాకరించాడు. గంగ కోపంతో

సకల లోకాల్లోని జలాలను ఉపసంహరించింది. పెద్ద గగ్గోలు పుట్టింది. దేవతలు వచ్చి శంకరుడిని ప్రార్థించారు. ఆయన పార్వతిని ఒప్పించి గంగ నగరికి వెళ్ళాడు. పార్వతి శివుడిని వెదుక్కొంటూ స్వయంగా అక్కడికి వచ్చింది. గంగాపార్వతుల మధ్య సంవాదం, చివరకు శివుడు వాళ్ళను సమాధానపరచటం - ఇది ఇందులోని కథాఘటనల క్రమం. శివుడు పార్వతికి సూర్యుడిచ్చిన రత్నహారం ఇయ్యటం-గంగకు కోప కారణమైం దన్నట్లుగా చెప్పటం, బ్రహ్మ ఇచ్చిన మాణిక్యాలహారం ఇచ్చి శివుడు ఆమెను ప్రసన్నం చేసుకొన్నవాడవటం-కథలో భాగాలే కానీ, వాటి ప్రమేయం లేకుండా చూచినా ఈ కథాగతికి వచ్చే చెప్పుకోదగ్గ మార్పేమీ లేదని గ్రహించాలి. ఈ మొత్తం కథాక్రమంలో శివుడికి - ఆ మాటకు వస్తే బహుభార్యలు కల పురుషుడికి - ఒక భార్యమీద కోపం వస్తే మరొక భార్య దగ్గరకు వెళ్ళే వీలుంది. భార్యకు మాత్రం ఆ భర్తకు ప్రత్యామాయం లేదు. అతను నిర్లక్ష్యం చేస్తున్నా, తిరస్కరిస్తున్నా అతని వెంట వెంటనే తిరగాలి. ప్రాధేయపడాలి. భంగపడే క్రమంలో పొందిన అవమానం నుండే సవతిని శత్రువుగా చూచి కయ్యానికి దిగే స్థితికి చేరుతారు. గంగా గౌరీ సంవాదం ఆ కోవలోదే. ఇది శంకరుడికి వినోదం.

బహుభార్యాత్వ వ్యవస్థలోని శత్రు వైరుధ్యాలు తనవరకు తాకకుండా జీవితం సజావుగా సాగిపోవటానికి పురుషుడు ఎంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంటాడో వేంకటాచల మాహాత్మ్యములో కనబడుతుంది. భృగుడు విష్ణువును పాదంతో తన్నితే లక్ష్మీదేవి అలిగి వైకుంఠం వీడి వెళ్ళిపోయింది. లక్ష్మిలేని వైకుంఠంలో వుండలేక

విష్ణువు వైకుంఠం వదలి తపస్సు చేసుకొనటం, వకుళపోషణలోకి రావటం, ఆకాశరాజుపుత్రికను చూడటం, పెళ్ళాడటం - ఇది వేంకటాచల మాహాత్మ్యంలోని కథాగతి. ఈ పెండ్లికి లక్ష్మీదేవిని పిలిపించటంలో వున్నది వైచిత్రి అంతా. ఆమెను పిలిపించింది ఎందుకు? తన రెండవ పెళ్ళికి వేంకటేశ్వరుడు ఆమె అనుమతిని అడగటానికి. నీవు అలిగి వెళ్ళినప్పటినుండి నిన్నే తలచుకొంటు న్నాను - అని లక్ష్మీదేవికి చెప్పాడు. నీ మంగళసూత్ర మహిమవల్ల, పతివ్రతానిష్ఠవల్ల నేను జీవించానని చెప్పాడు. అదలా వుండనీకానీ, ఆకాశరాజు కూతురు నన్ను మోహించింది, కనుక నేనామెను పెళ్ళాడాలని అనుకొంటున్నాను-అని చెప్పి '...నీ వాడమంటివేని/ పెండ్లియాడెద; లేకున్నఁబెండ్లివలదు" అని ఆమె అనుమతిని అడిగాడు. అనుమతి అడగటం మాటవరసకేనని, ముందుముందు తనకు మాట రాకుండా చూచుకొనటం కొరకేనని ఎవరైనా సులభంగా గ్రహించగలరు. లక్ష్మీదేవి కూడా గ్రహించింది. తాను అభ్యంతర పెట్టికూడా ప్రయోజనం లేదని తెలిసిన లౌక్యంతో '...నీవు పెండ్లి కావలయు ననిన/ నేను విఘ్నము సేయను" అని వాగ్దానం చేసింది. "- - - నీకు నేను గలిగియును లేకయుండెడు కారణంబుచే వివాహేచ్ఛ పుట్టె నీచిత్తమున" - అని విష్ణువుకు వివాహేచ్ఛ కలగటంలో అతని ప్రమేయాన్ని తొలగించి, తను ఇల్లు వదిలి రావటమే కారణమని నెపాన్ని తన మీదకు ఆరోపించుకొన్నది. అతని ద్వితీయ వివాహంవల్ల తనకు కలుగుతున్న కష్టాన్ని కప్పిపుచ్చుకొనే క్రమానికి ఆ రకమైన అభివ్యక్తి ఆమెకు అవసరం అయింది. లక్ష్మీదేవి 'నా కిది సమ్మతమైనది/నీకిఁక సంశయమువలదు" అని పద్మావతితో వివాహానికి తనఆమోదాన్ని

తెలపటం తనగౌరవాన్ని, గంభీరతను నిలుపుకొనటంలో భాగమే! సమ్మతించనన్నా జరిగి తీరే వివాహాలే ఇటువంటివి అన్నీ. సమ్మతించనని గొడవపడటం కాక, సమ్మతిని తెలపటం ద్వారా రాజీపడి బ్రతికే ఎందరు ఆడవాళ్ళనో వెంగమాంబ లోకంలో చూచి వుంటుంది. ఆ లోకవృత్త పరిశీలననుండే దైవానికి మానవజీవన ప్రవృత్తిని ఆపాదించి చెప్పగలిగింది.

ఎంతోమంది స్త్రీలను పెళ్ళాడే పురుషుడు ఏ స్త్రీకీ న్యాయం చేయలేకపోవటం సమాజంలో కనిపించే వాస్తవం. వెంగమాంబ ఈ వాస్తవాన్ని వేంకటేశ్వరుడి ప్రవృత్తిలో చూపించింది. లక్ష్మీదేవి అనుమతి తీసుకొని పద్మావతిని పెళ్ళాడిన వేంకటేశ్వరుడు ఆమెతో కొన్నాళ్ళ పాటు కాపురం చేశాక "నీ విచ్చట నను(గూడుటకై వననిధితనయ వచ్చినప్పుడు తిరుగా నావక్షః స్థలి నిడుకొన కావేళనె పంచి తచటి కబ్జదళక్షీ! - అనే వాస్తవాన్ని వేంకటేశ్వరుడి ప్రవృత్తిలో చూపించింది. లక్ష్మీదేవి అనుమతి తీసుకొని పద్మావతిని పెళ్ళాడిన వేంకటేశ్వరుడు ఆమెతో కొన్నాళ్ళ పాటు కాపురం చేశాక "నీ విచ్చట నను(గూడుటకై వననిధితనయ వచ్చినప్పుడు తిరుగా నా వక్షస్థలి నిడుకొన కావేళనె పంచి తచటి కబ్జదళాక్షీ!" అని పద్మావతి కాపురం కొరకే తాను లక్ష్మీదేవిని తిరిగి స్వీకరించలేదని ఆమె మీద తానెంతో దయ చూపినట్లు చెప్పాడు, నీ వొక్కదానివి కాపురం చేస్తూ నన్ను అరక్షణమైన వదలక ఆనందంతో కాపురం చేస్తున్నావు కదా! లక్ష్మీదేవి వచ్చి ఎప్పుడూ నా వక్షస్థలం మీద నివసిస్తే చూచి సహించగలవా?,- 'అని ఆమె అంతరంగాన్ని అర్థం చేసుకొనటానికి ఒక పరీక్ష పెట్టాడు పద్మావతి 'రమాదేవిని మీవక్షస్థలం మీద నిలుపుకొంటే నాకేం కొదవ'

కలుగుతుందని ప్రశ్నించి, అతని అభీష్టం నెరవేర్చటానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. తనకు వేంకటేశ్వరుడు లభించటానికి కారణమైన రమాదేవికి, తనను పెళ్ళాడటానికి అతనిని అనుమతించిన రమాదేవికి, తాను ప్రత్యుపకారం చేయటం ధర్మమని, వేంకటేశ్వరు డామెను తిరిగి తీసుకొని వస్తే తాను ఆమె పదములు గౌరవంతో కొల్చుకొంటుంటా నని ఆమె వాగ్దానంకూడా చేసింది. భర్త మరొక స్త్రీపట్ల చూపే ప్రేమను ఆమెదించటమే స్త్రీధర్మంగా సమాజంలో చలామణి అవుతున్న తీరు యొక్క ప్రతిఫలనం ఇందులో కనబడుతుంది. మొత్తానికి రెండవ స్త్రీతో సంబంధానికి మొదటి భార్యపైనా, మొదటిభార్యతో యథాపూర్వక సంబంధాల కొనసాగింపునకు రెండవ భార్యపైనా పురుషుడు తెచ్చే 'ధర్మబద్ధమైన' ఒత్తిడి యొక్క స్వభావాన్ని వెంగమాంబ చాలా సమర్థవంతంగా ఇక్కడ వ్యక్తం చేయగలిగింది.

**3. కుటుంబజీవన సంస్కృతి:**

తరిగొండ వెంగమాంబ తా నెంతగా కుటుంబ సంబంధాలలో చిక్కుకోకుండా ఆధ్యాత్మిక భక్తి మార్గాలలో తన జీవితాన్ని నడిపించుకొన్నా, కుటుంబ సంబంధాలలోని ఆత్మీయతానుబంధాలను ఆమె బాగానే గుర్తించింది. భక్తిమార్గప్రస్థానంలో ఆమెకు భిన్న కుటుంబజీవన సంస్కారాలు కూడా తెలియవచ్చాయి. తన ఇంటిని దాటి, తిరుపతికి చేసిన ప్రయాణంకూడా మానవసంబంధాలనూ తాను పుట్టి పెరిగిన బ్రాహ్మణకుల కుటుంబపరిధినీ దాటి విస్తృతస్థాయిలో పరిశీలించటానికి, అర్థం చేసుకొనటానికి తోడ్పడింది. చెంచునాటకము, జలక్రీడావిలాసమువంటి యక్షగానాలలో

వెంగమాంబ సమకాలపు సాంఘికవ్యవస్థాచిత్రణలో భాగంగా కుటుంబజీవన సంస్కృతిని ప్రతిఫలింపచేసింది.

చెంచునాటకములో చెంచుయువతి చెంచునాయుడు భార్యాభర్తలు. చెంచిత మాటలనుబట్టి అతని రూపం అంత సుందరమైనది కాదు. అతను అసూయాపరుడన్నది ప్రత్యక్షంగా అతని ప్రవృత్తిలోనే తెలుస్తుంది. వేంకటేశ్వరుని దర్శనానికి వెళ్ళాలని అభిలషిస్తున్న భార్యను వెళ్ళ నక్కరలేదని అభ్యంతర పెడతాడు. అభ్యంతర పెట్టటానికి కారణం - వేంకటేశ్వరుడు ఆమెను తిరిగి రానీయనంతగా ఆకర్షిస్తే తనగతేమిటన్న చింత.

అలాగే కుటుంబాలలో భార్యల దుఃఖం భర్తలకు పట్టనిదే అవుతుంది. పురుషులకు కావలసింది - తమ అవసరాలు తీరటం, తమ సౌఖ్యం, తమ సౌకర్యం సమకూరటం. కొడుకును పులి ఎత్తుకు వెళ్ళిందని ఏడుస్తున్న భార్యను చూచి, 'నీవిట్లు పడిపోతే నా కూటి కెట్లు'? అని తన తిండికి రాబోయే ఇబ్బంది దృష్ట్యానే ఆమెను పరామర్శించ గలిగాడంటే పురుషుడిది ప్రయోజనాల దృక్పథమేకాని, విలువల దృక్పథం కాదని స్పష్టం అవుతుంది. మొత్తంమీద 'అసమ దాంపత్యాలు, కుటుంబంలో ఎంత సాధారణంగా సహజ మన్నట్లుగా సాగిపోతున్నాయో సూచిస్తున్నట్లుగా వున్న దీ సందర్భం.

జలక్రీడా విలాసము, శ్రీకృష్ణ జననం, శ్రీకృష్ణుని దుడుకు పనులు, వాటిని భరించలేక గోపకాంతలు యశోదకు చేసే ఫిర్యాదులు, వలస పోతామన్న వాదనలు, గోపికల జలక్రీడలు, వస్త్రాపహరణం మొదలైన ఘట్టాలతో కూడిన యక్షగానం.

కుటుంబంలో పిల్లలపుట్టుక తెచ్చే సందడి, తల్లుల ఆరాటం, పెంపకంలో పడే హడావుడి ఇవన్నీ సహజ సుందరంగా ఇందులో భాగం అయ్యాయి. పురిటి బిడ్డకు నీళ్ళు పోస్తుంటే తల్లిగా యశోద పిల్లవాడు ఎక్కడ ఉక్కిరి బిక్కిరి అవుతాడోనని తల్లడ మందటం మొహానికి చెయ్యి అడ్డం పెట్టి నీళ్ళుపోయమని, కన్నులను, తలమాడును, ముక్కును, చెక్కులను ఒత్తుతూ నీళ్ళు పోయమని, తొడలు, మోకాళ్ళు, చేతులు సాగదీసి నీళ్ళు పోయమని ఒకదానిమీద ఒకటిగా సూచనలు చేస్తూ పోవటం (పు 71,72) తల్లిగా బిడ్డ క్షేమంపట్ల ఆమె ఆరాటాన్నే కాదు; తెలుగు ఇళ్ళల్లో బిడ్డలకు నీళ్ళుపోసే పద్ధతిని తరిగొండ వెంగమాంబ ఎంత చక్కగా పట్టుకొన్నదోకూడా తెలియ చేస్తుంది.

శ్రీకృష్ణుడి బాల్యచేష్టల వర్ణనల సందర్భంలో ఒక ఘటన- శ్రీకృష్ణుడు ఆవలించగా యశోదకు అతనికడుపులో పాలు ఏరులై పారినట్లు, వెన్నముద్దలు గుంపులై తేలినట్లు కనిపించటం - ఇది చూచి యశోద కొడుకుకు తాను పోసిన పాలు, పెట్టిన వెన్న జీర్ణం కాలేదేమోనని ఆందోళనపడుతుంది. పాపనికి ఏ వైద్యం చేయాలని ఆరాటంగా వారినీ వీరినీ అడుగుతుంది. వాము, వస వేయించి పోద్దామా? సన్నభేరి ఇద్దామా? కారపుండలు తినిపించి, బొడ్డుచుట్టూ వేణ్ణీళ్ళు పోద్దామా? అని రకరకాల ప్రత్యామాయాలను మార్చిమార్చి అడుగుతుంది. (86) స్త్రీల చేతిలో వున్న ఈ గృహవైద్య పరిజ్ఞానాన్ని ఇక్కడే కాదు, ఇదే యక్షగానంలో మరికొన్ని చోట్ల కూడా వెంగమాంబ నమోదు చేసింది. మందు పెడ్తే కలిగే మత్తుకు విరుగుడుగా యెఱ్రగడ్డల రసం, చల్ల త్రాగించటమని (97) అజీర్ణానికి కడుపు నిమురుతూ

వేణ్ణీళ్ళు (141), నోటిమాట చక్కగా రావటానికి వస, సరస్వతీఆకు, తేనె, పిప్పళ్ళు మొదలైనవి నమలవలసినవి అనీ (164,165) కథాక్రమంలో భాగంగా చెప్పటం జరిగింది.

చేతి కంకణాలు ఘల్లుఘల్లుమనగా 'ప్రొద్దూప్రొద్దున' పెరుగు చిలికే గొల్లభామల శ్రమజీవన సౌందర్యాన్ని, అత్తాకోడళ్ళ అధికార అధీన సంబంధాలను, కోడళ్ళకు పెద్దదిక్కుగానో, కావలిగానో అత్త నిర్వహించే పాత్రను, తనకు ఆకలి అయ్యే సమయానికి అంబలి అమర్చాలన్న భయం కూడా లేదని భార్యమీద పెత్తనంచేసే భర్తల అధికారపాత్రను స్త్రీల కదలికల మీద, శీలంమీద భర్తల పరోక్షనియంత్రణను, పెత్తనాన్ని తత్సంబంధమైన స్త్రీల నిత్యభయాలను తరిగొండవెంగమాంబ ఈ యక్షగానంలో చక్కగా చూపింది. మగళ్ళు తిడతారన్న భయం, కొడతారన్న భయం ఇవన్నీ స్త్రీల భయాలే! (193)

"మగవానిమాట యి - మ్మహి మంచుమూట
వగలు జూపే మేలు - వనధిపై వ్రాలూ
కామించె విభ్రమము - గగన కుసుమము" - - - (207)

అన్న స్త్రీల అభిప్రాయాన్ని, అనుభవాన్ని కూడా ఇందులో మనం చూడవచ్చు.

శ్రీకృష్ణుడి బాల్యాన్ని వర్ణించే ఘట్టాలలో వెన్నెలకుప్పలు, కన్నామిచ్చి, చెడుగుడు, గుడుగుడుగుంత, గిరగిరతిరుగుట, గచ్చకాయలు, పరుగెత్తి ఒకరినొకరు ముట్టించుకొనటం - మొదలైన ఆటలు ప్రస్తావించబడ్డాయి. (105,120,147). జలక్రీడల

సందర్భంలో గోపికలు శ్రీకృష్ణుడు ఎత్తుకువెళ్ళిన తమకోకల గుర్తులు, రంగులు, నాణ్యత మొదలైన వాటిని పేర్కొంటూ (182,203) చెప్పిన విషయాలు ఆంధ్రదేశంలో చేనేత పరిశ్రమ యొక్క విస్తృతిని, వైభవాన్ని వ్యక్తం చేస్తాయి.

**4. విలువలు:**

తరిగొండ వెంగమాంబ తనరచనలలో చిత్తశుద్ధిలేని సామాజిక అచారాలను, గుణంతో నిమిత్తంలేని కులాధిక్య భావనలను, ఐహిక భోగలాలసతను నిరసించింది.

> *"మనసొక శుద్ధిలేక ఘనమాయకు లోఁబడి యుండి నీళ్ళలో*
> *మునిగి శరీరమున్న దని పొందుగ నందఱు చూచుచుండఁగాఁ*
> *గనులటు తేలవేసి కరకంజములన్ ముకుళించి మంత్రముల్*
> *గొనిఁగిన ముక్తిరాదు తరిగొండనృసింహ! దయాపయోనిధీ".*

మనసు శుద్ధిగా లేకపోతే స్నానాలు చేసినంతమాత్రాన ముక్తిరాదని నృసింహశతకంలో పేర్కొన్నది - వెంగమాంబ. ఆచారాలకన్న అంతరంగ శుద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన ఆధ్యాత్మికతత్త్వం ఆమెది.

> *"ముట్టని దూరమేగి యట మూఁడు దినంబులు బైటనుండి యా*
> *ము ట్టెడఁ బాపఁబూని బహుముఖ్యతరంబుగ బొంది నీళ్ళలోఁ*
> *బట్టుగ ముంచివేసినను పన్నుగ దేహికి ముట్టు పోవునే?*
> *.......................................................................................................''*

అని ప్రశ్నించింది-వెంగమాంబ. మూడుదినముల ముట్టు బహిష్టు ముట్టు కావచ్చు; పురిటి ముట్టు కావచ్చు; చావుముట్టు కావచ్చు. మూడు రోజులో పదకొండురోజులో దానికి కాలపరిమితి

వుండవచ్చు. ఆ కాల పరిమితి దాటిన తరువాత ఒక స్నానం చేస్తే ముట్టు పోతుందనుకొంటారు. కానీ, దేహం ముట్టుతో అనివార్యసంబంధంలో వుంటుందనీ, అది తెలియక స్నానాలతో అన్నీ పోతాయనుకొనటం భ్రమ తప్ప మరొకటి కాదని బాహ్య ఆచారాలను తిరస్కరించి మాట్లాడింది - వెంగమాంబ.

లోభం మహాచెడ్డగుణం అని, సంచయనేచ్ఛను నిరసించింది - వెంగమాంబ.

> *"పాటిగ నగ్ని సాక్షిగ వివాహమయైన పతివ్రతామణిన్*
> *నీటున నొల్లకన్ మిగుల నేరము లెన్నుచుఁగొట్టి తిట్టుచున్*
> *ధాటిగ నన్యకాంతను ముదంబున రక్షణ చేసి దానితోఁ*
> *గూటమి పాపహేతువు --------"*

అని ఈ నృసింహశతకంలోనే వెంగమాంబ భార్యను నిర్లక్ష్యం చేయటం, తప్పులెన్నుతూ కొట్టటం, తిట్టటం, పరస్త్రీని ఆదరించి సంగమించటం పాపహేతువులని చెప్పింది. పెళ్ళిని గొప్ప వ్యవస్థగా చెప్పే సమాజంలోనే పెళ్ళిని గౌరవించలేని పురుషులు వుండటాన్ని తరిగొండ వెంగమాంబ గుర్తించింది. అగ్నిసాక్షి వివాహం అతిపవిత్రమైంది అంటారు. ఆ వివాహం ద్వారా 'నాతిచరామి' అని స్వీకరించిన భార్యను హింసించే దుర్మార్గ స్వభావం హేయమైనదని వెంగమాంబ అభిప్రాయం. వివాహేతర సంబంధాలు అంతకంటే అసహ్యించుకొనదగినవి. అందుకనే వెంగమాంబ నిర్ద్వంద్వంగా అవి పాపహేతువులని చెప్పింది.

అంతరువుల వారీ వర్ణసమాజంలో క్రింది స్థాయి వర్ణం ఎప్పుడూ నీతిబాహ్యమైనదిగానో, దోషగుణం కలదిగానో, నిత్యం

అనుమానానికి, అవమానానికి గురిఅవుతూనే వుంటుంది. తనతప్పు ఏమీ లేదని నిరూపించుకొనవలసిన బాధ్యత పూర్తిగా వాళ్ళదే. ఇలాంటి సామాజిక వ్యవస్థ పితృస్వామికంకూడా కావటంవలన, అట్టడుగు కులానికి చెందిన స్త్రీ అత్యంత దుర్మార్గమైన హింసకు, నిందకు గురికావలసి వస్తుంటుంది. వేంకటేశ్వర మాహాత్మ్యంలో 'కుంతల' అనే మాలస్త్రీ జీవితానుభవంద్వారా సామాజిక స్థితికి అద్దం పట్టి చూపించింది - వెంగమాంబ. మాధవుడు అనే బ్రాహ్మణ యువకుడు - వివాహమైనవాడు - కుంతలపై మరులుగొన్నాడు. బలవంతంగా ఆమెను లోబరుచుకొనే ప్రయత్నం చేసాడు. ఆ సందర్భంలో ఆమె "--- ఈ బ్రాహ్మణుఁడు పాపజాతినైన నన్నుఁ బొంది కులహీనుఁడై నరకంబునఁ బడుటకు బ్రయత్నించి సముద్రముప్పొంగి వచ్చునట్లు నాపైఁ బడ వచ్చుచున్నాడు. నావలన నించుకేని దోషంబులేదు. మీ రెల్లరు నాకు సాక్ష్యమిచ్చువారగుదురుగాక! ---" అని ఆమె దిక్కులను, దేవతలను ఉద్దేశించి పలికింది. (4 ఆశ్వాసం, 74వ,) ఈ వచనంలో గమనించదగిన అంశాలు -1. మాలెత తనను తాను పాపజాతి అనుకొనటం 2. తనను పొందేవాడు కులహీను డవుతాడని నమ్మటం 3. తనవలన దోషంలేదని నమ్మబలకటం 4. తన దోషంలేనితనానికి సాక్ష్యాన్ని కూడగట్టుకొనే తాపత్రయంలో వుండటం. సామాజిక వర్ణవ్యవస్థ ఒక కులంయొక్క ఆధిక్యతను, మరొక్క కులంయొక్క హీనతను పైవర్ణం నుండి క్రిందివర్ణం వరకు అందరూ నమ్మి ఆమోదించి ఆచరించేట్లు చేసే భావజలాన్ని సమర్థవంతంగా, శక్తిమంతంగా అభివృద్ధి చేయటంలో విజయం సాధించిందనటానికి మొదటి రెండంశాలు నిదర్శనం. స్త్రీలు మోహనాకారులనీ పురుషులను

అకట్టుకొని చెడుదారులకు ఈడుస్తారనీ మగవారి మోహప్రవృత్తిని కప్పిపుచ్చి, దానిని ఆడవాళ్ళకు ఆపాదించి, దోషులుగా నిలబెట్టే మను ధర్మం స్త్రీలను ఎప్పుడూ సంజాయిషీలు చెప్పుకొనవలసి నస్థితిలో వుంచుతుంది. అందులోనూ ఆ స్త్రీ సామాజిక వర్ణవ్యవస్థలో అట్టడుగు స్థాయికి చెందినదయితే మరింత నిందను మోయాల్సి వస్తుంది. మరింత తీవ్రమైన శిక్షను అనుభవించాల్సి వస్తుంది. ఈ కథాసందర్భంలో మాలెత స్థితి అదే. ఆ భయంవల్లనే ఆమె 'నావల్ల కొంచెం కూడా దోషం లేదు' అని సంజాయిషీ చెప్పవలసి వచ్చింది. అయితే న్యాయస్థానాలు స్త్రీలమాటను నమ్మి తీర్పు చెప్పటానికి సిద్ధంగా వుండవు. న్యాయస్థానానికి సాక్షులు కావాలి. అట్టడుగు స్థానంలోని మనుషులకు, స్త్రీలకు అనుకూలంగా సాక్ష్యం చెప్పగలిగిన వాళ్ళెవరైనా ఉన్నారా?. అలాంటి సాక్ష్యాలు లేనప్పుడు ఆ స్త్రీ వలన దోషం 'ఇంచుకేని' లేకున్నా దోషిగానే నిర్ధారించబడటం లోకవాస్తవం. అందుకే ఆమె దిక్కులను, దేవతలను - మీరెల్లరు నాకు సాక్ష్యమిచ్చేవారగుదురు కాక!- అని తనపక్షాన, న్యాయంపక్షాన మాట్లాడే ధర్మబుద్ధి వారిలో మేల్కొనాలని ఆకాంక్షించింది.

తరిగొండ వెంగమాంబ స్త్రీగా స్త్రీల ఆత్మగౌరవ చైతన్య స్పృహతో వున్న దనటానికి వేంకటాచల మాహాత్మ్యంలోని ఈ ఘట్టంతో పాటు, ద్విపద భాగవతంలోని మరొక సందర్భంకూడా నిదర్శనంగా వుంది. పోతన భాగవతమును అనుసరించి చేయబడిన రచన ద్విపద భాగవతం. పోతన భాగవతంలో ద్రౌపది తనపతులచేత ఉపేక్షితయైన తరువాత **"జగత్పతియైన వాసుదేవునందుఁ జిత్తంబుసేర్చి తత్పదంబు సేరె" అని వున్న మాటలను వెంగమాంబ" మాధవుని మనమునఁజింతించి, మగలపై మమతఁ**

దా వీడి హరిపదద్వయమందుఁజేందె" అని మార్చింది. భర్త కాదంటే దేవుడిపైకి దృష్టి మళ్ళించటం స్త్రీధర్మంగా చేసిన లోకరీతిపై వెంగమాంబకు కోపం. స్త్రీ అంటే అందరిచేత తిరస్కరింపబడుతూ, మరొక గత్యంతరము లేనిస్థితిలో భగవంతుడిని ఆశ్రయించేది కావటం ఆమె వ్యక్తిత్వాన్ని పూర్తిగా హీనం చేసే అంశం. స్త్రీవ్యక్తిత్వం ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఆమెకే వుండటంలో వికసిస్తుంది. స్త్రీ వ్యక్తిగా నిలబడటం వెంగమాంబ ఆకాంక్ష. అందువల్ల ద్రౌపదిని భర్తలు కాదంటే భగవంతుడి వైపు మళ్ళిన స్త్రీగా కాక, భర్తలపై మమతను స్వచ్ఛందంగా వదులుకొని, స్వచ్ఛందంగానే హరిపదద్వయమందు చెందిన స్త్రీగా మార్చింది. ఆ రకంగా స్త్రీలపట్ల అమలవుతున్న అసమజీవన విలువలను తిప్పికొట్టటం వెంగమాంబ సాధించిన కొత్త విలువ!

అదే విధంగా పోతన భాగవతంలో పరీక్షిత్తు కలిస్థానాలుగా చెప్పిన చోట్లలోకూడా వెంగమాంబ చేసిన మార్పు స్త్రీల ఆత్మగౌరవచైతన్యానికి సంబంధించినదే. కలి ప్రాణివధ జరిగేచోట, స్త్రీలున్నచోట, జూదపాన వ్యసనా లున్నచోట చరిస్తుంటాడని భాగవతం పేర్కొంటుండగా, స్త్రీలున్న చోట కలి తిరుగుతుంటాడని చెప్పటం స్త్రీ జాతికే అవమానంగా వెంగమాంబకు తోచివుంటుంది. స్త్రీలున్నచోట కలి తిరుగుతాడని చెప్పటం స్త్రీలను పాపకర్ములుగా చూచే, చెప్పే పితృస్వామిక మనుధర్మంలో భాగవే. ఈ పురుషధర్మాన్ని తిప్పికొట్టటం వెంగమాంబ లక్ష్యం. అందుకనే ఆమె కలి వుండేస్థానం స్త్రీలు వున్నచోటు కాదు; 'పారి పరస్త్రీలను పొందెడి చోటు' అని మార్చి దాంపత్యధర్మాన్ని అతిక్రమించి ప్రవర్తించే పురుష దుర్మార్గమే కలిస్థాన మని నిర్ద్వంద్వంగా సూచించింది.

ఆ విధంగా వెంగమాంబ సాహిత్యసృజన అంతా తరిగొండ నృసింహస్వామికి అభిన్నుడుగా భావించబడిన వేంకటేశ్వర స్వామినీ, శ్రీకృష్ణుడినీ ఆశ్రయించుకొని సాగినా, భక్తి ఉద్యమానికి సహజమైన ఒక ప్రజాస్వామిక లక్షణంచేత - ఆమె సాహిత్యంలో సామాజిక వైరుధ్యాలు, విలువలు సహజభాగమై మన అధ్యయనానికి అంది వస్తున్నాయి.

# తరిగొండ వెంగమాంబ మన మీరాబాయి

- ఆచార్య పి. కుసుమకుమారి

ఆమె పాటంటే ఏడుకొండల వాడికి పరమప్రియం. ఆమె ఇంటికి వెళ్లి అడిగి మరీపాడించుకొని, ఆ పాటకు అనుగుణంగా అడేవారాయన. ఆమె కర్పూరహారతి ఇవ్వకుంటే గోవిందుడికి నిద్ర రాదు. హారతి ఇవ్వకుండా పూజారులు ఆమెను అడ్డుకుంటే రథోత్సవాన్నే ఆపేశారు స్వామి. అంతటి పరమభక్తురాలు, యోగిని, బహుగ్రంథ రచయిత్రి తెలుగు మీరాబాయి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఆమె వాఙ్మయంపై తిరుమల తిరుపతి దేవస్థానం తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు సంయుక్తంగా ఇటీవల భాగ్యనగరంలో ఓ సాహితీ సదస్సు నిర్వహించారు. వెంగమాంబ జీవితంపై ఆ సదస్సులో వెలువరించిన విశేష వ్యాసం సంగ్రహ రూపం:

పవళింపు సేవలో 'జో అచ్యుతానంద! జోజో ముకుందా!....' అంటూ తాళ్లపాకవారి లాలివింటూ పులకరిస్తాడు గోవిందుడు. మరో వైపు శ్రీ తరిగొండ వెంగమాంబ హారతి స్వీకరిస్తూ పరవశించిపోతాడు శ్రీనివాసుడు. 'అన్నమయ్యలాలి....తరిగొండవారి హారతి' - ఈ రెండూ లేనిదే వేంకటేశునికి నిద్ర రాదు. అంతటి ధన్యజీవులలో ఒకరైన వెంగమాంబ దశాబ్దాల పాటు తిరుమలలో ఉండి, స్వామి అంతరంగికురాలిగా వాసికెక్కారు. యోగినిగా భక్తుల కైమోడ్పులు అందుకున్నారు. పలు భక్తి ఆధ్యాత్మిక గ్రంథాలు రచించారు. రెండు శతాబ్దాల క్రితమే ఛాందస భావాలను వ్యతిరేకించిన ధీశాలి ఆమె!

**భక్తితన్మయం...గానపారవశ్యం!**

చిత్తూరు జిల్లా వాయల్పాడు సమీపంలోని తరిగొండలో కృష్ణయార్యుడు మంగమాంబ దంపతులకు వేంకటేశ్వరుని అనుగ్రహ ప్రసాదంగా 1730 ప్రాంతంలో ఓ కుమార్తె జన్మించింది. స్వామి అనుగ్రహంతో పుట్టింది కాబట్టి, పాపకు 'వెంకమ్మ' అని పేరు పెట్టారు. కృష్ణయార్యుడు నృసింహ సాలగ్రామాన్ని ఇలవేల్పుగా ఆరాధించేవాడు. భక్తికి నిలయమైన ఆ యింట వెంకమ్మకు సహజభక్తి అలవడింది. బాల్యంలోనే భక్తితో మైమరచిపోయి, పరవశించి గానంచేస్తూ ఉండేదామె. అదే పనిగా భగవత్ ధ్యానంలో మునిగితేలుతున్న వెంకమ్మను చూసి తల్లిదండ్రులు కలవరపడ్డారు. పెళ్లయితే కాస్త దారికొస్తుందని భావించిన ఆమె తల్లిదండ్రులు చిత్తూరు సమీపంలోని నారగుంటపాళెంకు చెందిన వెంకటాచలపతితో వివాహం నిశ్చయిస్తారు. తిరుమల వేంకటేశ్వరుడే నా భర్త.....నాకు పెళ్లి అవసరం లేదని వెంకమ్మ తేల్చి చెబుతుంది. కొంత ఒత్తిడి చేసి ఆమెకు వివాహం జరిపిస్తారు. నన్ను సహచరిగా కాక, దైవ భక్తురాలిగా మన్నించమని భర్తను కోరుతుంది వెంకమ్మ. అతరువాత కొంతకాలానికి వెంకమ్మ భర్త అకాలమరణానికి గురవుతాడు. అటుపైన మదనపల్లికి చెందిన సుబ్రహ్మణ్య యోగి వద్ద అమె వేదాంతం నేర్చుకుంటుంది. భక్తి తత్త్వాన్ని, యోగశాస్త్ర రహస్యాలను ఆకళింపు చేసు కుంటుంది.

**తలలు బోడులైన తలపులు బోడులా? :**

భర్తపోయినా మాంగల్య చిహ్నాలను తీసేందుకు ఆమె అంగీకరించదు. "సర్వేశ్వరుడైన వేంకటేశ్వరుడు నాభర్త అయినప్పుడు

నాకు వైధవ్యం ఎలా వస్తుంద”ని ఆమె ప్రశ్నిస్తుంది. ఊళ్లోవారు ఆమెతో వాదించి నెగ్గలేక, పుష్పగిరి శంకరాచార్యుల వారిని రప్పిస్తారు. 'వైధవ్య నియమాలను ఎందుకు పాటించడం లే'దని ఆయన వెంకమ్మను ప్రశ్నిస్తారు'. శిరోముండనం చేసుకోవడం ఎలా పతివ్రతాధర్మం అవుతుం'దని ఆమె ఎదురు ప్రశ్నవేస్తుంది. 'తలలు బోడులైనంత మాత్రాన తలపులు బోడు లగునా?' అని నిలదీస్తుంది. స్వామినైన నాకు నమస్కారం కూడా చేయలేదే అని అయన ప్రశ్నిస్తారు. మీరు లేచి పక్కకు జరిగితే మీ పీఠానికి నమస్కారం చేస్తానంటుంది వెంగమాంబ. ఆమె నమస్కరించగానే ఆ పీఠం భస్మమై పోతుంది. ఈ పరిణామంతో పీఠాధిపతి ఆమెను గొప్పభక్తురాలిగా గుర్తిస్తారు. కొన్నాళ్లకు వెంకమ్మను ఆమె కుటుంబ సభ్యులే వెలివేస్తారు. పిన్నవయసు నుంచి నృసింహస్వామి భక్తురాలు కనుక కొంతకాలంపాటు ఆ ఆలయంలో ధ్యానం చేస్తూ గడుపుతుంది. అక్కడ కూడా ఆమెను సాటి కులస్థులు పరిహసించడంతో తీవ్ర వ్యధకు గురవుతుంది.

**తిరుమలకు ప్రస్థానం :**

శ్రీవేంకటేశ్వరుడు తిరుమలకు రమ్మని ఆజ్ఞాపించినట్లుగా వెంగమాంబ అనుభూతిని పొందుతుంది. తిరుమలకు చేరుకుంటుంది. అమె గొప్ప యోగిని, భక్తురాలని తెలుసుకున్న శ్రీవారి సంకీర్తనాచార్య పదవిలో ఉన్న తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల వంశీయులు ఆమెకు ఉత్తరమాడ వీథిలోని వారి ఇంటి సమీపంలో చిన్న భాగంలో ఆమెకు వసతి ఏర్పాటుచేస్తారు. ఆ యింటికి సమీపంలో ఉన్న స్థలంలో తులసి వనాన్ని పెంచి, నిరంతరం ఆ తోటలో స్వామి ధ్యానంలో గడిపేది.

నేటికీ తిరుమలలో ఆ వనం ఉంది. దానికి వెంగమాంబ బృందావనమనీ, తరిగణమ్మ (తరిగొండమ్మ తోట) అనీ పేరు.

**వెంకమ్మకు అవమానం...కదలని రథం :**

తిరుమలలో ఉన్న సమయంలో వెంగమాంబ తన భక్తిశక్తితో అనేక మహిమలు ప్రదర్శించింది. వెంగమాంబ తుంబురు కోనలో ఉన్నప్పుడు ఓ కుష్టువ్యాధి పీడితుడు అక్కడికి వస్తాడు. అతనిని గమనించిన వెంగమాంబ "శ్రీనివాసుని అనుగ్రహం వల్ల నీకు ఆరోగ్యం చేకూరుతుంది" అని అంటుంది. వ్యాధి పీడితుడు అక్కడ ఉన్న పుష్కరిణిలో స్నానం చేసి లేచే సరికి అతని వ్యాధి నయం అవుతుంది. నిత్యం వెంగమాంబ స్వామికి స్వయంగా హారతి ఇవ్వడం కొందరు పూజారులకు కంటగింపుగా ఉంటుంది. ఓ రోజు హారతి ఇస్తున్న సమయంలో ఆమెను వారు నానా దుర్భాషలాడతారు. వారిని బాధించడం ఎందకులే - అని ఆమె మరునాడు ఆలయానికి రాదు. ఆ రోజు రథోత్సవం జరుగుతుండగా రథం వెంగమాంబ ఇంటి ముందుకు వచ్చి ఆగిపోతుంది. ఎంతకూ కదలదు. వెంగమాంబను నిందించడం, స్వామికి ఆమె హారతి ఇవ్వకపోవడం వల్లే ఇదంతా జరిగిందని గ్రహించిన విప్రులు చెంపలు వేసుకొని ఆమెచేత హారతి ఇప్పిం చాకే రథం కదిలింది. ఆమె భక్తి అనంతం అనేందుకు ఇదే ఉదాహరణ.

**ముత్యాల హారతి :**

వెంగమాంబ తిరుమల చేరిన నాటి నుంచి ప్రతిరోజూ సాయంత్రం స్వామి వారికి కైంకర్య ముగిసి, ఏకాంత సేవ చేసే సమయానికి ఆలయానికి చేరుకొనేది. స్వామికి స్వయంగా కర్పూర హారతి ఇచ్చేది. దీనికే 'ముత్యాలహారతి' లేదా 'తరిగొండ వారి హారతి' అనిపేరు. అప్పుడు మొదలైన ఈ సంప్రదాయం తిరుమలలో నేటికీ కొనసాగుతున్నది.

**భక్తి వేదాంత శిఖరం :**

వెంగమాంబ రామకృష్ణ పరమహంసకు, సి.పి.బ్రౌన్‌కు, త్యాగరాజ స్వామికి సమకాలీనురాలు. ఇలవేల్పు అయిన తరిగొండ నృసింహస్వామి, ఇష్టదైవమైన వేంకటేశ్వరుడు, కులదేవతయైన చౌడేశ్వరిపై ఆమె పలు రచనలు చేసింది. శివకేశవులు ఒక్కరే - అని ప్రబోధించింది. తరిగొండ నృసింహ శతకం, నృ సింహ విలాసం మొదలు 9 యక్షగానాలను, ఆరు ఆధ్యాత్మిక నాటకాలను, ఇతర కావ్యాలను ఆమె అనితరసాధ్యంగా రచించారు. ఆమెకు రచనలకు ప్రతులు తయారుచేయటంద్వారా సహకరించేందుకు ఎనిమిది మంది రాతగాళ్లు ఉండేవారని ప్రతీతి. ఆమె రచించిన వేంకటాచల మాహాత్మ్యం నేటికీ భక్తులకు తారకమంత్రమైంది. వెంగమాంబ తెలుగుతో పాటు సంస్కృతం, తమిళ భాషలలో కూడా రచనలు చేశారు. ఆమె రచించిన మరెన్నో గ్రంథాలు నేడు అందుబాటులో లేకపోవడం విషాదం. వేదాంత, భక్తి రహస్యాలను అతి సరళంగా చెప్పిన ప్రజ్ఞావంతురా లామె! ఆమెను ఎవరు ఎన్ని విధాలా అవమాన పరచినా, పల్లెత్తుమాట అనేదికాదు. నిరంతరం భక్తిభావంతో, ధ్యానంలో గడిపేది. భగవంతుని అరాధించేందుకు భక్తి కావాలి కానీ, బాహ్యమైన ఆచారాలు, కట్టుబాట్లు సాధనాలు కావనేందుకు మాతృశ్రీతరిగొండ వెంగమాంబ జీవితం నిదర్శనం. 1817లో తుదిశ్వాస విడిచే వరకు శ్రీ వేంకటేశ్వరుని సేవలో, ధ్యానంలో తరించిన వెంగమాంబ ధన్య చరిత!

## దయా పయోనిధీ!

-శ్రీమాన్ పి.ఆర్.రంగరాజన్

"ఇహ చేత్ అవేధీత్ అథ సత్యమస్తి, నోచేదిహ అవేధీత్ మహతీ వినష్టిః" అని ఉపనిషత్తులో ఒక మంత్రం ఉంది. ఈ మనుష్య జన్మలో పరమాత్ముని గురించి తెలుసుకుంటేనే బ్రతుకు; లేకపోతే నాశనం. ఈ ఉపనిషత్ అర్థాన్ని సార్థకం చేసినట్టు. ఈ భూలోకంలో అవతరించి పరమాత్ముని సాక్షాత్కారాన్ని పొందిన ఆండాళ్-భూదేవి యొక్క అంశము. తమిళ ప్రదేశమందలి - శ్రీవిల్లిపుత్తూర్ అనే దివ్యదేశంలో కల్పసూత్ర వ్యాఖ్యాత శ్రీ విష్ణుచిత్తుని (పెరియాళ్వార్ యొక్క) కుమార్తెగా అయోనిజగా (తల్లియొక్క గర్భంలో పుట్టకుండా) ఆండాళ్ అవతరించారు. తులసీమొక్క యొక్క పరిమళంవలె అనగా వేర్లు నుండి ఆకుపై భాగం వరకు తులసిలో సుగంధం నిండివుండినట్లు ఆండాళ్ దగ్గర చిన్నతనం నుండి భగవత్ భక్తి నిండివుంది. ఎల్లప్పుడూ భగవంతునికి తమకు ఉన్నటువంటు బాంధవ్యము శరీరాత్మభావ సంబంధము- అనేదాన్ని ఆండాళ్ బాగా గుర్తించారు. భగవంతునికి కైంకర్యము చేయవలయును - అనే విషయంలో దృఢమైన సంకల్పంతో ఆండాళ్ ఉండేవారు. ఆండాళ్ వ్రాసిన "నాచ్చియార్ తిరుమొళి" అనే ప్రబంధంలో ఆండాళ్ ఇలా వర్ణిస్తున్నారు: "గోవిందర్‌కోర్ కుఱ్రేవల్ ఇమ్మై పిరవిసయ్యాదే ఇనిపోమ్మ్ సయ్యుంతవం తాన్‌యన్"? - (ఈ జన్మలో గోవిందునికి దాస్యవృత్తిని - అనగా కైంకర్యాన్ని చేయకుండా వేరే చేయవలసిన తపస్సు ఏమి వుంది?)

ఆండాళ్ భగవంతుణ్ణి పొందుటకు "పావై నోము" ను అనుష్ఠించి, చివర్లో శ్రీరంగంలోని రంగనాథస్వామిని పెళ్ళి

చేసుకున్నారు. ఆమె అనుష్ఠించిన నోము విషయాన్ని 'తిరుప్పావై' అనే దివ్య ప్రబంధం ద్వారా మనం తెలునుకోవచ్చు. ఆ 'తిరుప్పావై'లో భగవంతుని పరం-వ్యూహం -విభవం-అంతర్యామి - అర్చ -అనే ఐదు విధములైన రూపములు (అవస్థలు) వర్ణింపబడినవి. అదే విధంగా వేదాంతంలో చెప్పబడిన "అర్థపంచకం" వివరించబడినది. "ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః। ప్రాప్త్యుపాయం ఫలం చేతి తథా ప్రాప్తి విరోధిచ। వదంతి సకలా వేదాః సేతిహాసపురాణకాః॥ అనే శ్లోకము చేత అర్థపంచకాన్ని తెలుసుకోవచ్చు. అనగా బ్రహ్మ స్వరూపం -జీవ స్వరూపం - ఉపాయము- ఫలము దానికి విరోధముగా ఉండేది- ఇవి అర్థపంచకం అని వేదాంతంలో వ్రాయబడి వున్నది. తరువాత ఈ విషయములను ఆండాళ్ తిరుప్పావైలో పేర్కొన్నారు.

తిరుప్పావైలో భాగవతుల మహిమ కీర్తింపబడినది. భగవంతునికి తమకు ఉన్నటువంటి సంబంధం విడదీయని సంబంధం - అనే దానిని ఆండాళ్ ఇలా పేర్కొంటున్నారు.

"యిుట్రైకుం ఏడేళ్ పిరవిక్కుం ఉంతన్నోడు ఉట్రోమే ఆవోమ్ ఉనక్కే నామాట్చెవోమ్" (ఏడుజన్మలు ఎత్తిన శ్రీకృష్ణ! నీ బంధువులం మేము నీకే మేము దాసవృత్తి చేస్తాం - అనే ఈ విషయాన్ని ఆండాళ్ తిరుప్పావైలో పేర్కొంటున్నారు).

తరిగొండ వెంగమాంబ కూడా ఆండాళ్ వలె వేంకటేశ్వర స్వామి విషయంలో అదేవిధముగా తరిగొండ గ్రామములో నిత్య వానం చేస్తున్న తమకు మిక్కిలి ఇలవేల్పు అయిన

నరసింహస్వామిఅని - శతకం అనే గ్రంథం ద్వారా విశదీకరించారు. 103 పద్యములతో కూడిన ఈ గ్రంథములో భక్తిని, నీతిని, సముదాయ విమర్శనాన్ని, ఆత్మీయాంశాన్ని, వేదాంతార్థాన్ని బాగా వర్ణించారు. ఇందులో ఒక్కొక్క పద్యం యొక్క చివర్లో "తరిగొండ నృసింహ దయాపయోనిధీ!" అని పేర్కొంటున్నారు. నృసింహ శతకంలో వుండే ఒక పద్యాన్ని మీ ముందు సమర్పిస్తున్నాను:

*"వినుము మహానుభావ! మది వేడుక తోడుత విన్నవించెదన్*
*మొనసెడు స్వాతివానలకు ముత్యపుచిప్ప లవెట్టులుండు న*
*ట్లశము భక్తియుక్తి నిను ఆత్మవిభుండవు నీవటంచు నీ*
*కును నెదురేను చూతు తరిగొండ నృసింహ దయాపయోనిధీ!"*

ఈ పద్యము నాయికా భావాన్ని స్వీకరించి పాడిన పద్యం. 'తరిగొండ నృసింహా! నీ అనుగ్రహం అనే వర్ష బిందువును వేడుతూ నిలిచే ముత్యపు చిప్పలాంటి మనిషిని నేను' - అని వెంగమాంబ పేర్కొంటున్నారు. ఈ పద్యములో "దయాపయోనిధీ" అని ఒక పదం ఉంది. భక్త రామదాసు భద్రాచలం రాములవారిని కీర్తించినపుడు" "భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!"- అని అంటున్నారు. అదే రీతిలో ఈ పదం వున్నది. భగవంతుణ్ణి ఈ పద్యములో సముద్రముగా వెంగమాంబ వర్ణించారు. తమిళ భాషలో వుండే ఆళ్వార్‌ల ప్రబంధములలోకూడా ఇదే విధములైన వర్ణన కనపడుతుంది. వాల్మీకి మహర్షి శ్రీ మద్‌రామాయణంలో రాముల వారిని సముద్రంగా వర్ణించారు. లంకకు వెళ్ళుటకు సముద్రరాజు (హిందూమతంలో సముద్రానికి ఒక పురుష అధిదేవత ఉన్నాడని వర్ణింపబడివుంది) రామసైన్యానికి చోటును ఇవ్వలేదు.

వెంటనే రాములవారు సముద్రం ఎదురుగా పడుకున్నారు. దీనిని వాల్మీకి సముద్రం ఎదురుగా మరియొక్క సముద్రం పడుకుని వున్నట్లుగా వర్ణించారు. 'అంజలిం ప్రాఙ్ముఖః కృత్వా ప్రతిశిశ్యే మహోదధేః' అనేది అక్కడ వుండే రామాయణ శ్లోకం. కంబరామాయణంలో కూడా సముద్రానికి ఎదురుగా మరియొక్క సముద్రం అని వర్ణింపబడినది (కరుణై అంక్కడల్ కిడందనన్ కరుంగ్ కడల్ నోక్కి - అనేది కంబరామాయణ పద్య భాగం.)

భగవంతునికి సముద్రానికి సామ్యం వున్నది. సముద్రం అలలతో కూడినది. భగవంతుడు అనే సముద్రం పర్వతాలలాంటి భుజములతో కూడియున్నారు. సముద్రం నవమణులతో కూడిన అభరణాలను ధరించేవాడు. సముద్రం మహాలక్ష్మి యొక్క పుట్టినిల్లు. భగవంతుడు అనే సముద్రంలో అతని వక్షఃస్థలంలో మహాలక్ష్మి నివసిస్తుంది. సముద్రంలో శంఖం వుంటుంది. భగవంతుడు అనే సముద్రం శంఖాన్ని శ్రీహస్తంలో పెట్టుకుంది. సముద్రము మూడు విధములైన జలములతో కూడినది. నదీజలం, ఊటజలం, సముద్ర జలం. భగవంతుడు అనే సముద్రంకూడా కరుణారసంతో కూడివుంటూ 1. స్వభావంగా అనుగ్రహం 2. దు:ఖాన్ని చూసి అనుగ్రహించటం. 3. శ్రీమహాలక్ష్మి పురుషకారంతో అనుగ్రహించటం - అనే మూడు అంశములతో కూడిన వారు. సముద్రంలో మత్స్యం మొదలుకొని తిమింగలం వరకు అన్ని జీవరాసులూ వున్నాయి. భగవంతుడు అనే సముద్రం కూడా "పశ్యామి దేవాన్ తవ దేవ దేహే" అని అర్జునుడు గీతలో చెప్పినట్లు అన్నింటిని తమదేహంలో పెట్టుకొని వుండేవారు. సముద్రం గంభీరంగా వుంటుంది. భగవంతుడు అనే సముద్రం కూడా

"సముద్ర ఇవ గాంభీర్యే" అని వాల్మీకి చెప్పినట్లు గంభీరంగా వుండేవాడు. సముద్రాన్ని ఎంతసేపు చూసినా మనకు తృప్తి కలుగదు. భగవంతుడు అనే సముద్రాన్ని ఎంతసేపు దర్శించినా తృప్తి కలుగదు. సముద్రము మేఘములకు నీటిని ఇస్తుంది. భగవంతుడు అనే సముద్రము "సకల ఫలప్రదో హి విష్ణుః" అన్నట్లు మనం కోరిన దానిని ఇచ్చేవారు. సముద్రము మేఘం వర్షించే నీటిని తీసుకుంటుంది. భగవంతుడు అనే సముద్రము "నారాయణేతి సమర్పయామి" అని మనం భక్తిభావంతో ఇచ్చేదాన్ని తీసుకుంటున్నాడు. సముద్రాన్ని నౌకచేత దాటవచ్చు. భగవంతుడు అనే సముద్రాన్ని భక్తి అనే నౌకచేత దాటవచ్చు. "పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ" అని కులశేఖర ఆళ్వార్ "ముకుందమాలా" అనే స్తోత్రంలో పేర్కొన్నారు. సముద్రం ఎల్లప్పుడూ ఘోషిస్తూ ఉంటుంది. - భగవంతుడు అనే సముద్రంకూడా - "ఏతద్ వ్రతం మమ (ఇది నా వ్రతము) -" మోక్షయిష్యామి మాశుచః (మోక్షాన్ని ఇస్తాను; శోకించవద్దు) - "న మే మోఘం వచో భవేత్" (నామాట వృథా కాదు) అని ఎల్లప్పుడూ ఘోషిస్తూ వుండేవారు. "దయాపయోనిధీ!" అనే ఈ పదానికి ఇలా అర్థం చెప్పవచ్చు. "తరిగొండ వెంగమాంబ" పద్యములు అన్నీ ఇలాగే భక్తి భావాలను పెంపొందిస్తున్నాయి.

# * ఆంధ్ర యోగినులలో అగ్రగణ్యురాలు తరిగొండ వెంగమ్మ

**- శ్రీ మేడపాటి వెంకటరెడ్డి**

**ప్రాచీన భారతదేశంలో బ్రహ్మవాదినులు:**

బ్రహ్మజిజ్ఞాస ఒకరిసొత్తా? ఆత్మ దర్శనం కొందరికేనా? అన్న ప్రశ్నకు అందరూ సమానులే అని ఋగ్వేదం నిరూపిస్తున్నది. 27 వరకు బ్రహ్మవాదినుల పట్టిక ఋగ్వేదంలో కలదు. వారిలో అదితి, ఇంద్రాణి, ఊర్వశి, సూర్య, అపాల, గోధ, వాచ, లోపాముద్ర మొదలగువారు కలరు. వాచక్ను ముని కుమార్తె అయిన గార్గి బ్రహ్మతత్త్వాన్ని గూర్చి యాజ్ఞవల్క్యునితో సంవాదం చేయడం మనకు తెలుసు. యాజ్ఞవల్క్యుని భార్యలు మైత్రేయి, కాత్యాయని కూడ ప్రసిద్ధ బ్రహ్మవాదినులే.

హరివంశంలో ప్రభాసుని భార్య బ్రహ్మవాదినిగను, యోగవేత్త్రిగను ప్రశంసింపబడినది. వశిష్ఠుని భార్య యగు అరుంధతి తత్త్వశాస్త్రవేత్త్రి అని, ప్రధాన రాజఋషి కుమార్తె అయిన సులభ యోగంలో ప్రసిద్ధి చెందినదని తెలుస్తున్నది.

హఠప్రదీపికా వ్యాఖ్యాత బ్రహ్మానందులు (క్రీ॥ శ॥ 1850 - 1875) జ్యోత్స్నలో యోగసాధనకు స్త్రీలు కూడ అర్హులే అనుటకు మహర్షి మాతంగుల భావాన్ని ఇలా చెప్పారు: "ద్విజోత్తముడు అగ్నిష్టోమము మొదలగు సకలమును విడిచి యోగాభ్యాస పరాయణుడై పరబ్రహ్మమును పొందుచున్నాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, స్త్రీ, శూద్రులకు కర్మముల యొక్క శాంతి యైనట్టి ముక్తికి, నిత్యము పరిశుద్ధమైనది యోగముకంటె వేరే లేదు. "

---

* ఈ వ్యాసం శ్రీ మేడపాటి వెంకటరెడ్డిగారు రచించిన "తెలుగు యోగులు" - అనే గ్రంథం నుండి ధన్యవాదములతో స్వీకరింపబడింది.

"అగ్నిష్టోమాదికాన్ సర్వాన్ విహాయ ద్విజసత్తమః,
యోగాభ్యాసరతః శాన్తః పరబ్రహ్మాధిగచ్ఛతి.
బ్రహ్మ క్షత్రియ వైశ్యానాం స్త్రీ శూద్రాణాం చ పావనమ్
శాన్తయే కర్మణామన్యద్యోగో నాస్తి విముక్తయే."

గోరక్షనాథుడు (11వ శతాబ్దం) యోగబీజంలో స్త్రీలకు బ్రహ్మవిద్యార్హత గురించి చర్చించి, పూర్వాభ్యాస యోగం వల్ల జ్ఞాననిష్ఠ సిద్ధించినట్లు చెప్పాడు.

"మైత్రేయీ సులభా శార్ఙ్గీ శాండిలీ చ తపస్వినీ
ఏతాశ్చాన్యాశ్చ బహవో నీచయోనిగతా అపి.
జ్ఞాననిష్ఠాం పరాం ప్రాప్తాః పూర్వాభ్యాసస్తు యోగతః."

ప్రతాపరుద్ర గజపతి దేవుని మంత్రి అయిన గోదావర మిశ్ర (1497 - 1539) యోగచింతామణి (అముద్రితం భండార్‌కర్ లైబ్రరీ పూనా-220/1882-83) లో యోగం కంటే పరిశుద్ధమైనది వేరే లేదని, అది స్త్రీలకు కూడా ముఖ్యమని చెప్పారు.

"బ్రాహ్మణ క్షత్ర వైశ్యానాం స్త్రీశూద్రాణాం చ పావనమ్,
శాన్తయే కర్మణామన్య ద్యోగోనాస్తి విముక్తయే."

తొలి తెలుగు యోగ రచయిత్రిగా బాల పాపాంబను (క్రీ॥ శ॥ 1600) నిడుదవోలు వెంటరావుగారు నిశ్చయించారు. అయితే ఆంధ్రదేశంలో ఎక్కువ మందికి తెలిసిన మహాయోగిని ఈశ్వరమ్మ. ఆంధ్రదేశంలోనే కాదు భారతదేశంలో కూడా స్వతంత్రంగా యోగ గ్రంథాలు వ్రాసిన స్త్రీలు చాలా అరుదు.

## * ఆంధ్ర యోగినులలో అగ్రగణ్యురాలు తరిగొండ వెంగమ్మ

- శ్రీ మేడపాటి వెంకటరెడ్డి

### ప్రాచీన భారతదేశంలో బ్రహ్మావాదినులు:

బ్రహ్మజిజ్ఞాస ఒకరిసొత్తా? ఆత్మ దర్శనం కొందరికేనా? అన్న ప్రశ్నకు అందరూ సమానులే అని ఋగ్వేదం నిరూపిస్తున్నది. 27 వరకు బ్రహ్మవాదినుల పట్టిక ఋగ్వేదంలో కలదు. వారిలో అదితి, ఇంద్రాణి, ఊర్వశి, సూర్య, అపాల, గోధ, వాచ, లోపాముద్ర మొదలగువారు కలరు. వాచక్ను ముని కుమార్తె అయిన గార్గి బ్రహ్మతత్త్వాన్ని గూర్చి యాజ్ఞవల్క్యునితో సంవాదం చేయడం మనకు తెలుసు. యాజ్ఞవల్క్యుని భార్యలు మైత్రేయి, కాత్యాయని కూడ ప్రసిద్ధ బ్రహ్మవాదినులే.

హరివంశంలో ప్రభాసుని భార్య బ్రహ్మవాదినిగను, యోగవేత్త్రిగను ప్రశంసింపబడినది. వశిష్ఠుని భార్య యగు అరుంధతి తత్త్వశాస్త్రవేత్త్రి అని, ప్రధాన రాజఋషి కుమార్తె అయిన సులభ యోగంలో ప్రసిద్ధి చెందినదని తెలుస్తున్నది.

హఠప్రదీపికా వ్యాఖ్యాత బ్రహ్మానందులు (క్రీ॥ శ॥ 1850 - 1875) జ్యోత్స్నలో యోగసాధనకు స్త్రీలు కూడ అర్హులే అనుటకు మహర్షి మాతంగుల భావాన్ని ఇలా చెప్పారు: "ద్విజోత్తముడు అగ్నిష్టోమము మొదలగు సకలమును విడిచి యోగాభ్యాస పరాయణుడై పరబ్రహ్మమును పొందుచున్నాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, స్త్రీ, శూద్రులకు కర్మముల యొక్క శాంతి యైనట్టి ముక్తికి, నిత్యము పరిశుద్ధమైనది యోగముకంటె వేరే లేదు. "

---

* ఈ వ్యాసం శ్రీ మేడపాటి వెంకటరెడ్డిగారు రచించిన "తెలుగు యోగులు" - అనే గ్రంథం నుండి ధన్యవాదములతో స్వీకరింపబడింది.

"అగ్నిష్టోమాదికాన్ సర్వాన్ విహాయ ద్విజసత్తమః,
యోగాభ్యాసరతః శాన్తః పరబ్రహ్మాధిగచ్ఛతి.
బ్రహ్మ క్షత్రియ వైశ్యానాం స్త్రీ శూద్రాణాం చ పావనమ్
శాన్తయే కర్మణామన్యద్యోగో నాస్తి విముక్తయే."

గోరక్షనాథుడు (11వ శతాబ్దం) యోగబీజంలో స్త్రీలకు బ్రహ్మవిద్యార్హత గురించి చర్చించి, పూర్వాభ్యాస యోగం వల్ల జ్ఞాననిష్ఠ సిద్ధించినట్లు చెప్పాడు.

"మైత్రేయీ సులభా శార్ఙ్గీ శాండిలీ చ తపస్వినీ
ఏతాశ్చాన్యాశ్చ బహవో నీచయోనిగతా అపి.
జ్ఞాననిష్ఠాం పరాం ప్రాప్తాః పూర్వాభ్యాసస్తు యోగతః."

ప్రతాపరుద్ర గజపతి దేవుని మంత్రి అయిన గోదావర మిశ్ర (1497 - 1539) యోగచింతామణి (అముద్రితం భండార్‌కర్ లైబ్రరీ పూనా-220/1882-83) లో యోగం కంటే పరిశుద్ధమైనది వేరే లేదని, అది స్త్రీలకు కూడా ముఖ్యమని చెప్పారు.

"బ్రాహ్మణ క్షత్ర వైశ్యానాం స్త్రీశూద్రాణాం చ పావనమ్,
శాన్తయే కర్మణామన్య ద్యోగోనాస్తి విముక్తయే."

తొలి తెలుగు యోగ రచయిత్రిగా బాల పాపాంబను (క్రీ॥ శ॥ 1600) నిడుదవోలు వెంటరావుగారు నిశ్చయించారు. అయితే ఆంధ్రదేశంలో ఎక్కువ మందికి తెలిసిన మహాయోగిని ఈశ్వరమ్మ. ఆంధ్రదేశంలోనే కాదు భారతదేశంలో కూడా స్వతంత్రంగా యోగ గ్రంథాలు వ్రాసిన స్త్రీలు చాలా అరుదు.

తెలుగువారు గర్వించదగ్గ రచనలు చేసిన ఏకైక మహాయోగిని తరిగొండ వెంగమాంబ.

తరిగొండలో జన్మించినందున ఈమెకు తరిగొండ వెంగమ్మ అని పేరు వచ్చింది. తరిగొండ చిత్తూరు జిల్లాలో వాయల్పాడుకు నాలుగైదు మైళ్ళ దూరంలో ఉంది.

ఈమె ఎనిమిదేళ్ళ వయసున్న నిజగురువైన సుబ్రహ్మణ్యయోగి నుంచి తారకోపదేశం పొందింది. పండ్రెండేండ్ల ప్రాయంలో లోకరీతిని అనుసరించి వివాహమాడ వలసి వచ్చినప్పటికి, రమానాథుడే తన మనోనాథుడన్న భక్తమీరావలె, సంసారం విడచి తపస్విని అయింది. అనతికాలంలో వైధవ్యం సంప్రాప్తింవగా, కులమర్యాదల ప్రకారంగా వైధవ్యరీతిని అంగీకరించక, శిరోముండనం వంటి మూఢాచారాలను అంగీకరింపక ఎదురు తిరిగింది. నాలుగైదు సంవత్సరాలు తరిగొండ నృసింహస్వామి సన్నిధిలో ఆంజనేయ స్వామికి వెనుక రహస్యయోగ సాధన చేస్తూ ఉండేది. అర్చకుడు చూచి తరిమేయగా వెంగమాంబ తరిగొండ వీడి, వేంకటాచలారణ్యం ప్రవేశించింది. ఒకటి రెండు దినాలు అడవిదారిలో పయనించి "సందెకాపు మొగలిపెంట" అనే పేరు గల కోనను చేరింది.

వెంగమాంబ యోగిని అని విని యుండిన ఆనాటి మహంతు ఆత్మారామ్ శ్రీనివాసుని కోవెల యొక్క తూర్పు మాడ వీధి చివర వుండిన పూరి యింటిని ఆమె నివాసానికి ఇచ్చాడు. కొంత కాలం తర్వాత ఈమె తుంబురుకోనలో గల ఒక గుహలో నివసించి తీవ్ర తపం చేయసాగింది. తుంబురుకోన తిరుమలకు

ఉత్తరంగా 10 మైళ్ళ దూరంలో ఉన్నది. ఇచ్చటనే క్రీ॥ శ॥ 1915 ప్రాంతంలో మహర్షి మలయాళస్వామి తపమాచరించి దివ్యానుభూతి నందినట్లు వ్రాశారు.

కొంతకాలానికి తాళ్ళపాక చిన్నయ్యసూరి వంశస్థులు వెంగమ్మ గారి మాహాత్మ్యం చూసి సంతసించినవారు శ్రీహరి కోవెలకు ఉత్తర మాడవీథి యందున్న రాతిఇల్లును ఆమె నివాసానికి ఉచితంగా ఇచ్చారు. ఈ మహాత్ముడు శ్రీకృష్ణదేవరాయల వారి కాలంలో విజయనగరం నుండి వేంకటాచలం చేరి అష్టాంగ యోగం అభ్యసించి స్వామివారిని మెప్పించాడు.

**శ్రీవైష్ణవులు వ్రాసిన యోగ గ్రంథాలు:**

'వేమన'లో శ్రీరాళ్ళపల్లి వారు 'శ్రీ వైష్ణవులు వ్రాసిన యోగశాస్త్ర గ్రంథ మొకటియు గానరాదు. నాథ మునులు "యోగరహస్యమ్" అను గ్రంథమును రచించినారట కాని, యిది ఇంకను బైటపడలేదు.' అని వ్రాశారు. నాథమునులే గాక, శ్రీవైష్ణవుడైన యుగళదాస యోగీంద్రుడు 'యోగ మార్గ ప్రకాశిక' లేక 'యోగరహస్య' మనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ గ్రంథం మంగళాచరణంలో శ్రీరామచంద్రుని, గురునమస్కారంలో రామానుజాచార్యుని స్మరించుట జరిగింది. అందుచేత వైష్ణవసంప్రదాయంలో యోగ గ్రంథాలు ఉన్నవనే చెప్పాలి.

ఎక్కడో మనం చూడనక్కరలేదు. తెలుగువారిలోనే వైష్ణవానుయాయులు యోగ గ్రంథాలు, హఠయోగ గ్రంథాలు వ్రాసినవారు కలరు. తెలుగువాడైన నారాయణతీర్థులు వ్రాసిన యోగ సిద్ధాంత చంద్రిక, వెంగమాంబ వ్రాసిన

రాజయోగసారం(రాజాయోగామృతసారం), అష్టాంగయోగసారం ఈ కోవలో ముఖ్యంగా పేర్కొనదగిన యోగ గ్రంథాలు.

**యోగవిశేషములు - తరిగొండ నృసింహ శతకము:**

వెంగమాంబ లేఖినినుండి వెలువడిన ప్రప్రథమ కృతి నృసింహ శతకం. దీనిలో ముఖ్యంగా యోగవిశేషాలు 14 పద్యాలలో మార్మిక ధోరణిలో రచింపబడినవి. ఈ పద్యాలలో కుండలిని, మండలత్రయం, చక్రాలను గురించి వర్ణింపబడినవి. ఉదా:

"కొలకుల మధ్యమందు నొక కోమలి యున్నది, దానిలోపలన్
సలలిత వహ్నిమండలము చంద్ర దివాకర మండలంబులున్
అలవడ నాఱు చక్రముల కావల నందొక సారసంబులో
గులుకుచునుండు హంస తరిగొండ నృసింహ దయాపయోనిధీ!"

**రాజయోగ సారము (రాజాయోగామృతసారము):**

వెంగమాంబ రచనలలో నేటికి తెలియవచ్చినవి పదునెనిమిది. వెంగమాంబ తెలుగు యోగ సాహిత్య వీథులలో అరుంధతిలా ప్రకాశించడానికి కారణం ఆమె వ్రాసిన రెండే రెండు యోగ గ్రంథాలు: మొదటిది రాజయోగసారము, రెండోది అష్టాంగయోగసారము. రాజయోగసారం అనునరణం. తరిగొండలో రచితం. అయినా దీనిలో ఈమె స్వానుభూతిని చేర్చినది. ఇందలి ఇతివృత్తానికి భాగవత తృతీయ స్కంధంలోని కర్దమ ప్రజాపతి వృత్తాంతం ఆధారం. ఇందులో మూడు ప్రకరణాలు, 867 ద్విపదలు కలవు. రాజయోగ సారంలో గురుపరంపర, సాంఖ్యయోగ తత్త్వం, సప్తచక్రాల వర్ణన, దశ

వాయువుల ప్రస్తావన, ముఖ్య నాడుల వివరణ, స్వరయోగ ప్రతిపత్తి, కపట యోగుల నిరసన, గ్రంథుల వర్ణన, తారక లక్షణం, మండల త్రయం, శాంభవీముద్ర, షణ్ముఖీముద్ర, దృష్టులు, లక్ష్యత్రయ వివరణ, యోగవిద్యకు అనర్హులు, బ్రహ్మవేత్తల లక్షణం, యోగమహిమ, సిద్ధాసన లక్షణం, సిద్ధాసనానికి మరోపేరు ముక్తాసనం, వెన్నెముక ఆకృతి మొదలయిన యోగ విషయాల ప్రస్తావన కలదు.

గురూపదేశ విధానం భాగవతంలో లేదు. ఈ కృత్యారంభంలో పేర్కొన్న గురు పరంపర ఇది. (1) సుబ్రహ్మణ్య గురుడు, (2) సోమేశ్వరస్వామి, (3) విద్యారణ్యులు, (4) పరమబ్రహ్మేంద్రులు, (5) స్వయంప్రకాశులు, (6) సచ్చిదానంద గురుడు, (7) మల్లికార్జునుడు, (8) అవధూత దేశికోత్తముడు, (9) పరమహంసాఖ్య గురుడు, (10) బడబానల గురుడు, (11) యోగానంద గురుడు, (12) జితేంద్రియ గురుడు, (13) దిగంబర గురుడు, (14) పరకాయ ప్రవేశ గురుడు, (15) నిత్యానంద గురుడు, (16) నిరంజన గురుడు, (17)బోధానంద ఘనగురుడు.

బోధానంద గురుని నిడుదవోలు వెంకటరావుగారుకాని, డా॥ కె.జె. కృష్ణమూర్తిగారు కాని గుర్తించినట్లు లేదు. బోధానందఘనునకు సంస్కృత రచయితలును, తెలుగు వేదాంత రచయితలును కూడ నివాళులు అర్పిస్తున్నారు. వాసుదేవయోగి "వాసుదేవ మననం" లో ఇలా కీర్తించివాడు:

శ్లో॥ *"బోధానందఘనం నిరస్త సకలం కారుణ్య పూర్ణేక్షణం*
*మూఢానా ముపదేశకం చ సతతం పాపాత్మనాం పావనమ్."*

కొల్లూరి వేంకటేశయ్య కుమారుడు కొల్లూరి సోమశేఖరుడు (పేరూరు నివాసి) భాగవత చంపువులో తన గురువులైన రామకృష్ణుని, బోధానందఘనుని కీర్తించినాడు. ఈ సోమశేఖరుడు అనిపిండి వంశ, ముక్తీశ్వర బ్రాహ్మణ జమీందారైన రామేశ్వరునిచే, పీష్వామాధవరావుచే (కీ॥ శ॥ 1770-1772) పోషింపబడినవాడు. అందుచే ఇతడు క్రీ॥ శ॥ 1750- 1780) మధ్యకాలంలో ఉండి ఉండాలి. వెంగమాంబ అందుకే -

*"గాంచు బోధానంద ఘన పదాబ్జంబు*
*లంచిత భక్తిమై నాత్మయందుంచి"*

అని పరిచయమున్నట్లు వ్రాసినది. రాజయోగసారం క్రీ॥ శ॥ 1864 నుంచి క్రీ॥ శ॥ 1950 వరకు తొమ్మిదిమార్లు ప్రచురింపబడినదంటే, ప్రజల ఆదరణ తెలుస్తున్నది.

**అష్టాంగయోగ సారము:**

వెంగమాంబ వ్రాసిన పద్యకృతులలో అష్టాంగయోగ సారము రెండవది. సంస్కృత "వేంకటాచల మాహాత్మ్యము" నందలి వరాహ పురాణ ప్రథమభాగంలో 59,60 అధ్యాయాలలో గల దాదాపు నలుబదియైదు శ్లోకాలు ఈ కృతికి మూలమని పరిశీలనవల్ల తేలినట్లు డా॥ కె.జె. కృష్ణమూర్తి వ్రాశారు. అంతేగాక "కవయిత్రి ఆ 45 శ్లోకముల భావమును ఈ గ్రంథ పరిమితిలో మూడవవంతు స్వేచ్ఛగా ఇమిడించి, తక్కిన రెండు వంతుల గ్రంథమున మంత్ర, లయ, హఠ, సాంఖ్య, అమనస్క, రాజయోగములను, ఉత్తమ రాజయోగి యొక్క, సచ్ఛిష్యుని యొక్క లక్షణములను స్వానుభవ పూర్వకముగా, స్వతంత్రముగా

సులభశైలిలో వివరించినది." అని వ్రాశారు. స్వతంత్రముగా అనుటకంటె ఈ సాధన ప్రక్రియలు హఠదీపికకు అనుకరణగా కనిపిస్తున్నవి. దీనికి కారణం హఠప్రదీపికలో చెప్పినట్లుగా ఇచ్చట 17 ఆసనముల వర్ణనలు, షట్కర్మలు చెప్పడమే గాక, ఏడు ప్రాణాయామాలు చెప్పటం. వెంగమాంబ ఎనిమిదవ ప్రాణాయామమైన ప్లావనిని ఇచ్చట చెప్పలేదు. ప్లావని ప్రాణాయామం ఆమెకు తెలుసుననడానికి రాజయోగసారంలోని ఈ వాక్యాలే సాక్ష్యం:

*"పవనయోగము నేర్చి పటుయుక్తిఁ బెంచి*
*యవిరళంబుగఁ దటాకాంతరమందు*
*మహిమఁ జూపుటకుఁ బద్మాసనంబునను."*

హఠయోగ విధానంలో ఆహార నియమాలను గురించి, సాధన పద్ధతులను బట్టి, ఈ యోగ ప్రక్రియలు అనుకరణగా భావించ వచ్చును. ప్లావని ప్రాణాయామం నేర్చుకొని, పద్మాసనంలో చెఱువులలోను, కాలువలలోను నీటిపై తేలడాన్ని వెంగమాంబ నిరసించినది. నేటికీ యోగం పేరుతో బహిరంగ ప్రదర్శనలు ఇచ్చి, పేరుకోసంగాని, డబ్బుకోసంగాని పాటుపడేవారు కనిపిస్తుంటారు. వెంగమాంబ కాలంలో కూడ ఈ ప్రదర్శనలు జరిగే వన్నమాట.

కొందరు సాహిత్య విమర్శకులు రాజయోగ సారంలో వెంగమాంబ ఆడంబర యోగ ప్రక్రియలను నిశితంగా విమర్శించటం చూసి, (వేమన విషయంలో కూడ) ఈమె హఠయోగ ప్రక్రియలకు వ్యతిరేకమనే భావన ధ్వనింప చేశారు. ఇది సరి కాదు. ఈమె హఠయోగ లక్ష్యం ఇలా చెప్పింది:

"హఠముచే జరను రోగాళిని మృత్యువున్
కేడించి ధీరు(డై గెలువవచ్చు."

అంటే హఠయోగంచేత ముసలితనాన్ని, రోగాలను దూరంచేసి మృత్యువును జయించవచ్చని భావం.

ఈమె పేర్కొన్న స్వతంత్ర యోగ ప్రక్రియలు లేకపోలేదు. ఆంధ్రదేశ యోగులగు ఆత్మారాముని హఠప్రదీపిక, శ్రీనివాసభట్టు హఠ రత్నావళి, ప్రభల భోగీశ్వరయోగి యోగరత్న ప్రదీపికలలో ఇవి కానరావు. అవి ఇవి: (1) శవాసనంలో చేతులు భూమిమీదగాక, వక్షస్థలంపై ఉంచటం, (2) హఠయోగ గ్రంథాలు పట్టుకు 80 మార్లు ప్రాణాయామం చేయమంటే, ఈమె పట్టుకు 20 మార్లు చాలునని, రోజుకు 80 ప్రాణాయామాలుగ నిర్ణయించినది. మంత్రయోగంలో స్వరయోగ ప్రాముఖ్యం, లయయోగంలో షణ్ముఖిముద్రకు రాధాయంత్ర మని పేరుండటం, వస్త్రధౌతి గుడ్డ పొడవు నిర్ణయం, భస్త్రికర్మకు కుక్కుటాసనం, సూత్రనేతి త్రాడును నేతిలో ముంచటం, సూర్యభేదనలో వజ్రాసనం సిఫార్సు చేయడం ముఖ్యమైనవి.

**తత్త్వకీర్తనలు:**

వెంగమాంబ కీర్తనలు ఇప్పటివరకు 21 లభించాయి. వీటిల్లో సుబోధ భాషలో యోగార్థాలు గల తత్త్వాలు కూడ కలవు. కొన్ని కీర్తనలు "సుజ్ఞాన రత్నావళి", "వేదాంత జ్ఞానబోధిని" లలో చేర్చబడినవి. వెంగమాంబ రచించిన తత్త్వ కీర్తనలన్నీ తరిగొండ ముద్రాంకితాలు. శ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్రలో ఆ రచయిత రంగ ప్రకాశదాసుచే ఉట్టంకింపబడిన వేదాంత

కీర్తనలలో యోగ విశేషాలు కలవు. తరిగొండకు వచ్చి ఉండిన పుష్పగిరి శంకరాచార్యులు శ్రీమదభినవోద్దండ విద్యానృసింహ భారతీస్వామి వెంగమాంబ మహిమను గుర్తించి, అభినందించిన సన్నివేశంలో ఆమె ఆ పీఠాధిపతి యెడల తనకు గల భక్తి గౌరవాలు తెలుపడమేగాక, షట్చక్రాలను దాటి మేడఁ జేరమని (వేమన కొండవీడు, నందిదుర్గం. మేరుశిఖరం - అంటే, ఏగంటివారు మేరు వెక్కి - అంటారు. - వేమన - పుటలు 33&77), త్రివేణి నదియైన సుషుమ్నలో జలకమాడమని ధ్వనింపజేసినది.

*"మూడు రెండు దాటి పైన మేడఁ జేరరే!*
*పాడిమిగను ముక్తికాంత పొడు మరయరే!*

*చక్కగా త్రివేణి నడుమ జలకమాడరే!*
*చొక్కముగను వెలుగుచున్న చుక్క గాంచరే!*

*శంకరాచార్య గురుని సమ్మతింపరే!*
*నిష్కళంక పరమయోగ మభ్యసింపరే!*

*స్థూలసూక్ష్మ కారణముల మూల మరయరే!*
*లలితనీల తోయదమున నిలిచి మెఱయరే!*

*పన్నుగాను శ్రీ తరిగొండ పతినిఁ గాంచరే!*
*పరము నెన్నుకొనుచు బ్రహ్మపదము జేరరే!."*

వెంగమ్మ గారి కీర్తనలలో భ్రూమధ్య మందిరము, అంబరవీథి (పుట-48), ఆరో పద్మము, గంగ యమునలు, అసి పదము (పుట-51), నడివీథి (పుట- 52) యోగ సాంకేతిక భాషలో జెప్పబడినవి.

**యోగ విమర్శ:**

వెంగమాంబ రాజయోగసారం తరిగొండలో రచితం. కృత్యారంభంలో ఇది రాజయోగ సారమని పేర్కొనబడినా, అయా ప్రకరణాల చివరి పంక్తులలో రాజయోగామృత సారంగా చెప్పబడినది. ఇది అనుసరణమే అయినా తన మొదటి రచనలో యోగం పేరుతో జరిపే మోసాలను, యోగ, లక్ష్యంకాని విషయాలను తీవ్రంగా ఖండించినది. తను తరిగొండలో ఉండగా అప్పుడు యోగులు చేసే పనులను ఇలా విమర్శించింది:

*"కాశీ గయా ప్రయాగలనైన లేదు*
*దేశ దేశంబులు తిరిగిన లేదు*

*వెలయు సంసారము ల్విడిచిన లేదు*
*బలు క్షుత్పిపాసలు వట్టిన లేదు*

*శిలల బొమ్మల పూజచేసిన లేదు*
*తలప దిగంబరత్వములలో లేదు*

*జడలు దాల్చిన లేదు సార్వకాలంబు*
*నడవులు దిరిగిన నలసిన లేదు."*

అడవులు తిరగవద్దని వెంగమాంబ ఒకే చోట ఉండి-తుంబురుకోనలో (తిరుమల క్షేత్రానికి ఉత్తరంగా పదిమైళ్ల దూరంలో) తపస్సు చేసినది.

రాజయోగసారంలో హఠయోగ ప్రక్రియలను విమర్శించినది. మంత్రలయ హఠయోగ ప్రక్రియలు నేర్చుకొని పామరులకు మహిమలు చూపడం యోగలక్ష్యం కాదని,

ఈ బాహ్యలక్ష్యాలు యోగ సిద్ధాంతమందు సుస్థిర మనస్సు లేనివారు సిద్ధులు కోరి చేసే పనులని ఖండించినది:

"సాధనంబుగ యోగ సరణులఁ దెలిసి

యలమట నాసనాభ్యాసము ల్చేసి
చలమున బాహ్యలక్షణము చూపుచును

కూలంకషములోని గుఱి గానలేక
లాలితంబుగ మంత్రలయ హఠయోగ

ఫలములఁ గోరుచు బామరులగుచు
జల బుద్బుదమువంటి జన్మంబులకును

సిద్ధులగోరి, ప్రసిద్ధమై యోగ
సిద్ధాంతమందు సుస్థిరమతి లేక

అగణిత విషయ సుఖాసక్తి మీఱఁ
దగ మణిమంత్ర సిద్ధక్రియల్ నేర్చి

మఱి పామరులకెల్ల మహిమలఁ జూపి."

నేడు కూడ యోగప్రదర్శనాల పేరుతో భూగర్భసమాధి యని, ఖేచరి విద్యయని, సర్కస్‌లలో గజకర్ణి (చేపలు నీటితో త్రాగి బయటకు కక్కడం) చాలా మంది చేస్తున్నారు. ఇవి యోగలక్షణాలు కావని వెంగమాంబ తీవ్రంగా ఖండించింది.

వెంగమాంబ తన కాలంలో జరిగే మరొక హఠయోగ ప్రదర్శనను - పద్మాసనంలో ఉండి నీటిమీద తేలడం- ఇది

అందరికి చూపడం -ఇదే యోగమనుకొనడంకూడ - ఖండించక విడచిపెట్టలేదు. ఈ ప్రక్రియనే ప్లావని ప్రాణాయామం అంటారు.

*"పవనయోగము నేర్చి పటుయుక్తిఁ బెంచి,*
*యవిరళంబుగ దటాకాంతరమందు*

*మహిమఁ జూపుటకు బద్మాసనంబునను*
*సహజముగా నుండి జనుల మెప్పించి*

*సిద్ధులై యంతకుఁ బరమైన యోగ*
*సిద్ధాంత మెఱుగక చెడిపోవువారు."*

వెంగమాంబ విమర్శకు గురైన మరొక యోగ ప్రక్రియ "శంఖ ప్రక్షాళన". దీనినే ఘేరండ సంహితలో "వారిసార" అంటారు. హఠయోగ ప్రక్రియలతో నిలిచిపోయేవారిని ఆమె విమర్శించుట జరిగింది.

*"కడుపు నిండగ నుదకంబును బీల్చి*
*కడుపున మలమెల్లఁ గడగి శోధించి*
*యిది యాత్మసిద్ధియౌనని నిశ్చయించి*
*ముదమంది తమలోన మురిసెడివారు."*

వెంగమాంబ కాలంలో యోగడాంబికుల గురించి ఆమె విమర్శించిందనుకోవాలికాని, ఆమె యోగమునకు వ్యతిరేకం - అని వ్యాఖ్యానించడం అనుభవం లేని మాట. సాహిత్య విమర్శకులు వేమన యోగ విషయంలోను ఇలాగే భావించారు. ఆమె రాజయోగసారం తరిగొండలో వ్రాసినపిదప, క్రీ॥ శ॥ 1808 తర్వాత తిరుమలలో అష్టాంగ యోగసారము రచించినది.

**ముక్తి:**

వెంగమాంబ మురాషావలీ అనే మహమ్మదీయునికి, శ్రీ కృష్ణమాచార్యుడనే జిజ్ఞాసువునకు, తన తల్లిదండ్రులకు తత్త్వోపదేశం కావించినది. దైవచింతనకు కుల భేదాలు లేవన్న వీరబ్రహ్మం ఒరవడినే పయనించిన మహాయోగిని వెంగమాంబ. ఈమె యోగరచనలు ఆంధ్రజాతికి ప్రతిదిన పారాయణార్హాలు!

ఈ మహాయోగిని సహస్ర చంద్రదర్శన మొనరించి క్రీ॥ శ॥ 1817 ఈశ్వర సంవత్సరాన పరమపదం అలంకరించినది.

**ఆధారాలు:**


1. Brahmavadini of ancient India by Sunandana (Radha Sri Krishna) Bharata Manisha Vol. IV No. 3&4, Jan. 1979, p35.
2. Texts sanctioning the study of yoga by women and their chronology by Dr. P.K. Gode, Studies in Indian Literary History, Vol.
3. Contribution of Andhra to Sanskrit Literature, Dr. Sri Rama Murthy-p-133.
4. తరిగొండ వెంగమాంబ కృతులు, సవిమర్శక పరిశీలనము - డా॥ కె.జె. కృష్ణమూర్తి. తిరుపతి, 1983.
5. హఠప్రదీపిక, జ్యోత్స్న, బ్రహ్మానంద, అడయార్.
6. వేంకటేశ్వర భక్తవిజయము, శ్రీరంగ ప్రకాశదాసు, 1915.
7. సుజ్ఞానరత్నావళి, కొండపల్లి వీర వెంకయ్య, రాజమండ్రి, 1957.

# మహాకవి, మాతృశ్రీ మధ్య భక్తి సామ్యం

**- కె.జె. కృష్ణమూర్తి**

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని ఐకాంతిక భక్తుడైన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారి 600 జయంత్యుత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా నిర్వహిస్తున్నది. ఈ ఉత్సవాలు అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్ళపాకలో (కడప జిల్లా) మే 19వ తేది నుండి 22వ తేది వరకు మూడురోజుల పాటు పెద్ద ఎత్తున జరుగ నున్నాయి. ఈ శుభతరుణాన తాళ్ళపాకలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా 600మంది గాయనీ గాయకుల "సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం"తో పాటు సంగీత నాట్య విభావరులు నిర్వహింపబడుతున్నాయి.

ఆ శుభ సందర్భంలో ప్రచురింపబడిన పరిశోధనాత్మక వ్యాసాలలో ఈ క్రింది వ్యాసం ఒకటి:

సాహితీ జగత్తుకు సృష్టికర్తలు మహాకవులు. మహనీయ సారస్వత మూర్తులయిన మహాకవుల్లో పరస్పరం ఏవో కొన్ని పోలికలూ, తేడాలూ గోచరిస్తూ వుండటం సర్వసాధారణమే. అయితే, వేంకటేశ్వరస్వామి భక్తుల్లో అగ్రగణ్యులైన తాళ్ళపాక అన్నమాచార్యులు, తరిగొండ వెంగమాంబ - ఈ యిరువురు సాహితీమూర్తుల జీవితాల్లోనూ, అలాగే వారి రచనల్లోనూ మిక్కిలి సన్నిహితమైన సామ్యాలు కనిపిస్తూ వుండటం ఆశ్చర్యాన్ని కల్గించేదైనా, సత్యమైన సంగతి!

అయితే, ఈ సందర్భంలో ఒక ప్రశ్న ఉదయిస్తున్నది. శ్రీనివాసుని భక్తి కవితా సామ్రాజ్యంలో ఉన్నత శిఖరాలను

అధిష్ఠించియున్న ఇద్దరు మహితాత్ముల్ని సరిపోల్చి చూడటం దేనికి? అని. ఈ తులనాత్మక పరిశీలనలో రెండు ప్రయోజనాలు కనబడుతున్నాయి. ఒకటి: ఇరువురి జీవితాంశాలనూ, రచనలనూ సరిపోల్చి పరిశీలించడం ద్వారా వాఙ్మయ ప్రపంచంలో వీరికిగల విశిష్టత సుస్పష్ట రేఖలతో సాక్షాత్కరిస్తుంది. అందువల్ల లభించిన స్ఫూర్తితో, ఉత్సాహంతో వీరిరువురి రచనలను ఇతోధికంగా అనుశీలించి, ఆనందించే అవకాశం సాహిత్యోపాసకులకు సమకూరుతుంది. రెండవ ప్రయోజనం: పుట్టింది మొదలుకొని శ్రీ వేంకటేశ్వరునకు అభిముఖంగా జీవయాత్ర సాగించిన వీరి చరిత్రాంశాలనూ, స్వామివారికి సమర్పించిన కృతిజాలాన్నీ అభినివేశంతో అధ్యయనం చెయ్యడం ద్వారా, పరోక్షంగా - అనగా భంగ్యంతరంగా ఆ కలియుగ దైవాన్ని కీర్తించిన పుణ్యమూ దక్కుతుంది!

పదకవితా పితామహుడూ, హరికీర్తనాచార్యుడూ అయిన తాళ్ళపాక అన్నమాచార్యులు క్రీ.శ. 15వ శతాబ్దిలో శ్రీవేంకటేశ్వరుని ముప్పిడి కఠారం - అంటే నందక ఖడ్గం యొక్క అంశతో నందవర శాఖీయులూ, భారద్వాజ గోత్రులూ అయిన లక్కమాంబా, నారాయణ సూరిదంపతులకు పొత్తపినాటిలోని తాళ్ళపాక గ్రామంలో అవతరించినాడు. 'సకల తత్త్వార్థ 'వివేకినీ', 'కవితా తపస్వినీ' అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ క్రీ.శ. 18వ శతాబ్దిలో వేంకటరమణుని వరప్రసాదంగా, నందవరశాఖకు చెందిన వసిష్ఠ గోత్రులైన కానాల మంగమాంబ, కృష్ణయామాత్యుడు అనే దంపతులకు లక్ష్మీనృసింహ క్షేత్రంగా ప్రశస్తిగాంచి యున్న తరిగొండ గ్రామంలో అవతరించింది.

శ్రీ వేంకటేశ్వరుని వరంచేత జన్మించిన కారణంగా దైవభక్తీ, విద్యలూ ఈ యిరువురికీ అత్యంత సహజంగా సంక్రమించినాయి.

# మహాకవి, మాతృశ్రీ మధ్య భక్తి సామ్యం

**- కె.జె. కృష్ణమూర్తి**

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని ఐకాంతిక భక్తుడైన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారి 600 జయంత్యుత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా నిర్వహిస్తున్నది. ఈ ఉత్సవాలు అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్ళపాకలో (కడప జిల్లా) మే 19వ తేది నుండి 22వ తేది వరకు మూడురోజుల పాటు పెద్ద ఎత్తున జరుగ నున్నాయి. ఈ శుభతరుణాన తాళ్ళపాకలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా 600మంది గాయనీ గాయకుల

"సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం"తో పాటు సంగీత నాట్య విభావరులు నిర్వహింపబడుతున్నాయి.

ఆ శుభ సందర్భంలో ప్రచురింపబడిన పరిశోధనాత్మక వ్యాసాలలో ఈ క్రింది వ్యాసం ఒకటి:

సాహితీ జగత్తుకు సృష్టికర్తలు మహాకవులు. మహనీయ సారస్వత మూర్తులయిన మహాకవుల్లో పరస్పరం ఏవో కొన్ని పోలికలూ, తేడాలూ గోచరిస్తూ వుండటం సర్వసాధారణమే. అయితే, వేంకటేశ్వరస్వామి భక్తుల్లో అగ్రగణ్యులైన తాళ్ళపాక అన్నమాచార్యులు, తరిగొండ వెంగమాంబ - ఈ యిరువురు సాహితీమూర్తుల జీవితాల్లోనూ, అలాగే వారి రచనల్లోనూ మిక్కిలి సన్నిహితమైన సామ్యాలు కనిపిస్తూ వుండటం ఆశ్చర్యాన్ని కల్గించేదైనా, సత్యమైన సంగతి!

అయితే, ఈ సందర్భంలో ఒక ప్రశ్న ఉదయిస్తున్నది. శ్రీనివాసుని భక్తి కవితా సామ్రాజ్యంలో ఉన్నత శిఖరాలను

అధిష్ఠించియున్న ఇద్దరు మహితాత్ముల్ని సరిపోల్చి చూడటం దేనికి? అని. ఈ తులనాత్మక పరిశీలనలో రెండు ప్రయోజనాలు కనబడుతున్నాయి. ఒకటి: ఇరువురి జీవితాంశాలనూ, రచనలనూ సరిపోల్చి పరిశీలించడం ద్వారా వాఙ్మయ ప్రపంచంలో వీరికిగల విశిష్టత సుస్పష్ట రేఖలతో సాక్షాత్కరిస్తుంది. అందువల్ల లభించిన స్ఫూర్తితో, ఉత్సాహంతో వీరిరువురి రచనలను ఇతోధికంగా అనుశీలించి, ఆనందించే అవకాశం సాహిత్యోపాసకులకు సమకూరుతుంది. రెండవ ప్రయోజనం: పుట్టింది మొదలుకొని శ్రీ వేంకటేశ్వరునకు అభిముఖంగా జీవయాత్ర సాగించిన వీరి చరిత్రాంశాలనూ, స్వామివారికి సమర్పించిన కృతిజాలాన్నీ అభినివేశంతో అధ్యయనం చెయ్యడం ద్వారా, పరోక్షంగా - అనగా భంగ్యంతరంగా ఆ కలియుగ దైవాన్ని కీర్తించిన పుణ్యమూ దక్కుతుంది!

పదకవితా పితామహుడూ, హరికీర్తనాచార్యుడూ అయిన తాళ్ళపాక అన్నమాచార్యులు క్రీ.శ. 15వ శతాబ్దిలో శ్రీవేంకటేశ్వరుని ముప్పిడి కఠారం - అంటే నందక ఖడ్గం యొక్క అంశతో నందవర శాఖీయులూ, భారద్వాజ గోత్రులూ అయిన లక్కమాంబా, నారాయణ సూరిదంపతులకు పొత్తపినాటిలోని తాళ్ళపాక గ్రామంలో అవతరించినాడు. 'సకల తత్త్వార్థ 'వివేకినీ', 'కవితా తపస్వినీ' అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ క్రీ.శ. 18వ శతాబ్దిలో వేంకటరమణుని వరప్రసాదంగా, నందవరశాఖకు చెందిన వసిష్ఠ గోత్రులైన కానాల మంగమాంబ, కృష్ణయామాత్యుడు అనే దంపతులకు లక్ష్మీనృసింహ క్షేత్రంగా ప్రశస్తిగాంచి యున్న తరిగొండ గ్రామంలో అవతరించింది.

శ్రీ వేంకటేశ్వరుని వరంచేత జన్మించిన కారణంగా దైవభక్తి, విద్యలూ ఈ యిరువురికీ అత్యంత సహజంగా సంక్రమించినాయి.

మరీ ముఖ్యంగా వెంగమాంబ బాల్యంలో ఒకానొక మధ్యాహ్నవేళ చదువుల తల్లి సరస్వతి అక్షరాల రూపేణ మిరుమిట్లు కొల్పుతూ ఆకాశాన్నుండి దిగి వచ్చి ఆమె ముఖంలో ప్రవేశించింది!

అన్నమయ్య వెంగమాంబ - ఈ యిరువురు మహాకవులూ తమ రచనా కైంకర్యాన్ని 'శతక' రచనతోనే ప్రారంభించారు. ఒకరిది అలమేల్మంగా వేంకటేశ్వర శతకం, మరొకరిది తరిగొండ నృసింహశతకం. బాల అన్నమయ్య తిరుమల కొండను ఎక్కుతూ చల్లని తల్లి అలమేలుమంగమ్మపై ఆశువుగా చెప్పిన ఆ శతకంలో ఆ మహాకవి అటు తరువాతి కాలాల్లో రచింపబోయే అధ్యాత్మ, శృంగార సంకీర్తనలకు ప్రాతిపదిక లనదగిన భావాలు అంకురప్రాయంగా నెలకొని ఉన్నాయని పరిశోధకుల అభిప్రాయం. అన్నమయ్య, వెంగమాంబ ఈ యిద్దరు మహాత్ములూ ఒకానొక విచిత్రమైన సంఘటన ద్వారా తిరుమల క్షేత్రం చేరడం జరిగింది. పొలంలో గడ్డి కోస్తూ వుండగా చేతివ్రేలు తెగిన సంఘటనతో అన్నమయ్య బాల్యంలో తిరుమల తెరువు పట్టగా, తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని అర్చకుడు బలవంతంగా తలవెంట్రుకలు పట్టి లాగిన సంఘటన కారణంగా వెంగమాంబ తిరుమలకు పయనించింది.

పరికిస్తే, ఈ యిరువురు భక్తకవుల జీవితాల్లోనూ ప్రధానంగా మూడు ముఖ్య దశలు గోచరిస్తూ వున్నాయి. ఈ దశలు 1. ప్రాథమిక దశ, 2. సాధన దశ, 3. సిద్ధిదశ - అనేవి.

అన్నమయ్య జీవితంలో ప్రాథమిక దశ అనేది ఆయన జన్మించిన నాటినుండి ఎనిమిదేండ్ల వయస్సులో తిరుమల క్షేత్రాన్ని చేరుకోవటంతో పూర్తయింది. తిరుమల చేరిన అన్నమయ్యకు శ్రీవారి ప్రేరణతో ఘనవిష్ణు యతీశ్వరుడు శ్రీవైష్ణవదీక్షను అనుగ్రహించటంతో, అన్నమయ్య అన్నమాచార్యు డైనాడు.

తరువాత తల్లివెంట తాళ్ళపాక చేరుకొన్నాడు. వివాహానంతరం అహోబలంలో కాపురం ఉంటూ ఆదివన్ శఠకోప యతీంద్రుల సన్నిధిలో అనేక సంవత్సరాలు సంప్రదాయ గ్రంథాలను చక్కగా అధ్యయనం చేశాడు. తాను తొలుత తిరుమల చేరిన నాటి నుండీ తానెక్కడ ఉన్నా సంకీర్తనాకైంకర్యాన్ని నిరంతరాయంగా, నిర్విరామంగా నిర్వహిస్తూ వుండినాడు. సాళువ నరసింహుని సంప్రార్థనపై అతనికి అన్నివిధాలా హితవరిగా ఉంటూ, తొలుత టంగుటూరులోనూ, అటుపిమ్మట పెనుగొండలోనూ రాజాస్థానంలో రాణించినాడు. పెనుగొండలో సాళ్వ నరసింగడు అన్నమయ్యకు మూరురాయర గండ సంకెల వేయించి దర్పం ప్రదర్శించాడు. స్వామి కరుణతో కూడిన సంకీర్తన ప్రభావం చేత ఈ పరమ భాగవతోత్తముడు నిర్బంధం నుండి విముక్తుడై మళ్లీ తిరుమల తెరువు పట్టినాడు! అన్నమాచార్యుడు తల్లివెంట తిరుమల వీడిననాటి నుండి కాలక్రమేణ పెనుగొండలోని రాజు కొలువును విడిచిపెట్టే దాకా సాగిన ఇంచుమించు 30 ఏండ్ల కాలం ఆయన జీవితంలో అన్ని విధాలా 'సాధనదశ'. ఈ రెండవదశ యొక్క ఆదిలో జరిగిన ఇనుప కొడవలి సంఘటన, చివర్లో జరిగిన ఇనుప సంకెళ్ల సంఘటన ఈ రెండూ అన్నమయ్య నందకాంశసంభూతుడనే నిజాన్ని చెప్పక చెపుతూ వున్నాయి!

పెనుగొండ నుండి అన్నమాచార్యుడు సకుటుంబంగా తిరుమల చేరేనాటికి ఆయన వయస్సు ఇంచుమించు 40 సంవత్సరాలు. ఆనాటి నుండి ఆయన దివ్యధామం చేరేవరకు సాగిన సుదీర్ఘకాలం మూడవ దశ. అన్నమాచార్యుల సహస్రమాసాల నిండు జీవితంలో ఇది అన్ని విధాలా పరిపక్వత నొందిన 'సిద్ధిదశ'. ఇది ఇంచుమించు 50 సంవత్సరాల పాటు సాగింది. ఈ సిద్ధిదశలోనే అన్నమయ్య కుమారుడైన పెద తిరుమలా చార్యుని ప్రయత్నంచేత సంకీర్తనలను రాగిరేకులపై వ్రాయించటం, శ్రీవారి

ఆలయంలో కల్యాణోత్సవాదులను కడువైభవంగా నిర్వహించటం మొదలైన కైంకర్యాలు విస్తారంగా కొనసాగాయి. ఈ పరిపక్వదశలోనే అన్నమాచార్యులు మూర్తీభవించి నడయాడుతూ వున్న శ్రీనివాసుని సారస్వతాంశంగా, తిరుమల క్షేత్రంలో తిరుగాడుతూ వున్న "తెలుగు అళ్వారు" గా విరాజిల్లినాడు! 12 శతకాలు, శృంగారమంజరి, 32 వేల సంకీర్తనలు, సంస్కృతంలో వేంకటాచల మాహాత్మ్యం, సంకీర్తనలక్షణం (సంస్కృతం), ద్విపద రామాయణం (తెలుగు) - ఇవి ఈ మహాకవీశ్వరుని కృతులు.

ఇక, తరిగొండ వెంగమాంబ జీవితంలో ప్రాథమిక దశ ఆమె పుట్టిన నాటి నుండి తిరుమల క్షేత్రం చేరేంతవరకు సాగింది. అప్పటికి ఆమె వయస్సు ఇంచుమించు 20 సంవత్సరాలు. అప్పటికే ఆమె ఒక శతకం, మూడు యక్షగానాలు, ఒక ద్విపద కావ్యం రచించి, ఇలవేల్పైన తరిగొండ లక్ష్మీనరసింహుడికి సమర్పించింది. ఈ మహాకవయిత్రి తిరుమల చేరడం దైవికమైన సంఘటన కాగా, ఆమె తిరుమలలో తాళ్ళపాకవారి యింటిప్రక్కన నివసించడం అంతకన్నా ముఖ్యమైన, స్వామి సంకల్పంగా సమకూడిన అపూర్వమైన సన్నివేశం! ఇందువల్ల ఈ కవయిత్రికి తాళ్ళపాక వంశకవులు రచించిన దేశిరచనలను అన్నింటినీ చక్కగా పఠించే సదవకాశం లభించింది.

భక్తిరసభరితాలైన తాళ్ళపాక వంశకవుల మధురకవితలు సహజంగానే "మధురకవితా సరస్వతి" యైన మాతృశ్రీ వెంగమాంబను ఎంతగానో ఉత్సాహపరిచాయి. వాటిల్లో అన్నమాచార్యుని అర్ధాంగి తిమ్మక్క రచించిన "సుభద్రాకళ్యాణం" అనే పెండ్లిపాట వెంగమాంబను అమితంగా ఆకర్షించింది.

తాళ్ళపాక తిమ్మక్క క్రీ.శ. 15వ శతాబ్దంలో సుభద్రాకళ్యాణాన్ని రచించి, తెలుగు కవయిత్రీ సారస్వతానికి శ్రీకారం చుట్టింది. మంజరీ ద్విపదలో రచితమైన ఆ పెండ్లిపాట ఇలా మొదలవుతుంది:

"శ్రీరమావల్లభులు శ్రీకృష్ణులెలమి
ద్వారాకాపట్టణము తారేలు చూడ"

తిమ్మక్క శ్రీకారం చుట్టిన ఈ కావ్యారంభంలోని తొలి సమాసం "శ్రీరమావల్లభులు." ఈ సమాసమే స్వామి సంకల్పంగా వెంగమాంబ రచించిన "శ్రీరమాపరిణయం" అనే కావ్యం యొక్క నామధేయానికీ, అందలి కథకూ, శైలికీ ప్రేరేపకమై వెలసి వుండటం ఆశ్చర్యకరమైన సంగతి! ఈ భక్త కవయిత్రి యొక్క కవితా ప్రతిభకు ఇది తిరుగులేని తార్కాణం!

తిరుమలలో అక్కారాం వెంకట్రామ దీక్షితులనే అర్చకుల పెద్ద వల్ల ఏర్పడిన ఇబ్బందుల కారణంగా వెంగమాంబ మనశ్శాంతి నిమిత్తమై 'తుంబురుకోన' అనే అరణ్య ప్రదేశానికి వెళ్లి, అక్కడ కొన్నేళ్లు తీవ్రంగా తపస్సాధన కావించింది. తిరుమలకు మరలి వచ్చిన అనంతరం ఈ కవయిత్రి తాను నెలకొల్పిన బృందావనం (పూలతోట) లో అత్యాశువుగా రచించిన "శ్రీవేంకటేశ్వర కృష్ణమంజరి", అన్నమాచార్యుల "రుచుల శృంగారమంజరి" ని స్మరింపజేసే రమణీయ కృతి!

వెంగమాంబ తిరుమల చేరిన నాటి నుండి ఆమె తుంబురుకోనలో తపస్సు కావించేంతవరకు సాగిన దాదాపు 16,17 సంవత్సరాల కాలపరిమితి ఆమె జీవితంలో రెండవదశ. అదే 'సాధనదశ'. ఇది ఆమె జీవితంలో హయగ్రీవ ఉపాసన, గ్రంథరచన, తపస్సాధన మొదలయిన రంగాలలో మహత్తర సాధనలకు నెలవై వెలసింది.

తుంబురుకోన నుండి తిరిగి తిరుమల చేరిన నాటినుండి ఈ ఆధ్యాత్మిక కవయిత్రి సజీవసమాధి ద్వారా పరమపదాన్ని పొందేంత దాకా సాగిన దాదాపు 45 సంవత్సరాల కాలం ఆమె

జీవితంలో మహోన్నత 'సిద్ధిదశ'. ఈ పరిపక్వదశలోనే ఈ మహా కవయిత్రి ద్విపద భాగవతం, శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, వాసిష్ఠ రామాయణం లాంటి బృహద్ గ్రంథాలను రచించి తరిగొండ లక్ష్మీనరసింహస్వామికీ తిరుపతి వేంకటేశ్వరునికీ అభేదంగా అంకితం కావించింది. వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యం ఆంధ్రవాఙ్మయాన్ని అలంకరించిన అగ్రశ్రేణి మాహాత్మ్యకావ్యాల్లో అగ్రేసరమైనది.

మొత్తంమీద ఈ యిరువురు సారస్వతమూర్తులు శ్రీనివాసతత్త్వాన్నీ, మహత్త్వాన్నీ శిష్టవ్యవహారానికి మిగుల సన్నిహితమైన భాషలో సామాన్య ప్రజానీకానికి అందించే కార్యక్రమాన్ని చేపట్టి, ఆద్యంతమూ కృతకృత్యులయిన, కారణజన్ములైన సహజకవులు, ప్రజాకవులు.

తిరుమల దేవాలయంలో ఏకాంతసేవలో ఈ యిరువురు మహనీయ సాహితీ మూర్తులు నెలకొల్పిన 'లాలి', 'ముత్యాలహారతి' అనే కైంకర్యాలను ఆ చంద్రార్కంగా అనుదినమూ స్వీకరిస్తూ వున్న వేంకటనాయకుడు ఈ యిద్దరూ సర్వసమానులని చెప్పక చెపుతున్నాడు! 'వరలబ్ధమైన జన్మ, వరలబ్ధమైన కవితా వైభవమూ' కలిగి వర్ధిల్లిన ఈ యిద్దరు మహితాత్ములు ఆంధ్రావళికి ప్రాతఃస్మరణీయులు! చిరస్మరణీయులు!!

# ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఎలా మేల్కొంచారు?
# గత చరిత్రలో ప్రధాన ఘట్టాలు

**- శ్రీపరకాల పట్టాభిరామారావు**

18వ శతాబ్దం మధ్య భాగంలో జీవించిన తరిగొండ వెంగమాంబ బాల్యంలో నిర్బంధ వైధవ్యం పేరిట జరిపే కేశఖండనను నిరాకరించింది. చేయించుకోలేదు.

1862లో సామినేని ముద్దు నరసింహం వ్రాసిన "హితసూచని" లో నిర్బంధ వైధవ్యాన్ని, బాల్య వివాహాలను వ్యతిరేకించారు.

1869లో విశాఖపట్నం బాలికా పాఠశాల స్థాపన జరిగింది లింగం లక్ష్మాజీ, హిందూ సమాజాన్ని సంస్కరించాలని, లేకపోతే సమాజం దుర్దశపాలవుతుందన్నారు. 1871లో కాకినాడలో బాలికా పాఠశాల నెలకొల్పారు. తరువాత వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణోద్యమం ప్రారంభమైంది.

ఆయన 1874లో ధవళేశ్వరంలో బాలికా పాఠశాల నెలకొల్పారు. భోగం మేళాలను వ్యతిరేకించారు. 1878 సెప్టెంబరులో రాజమండ్రిలో సంఘ సంస్కరణ సమాజాన్ని స్థాపించారు. 1879 ఆగస్టులో "వితంతు పునర్వివాహం శాస్త్రసమ్మతమేనని బహిరంగోపన్యాసం చేశారు.

1881లో తీసిన జనాభా లెక్కల ప్రకారం దేశంలో 25 ఏళ్ళలోపు వితంతువులు 12 లక్షలు, 15 యేళ్ళలోపు వారు 1 లక్ష 74వేలు, 10 ఏళ్ళలోపు వారు 63వేలు. ఆనాడు భారతదేశంలో హిందూ జనాభా 17 కోట్లు మాత్రమే. 1881లో స్త్రీ పునర్వివాహ సంఘాన్ని స్థాపించారు.

1881లో డిశంబరు 11వ తేదీన వీరేశలింగంగారి ఆధ్వర్యాన రాజమండ్రిలో మొదటి స్త్రీ పునర్వివాహం జరిగింది.

1883లో సతీహితబోధిని పత్రిక 1898లో మద్రాసులో "వితంతు శరణాలయం", 1901లో మద్రాసులో "సంఘసంస్కరణ సమాజమందిరం" వీరేశలింగం స్థాపించారు. 1901లో రాయసం వెంకటశివుడుగారు, "తెలుగు జనానా" పత్రిక స్థాపించారు. 1906లో రాజమండ్రిలో బాలికా పాఠశాల, 1909లో రాజమండ్రిలో "పతిత యువతీ సంరక్షణశాల" ను వీరేశలింగంగారు స్థాపించారు.

బాలాంత్రపు శేషమ్మగారి "హిందూసుందరి", పులుగుర్త లక్ష్మి నరసమాంబ గారి "సావిత్రి", వింజమూరి వెంకటరత్నమ్మగారి "అనసూయ", కృపాబాయి సత్యనాథమ్మగారి "విద్యావతి", కె.ఎన్. కేసరిగారి "గృహలక్ష్మి" (ఇందులో కనువర్తి వరలక్ష్మమ్మగారి "శారద లేఖలు" (స్వర్ణకంకణ బహుమతి పొందిన రచన). ఈ పత్రికలన్నీ స్త్రీలలో విద్యా, వైజ్ఞానాలు, చైతన్యం కలిగించాయి. బండారు అచ్చామాంబగారు 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ సందర్భంలో ప్రథమాంధ్ర మహిళా మహాసభకు అధ్యక్షత వహించారు.

కొటికలపూడి సీతమ్మగారు ఎన్నో ఉపన్యాసాలిచ్చారు. స్త్రీవిద్యను ప్రోత్సహించారు. వీరి ఉపన్యాసాలు "ఉపన్యాసమాలిక" పేర అచ్చు వేయబడినాయి.

పులుగుర్త లక్ష్మినరసమాంబగారు స్త్రీ విద్యాభిలాషి; మొదటి స్త్రీ విద్యార్థినీ సమాజాన్ని నెలకొల్పారు. స్త్రీలకు పత్రిక నడిపారు.

తరువాత గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంతో సత్యాగ్రహోద్యమాలలో స్త్రీలు వందలు వేలుగా పాల్గొని తొలిసారిగా రాజకీయరంగంలోకి వచ్చారు. ఇది క్రమంగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక హక్కులకోసం పోరాడే చైతన్యాన్ని స్త్రీలకు ఇచ్చింది.

1916లో హోమ్‌రూల్ ఉద్యమానికి అనిబిసెంట్ నాయకత్వం వహించింది. ఆమె ఐరిష్ వనిత. 1917లో ఆమెను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్ళిన మొదటి విదేశీవనిత అనిబిసెంట్.

1921లో బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ-తిలక్ మహాశయుడు స్వరాజ్యనిధికి పిలుపు నిచ్చాడు. గాంధీజీ ఆంధ్ర పర్యటన - దుర్గాబాయి దేశముఖ్ తెలుగు అనువాదం. స్త్రీలు నగలు వలిచి యిచ్చారు. మాగంటి అన్నపూర్ణమ్మ త్యాగనిరతి కొనియాడబడింది. పెదపాడులో ఒక ధనిక వితంతువు యలమంచిలి సత్యవతి 100 కాసుల బంగారం నగలన్నీ యిచ్చింది.

దువ్వూరి సుబ్బమ్మ లాఠీ దెబ్బలు తిని జైళ్ళకు వెళ్ళింది ఏలూరులో. మాగంటి అన్నపూర్ణమ్మ జాతీయ పాఠశాలను, నెల్లూరులో పొణకా కనకమ్మ (30సార్లు ఉప్పు సత్యాగ్రహం - శిక్షలు) నెల్లూరులో బాలికల పాఠశాల స్థాపించారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ, వారి భర్త ఉన్నవ లక్ష్మీనారాయణగార్లు జాతీయోద్యమంలో - సాంఘిక సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. గుంటూరులో శారదానికేతన్ వితంతు శరణాలయం స్థాపించారు.

ఆచంట రుక్మిణమ్మ ఆంధ్రలో మొదటి గ్రాడ్యుయేట్లలో ఒకరు. అఖిల భారత మహాసభ (మద్రాసు శాఖకు) అధ్యక్షురాలు. 1936లో పారిస్‌లో జరిగిన "ఇంటర్నేషనల్ ఉమెన్స్ సఫరేజ్ అలయన్స్ కాంగ్రెస్"కు భారతదేశ ప్రతినిధి. 1930 వేదారణ్యం సత్యాగ్రహ శిబిరంనుండి ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. మద్రాసు శాసనసభ డిప్యూటీ స్పీకరుగా ఎన్నికయ్యారు. 1946లో

ప్రకాశం పంతులుగారి మంత్రివర్గంలో ఆరోగ్యశాఖా మంత్రి గానుండి గుంటూరులో వైద్య కళాశాల స్థాపనకు దోహదం చేశారు. అఖిల భారత మహిళా సభకు అధ్యక్షురాలు, కార్యదర్శి కూడా.

1919 చీరాల పేరాల సత్యాగ్రహం జరిగింది. అందులో ఒక మహిళ అరెస్టు చేయబడి జైలుశిక్షను అనుభవించింది. దేశంలో పన్నుల నిరాకరణలో అరెస్టయిన మొదటి మహిళ ఆమె.

పల్నాడులో కన్నెగంటి హనుమంతు పుల్లరి సత్యాగ్రహంలో స్త్రీలు విరివిగా పాల్గొన్నారు. నెల్లూరు జిల్లాలో ఖద్దరు కేంద్రాలు విరివిగా నెలకొల్పారు.

రాష్ట్ర శాసనసభల్లో తొలిసారిగా స్త్రీలు అడుగు పెట్టినారు మద్రాసు లెజిస్లేచర్‌లో తొలి మహిళ ముత్తులక్ష్మిరెడ్డి-లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు.

1930-32 సత్యాగ్రహంలో స్త్రీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దండి సత్యాగ్రహం 1930 ఏప్రిల్‌లో ప్రారంభమయింది.

1930 జనవరి 31న మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో పడుపు వృత్తి నిర్మూలన చట్టం ఆమోదం.

రాజకీయాల్లో మొదటిసారిగా అరెస్టు చేయబడిన ఆంధ్ర దేశ మహిళ ఆచంట రుక్మిణమ్మ వెల్లూరులో మొదటి జైలుశిక్ష అనుభవించారు.

మే 4న గాంధీజీ అరెస్టుకు నిరసనగా ముత్తులక్ష్మిరెడ్డి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా యిచ్చారు. అదే సందర్భాన్ని పురస్కరించుకొని ఉన్నవ లక్ష్మీబాయమ్మ గుంటూరు జిల్లా బోర్డు సభ్యత్వానికి రాజీనామా యిచ్చారు.

నెల్లూరు-విశాఖపట్నాలలో ఉప్పు కొఠారులపై దాడిలో స్త్రీలు పాల్గొన్నారు. గంజాం జిల్లాలోని నౌపాడలో-సత్యాగ్రహం శిబిరంలో స్త్రీలపై దౌర్జన్యం-అడవులలో వదలిపెట్టడం పెద్దాపురం తోటలో లాఠీచార్జీ దువ్వూరి సుబ్బమ్మతో సహా గాయపడ్డారు.

విదేశీ వస్తు బహిష్కరణ - కల్లు అంగళ్ల వద్ద పికెటింగ్ చేసిన వారు, విజయవాడ, ఏలూరు, మచిలీపట్నం వర్తకులచే విదేశీ వస్త్రాలు తెప్పించబోమని ప్రతిజ్ఞ చేయించినవారు మహిళా దళాలవారే!- వాళ్లే యింటింట ఖద్దరు ప్రచారం చేశారు.

గుడివాడ పికెటింగ్‌లో వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ కంభంపాటి మాణిక్యాంబ మూల్పూరి చుక్కమ్మ, దుగ్గిరాల కమలాంబ, చెరుకూరి సౌభాగ్యమ్మ, మొదలైనవారిని అరెస్టుచేసి ఒక సంవత్సరం జైలుశిక్ష విధించారు. స్పృహతప్పిపోయేవరకు పిచికారీలతో బురదనీరు కొట్టారు. రేపల్లె, తెనాలి పికెటింగ్‌లలో భారతీదేవిరంగా నిర్బంధం, జైలు శిక్ష ఏలూరు పికెటింగ్‌లో నత్తిరాజు మంగమ్మ, స్వరాజ్యలక్ష్మి, తణుకులో కొవ్వలి కనకమ్మలకు శిక్షలు పడ్డాయి. ఏలూరులో చుండూరి రత్నమ్మ 1932లో నరకప్రాయమైన జైలుశిక్ష అనుభవించింది. పురపాలక సంఘాధ్యక్షురాలుగా పనిచేసిన మొదటి స్త్రీ ఈమె!

గుంటూరులో రాజకీయ సభలో కొండా వెంకటప్పయ్యగారు అరెస్టు చేయబడితే ఆ స్థానంలో వేదాంతం కమలాదేవిగారు కూర్చుని సభను జయప్రదం చేశారు. తెనాలిలో గుంటూరు జిల్లా రాజకీయ సభకు ఎల్లాప్రగడ విశ్వసుందరమ్మ, నర్సాపురం తాలూకా రాజకీయ సభకు రుద్రరాజు బంగారమ్మ, బాపట్ల సభకు - లావు అంకమ్మ, తెనాలి తాలూకా లోని సభకు కంభంపాటి మాణిక్యాంబ, నెల్లూరు సభకు భవనం తిరిపాలమ్మ,

విశాఖపట్నం జిల్లా మహాసభకు టేకుమళ్ళ బుచ్చిరామాయమ్మ అధ్యక్షతలు వహించారు. ఈ సభలపై లాఠీచార్జీలు జరిగాయి.

1933లో గుంటూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర స్త్రీ నియంతల సభకు నైజాంనుండి మానాప్రగడ రామసుందరమ్మ హాజరయ్యారు. వీరికి 15నెలలు జైలుశిక్షలు 2వేలు జరిమానా; అనారోగ్యంపాలై విడుదలైన తరువాత మరణించారు. దరిశి సుభద్రమ్మ, బెజవాడ లక్ష్మీకాంతమ్మ మొదలైనవారు ఎన్నో బాధలు అనుభవించారు.

**తెలంగాణాలో**

1931లో స్త్రీ విద్య వ్యాప్తికోసం కృషి, 1933లో బాలికల వసతి గృహాలు, 1938లో మెట్రిక్ పరీక్షలు - తెలుగులో 1954 పింగళి వెంకట్రామారెడ్డి స్త్రీల కళాశాల, మాడపాటి హనుమంతరావుగారి నారాయణగూడ హైస్కూలు, ఖమ్మం, గద్వాల వనపర్తిలలో బాలికోన్నత పాఠశాలలు స్థాపించబడ్డాయి.

1916లో సరోజినీ దేవి విమెన్స్ ఎసోసియేషన్, 1927లో అఖిల భారత మహిళాసభలో విలీనమైన ఆంధ్రశాఖగా మారింది.

ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభలతోపాటే మహిళా మహాసభలు కూడా జరుగుతూ వచ్చాయి. కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయంలో స్త్రీ విభాగం ఏర్పరుపబడింది. 1929లో జోగిపేట ఆంధ్ర మహాసభలో తొలిసారిగా ఆంధ్ర మహిళా సభ ఏర్పాటుకు తీర్మానింపబడింది.

1925 ప్రాంతంలో సుల్తాన్ బజార్‌లో ఆంధ్ర సోదరీ సమాజం, కన్యాసమాజం ఇవి స్త్రీల సాంస్కృతిక సంస్థలు గణపతి నవరాత్రుల్లో ఆటలు, పాటలు జరిపేవారు.

1935 సభలకు మాడపాటి దంపతులు హనుమంతరావు-మాణిక్యాంబ. 1944 సభలకు అరుట్ల రామచంద్రారెడ్డి - కమలాదేవి దంపతులు అధ్యక్షతలు వహించారు.

1929లో జాతీయ కాంగ్రెస్ ఉద్యమంలో భాగంగా పద్మజానాయుడు స్వదేశీ ఉద్యమం మహిళా విభాగము,-నిషేధించబడిన స్టేట్ కాంగ్రెస్ రహస్య కార్యకలాపాలలో ఎల్లాప్రగడ సీతాకుమారి, సంగం లక్ష్మీబాయమ్మ (ఇందిరా సేవాసదన్ 1953లో స్థాపన), మాసుమాబేగం, సుమిత్రాదేవి మొదలైనవారు మహిళా ఉద్యమంలో పనిచేశారు.

1936 ఎన్నికలలో గెల్చిన రంగారెడ్డి-స్త్రీల వారసత్వపు హక్కు, వర్ణాంతర వివాహము చేసుకొన్న దంపతుల సంతానం సక్రమ సంతానంగా నిరూపణ, బాల్య వివాహాల నిరోధం, వితంతు పునర్వివాహాల గుర్తింపు - మొ॥ చిత్తుశాసనం చేయబడింది. 1941లో ఎనిమిదవ ఆంధ్ర మహాసభ ఉపన్యాసంలో శ్రీ రావి నారాయణరెడ్డి స్త్రీ స్వాతంత్ర్యం, ఆర్థిక హక్కులు ప్రస్తావన చేశారు.

**వోటింగు హక్కు**

1919లో మాంటేగ్-ఛెమ్స్ఫర్డ్ కమిషన్‌కు స్త్రీల వోటింగు హక్కు గురించి విజ్ఞాపన పత్రాన్ని కజిన్స్ సతి, సరోజినీ నాయుడు సమర్పించారు. కలకత్తా కాంగ్రెస్ మహాసభ అనిబిసెంట్ అధ్యక్షత క్రింద-స్త్రీలకు ఓటుహక్కు యివ్వాలని తీర్మానించింది.

1920లో శాసనసభకు స్త్రీలు పోటీచేయడానికి ఆమోదం, మద్రాసు శాసనసభకు ముత్తులక్ష్మిరెడ్డి ఎన్నిక జరిగాయి.

1927లో సైమన్ కమిషన్ 2:1 పురుషులు, స్త్రీలు నిష్పత్తిలో ఓటింగు హక్కును సూచించింది.

1933లో రాజకుమారి అమృతకౌర్ నాయకత్వాన Indian Constitutional Reforms Joint parliamentary Committee హక్కును కోరుతూ రాయబారం నడిపారు.

1935లో బ్రిటిష్ ఇండియా చట్టం కూడా సమాన ఓటుహక్కు యివ్వలేదు. స్త్రీల నియోజకవర్గం ఏలూరులో 1946లో అచ్చమాంబ పోటీచేశారు. 1947లో భారత రాజ్యాంగ చట్టంలో వయోజన ఓటింగ్ హక్కుతో స్త్రీలకు సమాన ఓటుహక్కు వచ్చింది.

| | | |
|---|---|---|
| 1917 | - | అనిబిసెంట్ - మార్గరెట్ కజిన్స్‌ల ఇండియన్ ఎసోసియేషన్ |
| 1927 | - | విద్యా సంస్కరణల సభ, ఇదే అఖిల భారత మహిళా సభగా రూపొందింది. |
| 1955 | - | హిందూకోడ్ మొదటి బిల్లు |
| 1955 | - | హిందూ వివాహ చట్టం |
| 1955 | - | హిందూ ప్రత్యేక వారసత్వ చట్టం |
| 1955 | - | దత్తత స్వీకారం, భరణం హక్కు |
| 1956 | - | గార్డియన్‌షిప్ అధికారం |
| 1956 | - | వరకట్నాల నిషేధ చట్టం |
| 1956 | - | వ్యభిచార నిరోధ చట్టం |
| 1973 | - | గర్భస్రావం హక్కు - చట్టాలు వచ్చాయి. |

అఖిల భారత మహిళాసభలో మితవాద వర్గాలు, మహారాణులు- ఒక వర్గం; ప్రజాతంత్ర భావాలు ప్రగతిశీల భావాలు కలవారు - కమ్యూనిస్టుల వరకు, సరోజినీ నాయుడు, కమలాదేవి చటోపాధ్యాయ విజయలక్ష్మి పండిట్, బేగమ్ హమీద్ అలీ, రేణుకారే, హజరాబేగం, రేణుచక్రవర్తి, పార్వతీ కృష్ణన్, ఉషాతాయి డాంగే మొదలైనవా రుండేవారు.

1941 డిశంబరులో కాకినాడలో అఖిల భారత మహిళా మహాసభ విజయలక్ష్మీ పండిట్ అధ్యక్షురాలు. సభ్యత్వ రుసుము షారాలకు రు. 3/- తగ్గించాలనీ, ప్రతిపాదించబడింది. ఇతర ప్రతిపాదనలు ఓడిపోయాయి. పై సభ మధ్యతరగతి మేధావి వర్గాలకే పరిమితం అయింది. కాకినాడ సభలో శ్రీమతి మానికొండ సూర్యావతిని కమిటీలోకి తీసుకున్నారు. కృష్ణా, గోదావరి జిల్లాల సభ్యత్వం గురించి వివాదం ఏర్పడింది. తరువాత రాష్ట్ర మహిళా ఉద్యమంలో ప్రత్యేక వేదికను ఏర్పరచుకొని ముందుకు పురోగమించారు. మొత్తంపై వామపక్ష భావాలతో విస్తృత మహిళా ఉద్యమం ఆంధ్రలో ప్రారంభమైంది.

# The rebellious devotee

**Revolutionary devotion is Vengamamba's trait.**

- Sriman A.D. Rangarajan

After Tallapaka Annamacharya, the poet who has a number of verses and compositions dedicated exclusively to Lord Venkateswara is Tarigonda Vengamamba of the 18th century. Her devotion to the Lord of Seven Hills is evident in her compositions.

Of her 18 compositions unearthed so far, *Venkatachala Mahathmyam* gives a glimpse of Tirumala of those days and its history, while Yakshaganams like *Vishnu Parijatham, Chenchu Natakam, Golla kalapam, Ramaa Parinayam, Dvipada Ramayanam* and Yoga Vaasishtham bear essence of her literary elegance.

Vengamamba was not just a poetess, but a revolutionary woman with a firm resolve to question the societal norms and dictates, unmindful of the consequences. Like Annamayya, she too fought for social equality and flayed discrimination in the name of 'varnas'.

The Tirumala Tirupati Devasthanams (TTD) formed 'Tarigonda Vengamamba Vangmaya Project' last year with Bhuman S. Reddy as its Director to bring to light the poetess' compositions and also popularise them in the from of books and compact discs. Her 279th birth was observed in the from of a musical festival simultaneously at Tirumala, Tirupati and Tarigonda (her birth place 100 km north-west of Tirupati) on May 17 and 18. Film playback singer Sunita sang her devotional number, while Annabathula Lakshmi Mangathayaru and her troupe from Mummidivaram (East Godavari) gave a Yakshaganam performance on *Gollakalapam*.

*Gollakalapam* is about an interesting discussion between a Yadava girl and a Brahmin priest, wherein the former delivers an enlightening message to the latter on the vainness of the caste system and preaches the real route to attain the lotus feet. The revolutionary in Vengamamba comes to the fore in this work while driving home the message on how the presence (or otherwise) of noble qualities like disciplined way of life and respect for values and ethics determines the caste of a person. While *Gollakalapam* has already been popularised by the Annabathula family in the Coastal Andhra, it was Late A. Subbarayudu of Chittoor.

Who had taken the exemplary work along with him while migrating to East Godavari in 1915. Vengamamba's other works need to be popularised on the same lines.

*Tallapakavari laali - Tarigonda vari Muthyala Harathi* is a saying that explains the significant position she enjoys at the Tirumala temple. Annamacharaya's verses are sung as lullaby during 'Ekantha Seva', the last ritual for a day before closing the temple. Similarly, the final *Harathi* is given on a bronze plate, which was presented by Vengamamba herself. Both the litterateurs have ensured a firm place in the annals of the temple history with the two events during *Ekanta seva* even today.

The Vengamamba Project is all set to bring more compositions to light, besides striving to accord the traditional temple honours to the descendants of Tarigonda Vengamamba.

# సాహితీ తపస్విని

-డా॥ ఎస్. అనంతలక్ష్మి

తన జీవితాన్ని, సాహిత్యాన్ని, 'తరిగొండ శేషకుధరాధ్యక్షు'న కంకితం చేసిన భక్త కవయిత్రి "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ." తెలుగు మీరాబాయిగా, ప్రహ్లాదుని అపరావతారంగా ప్రసిద్ధి చెందిన బహుగ్రంథకర్త్రి. 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' అనే గ్రంథం ఎంతో ప్రసిద్ధి పొందింది. కాని, దానిని రచించిన వెంగమాంబ మాత్రం చాలా తక్కువ మందికి తెలుసు. ఒకప్పుడు తిరుపతి తీర్థయాత్ర చేసినవారు తిరిగి వెడుతూ తప్పక తమతో తీసుకుని వెళ్లే వాటిలో ప్రముఖంగా ఉండేది. ఈ శ్రీ వేంకటాచల మాహాత్మ్యం. కాని, ఆ భక్తులెవ్వరికీ వెంగమాంబ గురించి ఏమాత్రం తెలియదు. తెలిసిన కొద్దిమందికీ ఆమె కవయిత్రి - అని మాత్రమే తెలుసు. నిజానికి ఆమె పరమయోగిని. కవిత్వం యోగ ఫలం. శ్రీ వేంకటాచల మాహాత్మ్యాన్ని తెలుగులోకి చాలామంది అనువాదం చేశారు. వారిలో అగ్రగణ్యురాలు, మహితమూర్తి 'తరిగొండమ్మ'గా ప్రసిద్ధి చెందిన తరిగొండ వెంగమాంబ. తిరుపతికి వాయవ్య దిశన రమారమి వంద కిలోమీటర్ల దూరంలో లక్ష్మీ నృసింహక్షేత్రంగా ప్రశస్తి వహించిన తరిగొండ గ్రామంలో నందవరీక శాఖకు చెందిన వశిష్ఠ గోత్రోద్భవుడైన కానాల కృష్ణయామాత్యుడు, మంగమాంబల వరపుత్రికగా జన్మించింది. వెంగమాంబ. జననకాలం రమారమి క్రీ.శ. 1730 సంవత్సరం.

వేంకటేశ్వరుని అనుగ్రహం వలన జన్మించిన వెంగమాంబకు దైవభక్తి ఏ పూర్వజన్మ సంస్కారం వల్లనో కాని సహజంగా అలవడింది. బాల వెంగమాంబ భక్తికి, తన్మయత్వంతో చేసే నృత్య గానాలకు, చూపే మహిమలకు, ముచ్చటపడుతూనే, భయపడ్డారు

తల్లిదండ్రులు. తన భర్త శ్రీ వేంకటాచలపతి మాత్రమే అని వాదిస్తున్నా వినక నారగుంటపాళెం వాస్తవ్యుడు, శ్రీవత్స గోత్రానికి చెందిన ఇంజేటి వేంకటాచలపతితో వివాహం జరిపారు తల్లిదండ్రులు. భగవద్విలాసం అతికొద్ది కాలానికే భర్తృవియోగం. సువాసినీ చిహ్నాలను తీయడానికి ఇష్టపడలేదు. ఇంట, బయట కూడా ఎంతో వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఆమె విశ్వాసం సడలలేదు. "భగవంతుడైన శ్రీ వేంకటాచలపతి నా పతి. కనుక నేను సువాసినినే" అని వాదించి పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండవిద్యా నృసింహభారతీస్వామివారినే మెప్పించింది.

రూపావతారం సుబ్రహ్మణ్య దేశికుల వద్ద బ్రహ్మవిద్యను, యోగభ్యాస విధానాన్ని ఉపదేశపూర్వకంగా పడసింది. తరిగొండ లక్ష్మీనృసింహునికి, తిరుమల శ్రీనివాసునికి, శ్రీకృష్ణునికి అభేద భావనతో కవితార్చన గావించింది. ఎన్నో అవమానాలను సహించి, చివరకు తరిగొండ వదలి తిరుమల చేరుకుని, రచనావ్యాసంగం కొనసాగించింది. తుంబురు కోనలో కొన్ని సంవత్సరాలు తీవ్రమైన తపస్సు చేసింది. మరల తిరుమల చేరి, రచనను కొనసాగించింది. వెంకటగిరి, శ్రీకాళహస్తి, కార్వేటినగరం వంటి సంస్థానాధీశులు, కూచిపూడి భాగవతులు మొదలైన వారనేకులు వెంగమాంబ రచనల్లో తమకు కావలసిన వాటికి ప్రతులు వ్రాయించుకుని వెడుతుండేవారు. తన రచనల ప్రతులు వ్రాయడానికి అష్టఘంటాలనే ఎనిమిది మంది వ్రాయసకాండ్రను ఏర్పాటు చేసుకుంది. ప్రతియేటా నృసింహ నవరాత్రోత్సవాలు నిర్వహించేది. తరిగొండ వెంగమాంబ గారి మఠం ఆధ్యాత్మిక, సారస్వత కేంద్రంగా విరాజిల్లుతుండేది.

"ఈ కవయిత్రి యొక్క వాఙ్మయ జీవితానికి శేషగిరివాసుని కోమల దరహాసమే స్ఫూర్తి కేంద్రం! శ్రీవారి ఏకాంత సేవలో ఆమె నెలకొల్పిన 'నిత్యముత్యాల హారతి' చిట్టచివరి హారతి అయినట్లు ప్రాచీన యుగానికి చెందిన కవయిత్రీమతల్లుల్లో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కడపటి కాంతి దీపం!'' అని శ్రీ వేంకటాచల మాహాత్మ్యం పీఠికలో ఆచార్య కె.జె.కృష్ణమూర్తి గారన్న మాటలు యథార్థములు.

సహస్రచంద్ర దర్శనం కావించి క్రీ.శ. 1817వ సంవత్సరం ఈశ్వర సంవత్సర శ్రావణ శుద్ధ నవమినాడు యోగసిద్ధిని పొందింది మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. పాంచభౌతిక శరీరాన్ని విడిచిన తర్వాత కూడా భక్తులకు, శిష్యులకు దర్శనమిస్తూనే ఉన్నట్టు అనేక కథలు వ్యాప్తిలో ఉన్నాయి.

ఆమె సమాధి తిరుమలలోని వరాహస్వామి వారి ఆలయానికి అభిముఖంగా ఉంది. ఆమె పెంచి పోషించిన తులసివనం "తరిగొండమ్మతోట" అనే పేరుతో గర్భ గుడి అల్లంత దూరాన ఉంది. ఆమె తవ్వించిన బావి నీటితో స్వామి వారి అభిషేకం జరిపించే అలవాటు ఉండేది.

**మహిమాన్వితురాలు:**

అప్పటికే తాళ్లపాక తిమ్మక్క, ఆతుకూరి మొల్లమాంబ వంటి కవయిత్రులు రచనలు చేసి ఉన్నారు. అయినా స్త్రీలు రచనలు చేయటాన్ని, యోగ విద్యాపూర్ణలు అయి ఉండటాన్ని ఆనాటి సమాజం హర్షించి ఆమోదముద్ర వేయలేకపోయింది. కాని, ఆనాడు కూడా రూపావతారం సుబ్రహ్మణ్య దేశికుని వంటి యోగిపుంగవులు మూఢ భావనలను నిరసించి యోగ్యత ఉన్న వారికి స్త్రీ, పురుష భేదభావన లేకుండా యోగ విద్యను

ఉపదేశించారు. అటువంటి గురువు నుంచి ఉపదేశం పొందిన వెంగమాంబ యోగమార్గంలో ఉన్నతోన్నత పథాల పయనించి యోగసిద్ధిని పొందడంలో ఆశ్చర్యం ఏమాత్రం లేదు.

తాను పొందిన ఫలాన్ని తనకే పరిమితం చేయక అందరికీ అందించి, అందరితో పంచుకోవాలనే ఉదారబుద్ధితో, ఆ జ్ఞానాన్ని ప్రచారం చేసింది వెంగమాంబ. దానిలో భాగంగానే ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా పాటలు, నృత్యాలు కొనసాగించింది. స్త్రీలు యోగసాధన, రచనలు చేయడమేమి?టని ఎంతమంది ఆక్షేపించినా ఆపలేదు. స్త్రీ అయి ఉండి ఒంటరిగా అరణ్యంలో తిరిగి, తుంబురుకోనలో తపస్సు చేసింది. ఎదురుపడి ప్రశ్నించిన వారిని యుక్తియుక్తంగా, శాస్త్రోక్తంగా సమాధానపరిచింది. భర్త చనిపోయాడు- అని నిర్ధారించి (వాస్తవం తెలియకపోయినా) సువాసినీ చిహ్నాలను తొలగించమని బలవంతం చేసినా అంగీకరించ లేదు. ఇదే విషయమై పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యానృసింహ భారతీస్వాముల వారితో వాదించి వారిని అంగీకరింపజేసింది. ఆమెతో అధ్యాత్మికపరమైన చర్చ జరిపిన తర్వాత శ్రీస్వామివారు వెంగమాంబకు తానే నమస్కరించి వెంగమాంబ గొప్ప నృసింహోపాసకురాలని, ప్రహ్లాదాంశగల పరమభక్తురాలనీ, ప్రశంసించి, ఆమెను ఎవ్వరూ ఏమీ అనవద్దని హెచ్చరించి వెళ్లారు.

వెంగమాంబ కారణజన్మురాలని తెలియజెప్పే సంఘటన లామె జీవితంలో ఎన్నో ఉన్నాయి. చిన్నతనంలో చూపిన మహత్తులు కొన్నిటిని అనూయాపరులు 'గాలిచేష్టలు'గా తీసిపడేశారు. కొన్ని మాత్రం కొరుకుడుపడక వదిలేశారు.

**పుష్పగిరి పీఠాధిపతులు చెప్పిన తరువాత కూడా వెంగమాంబ సువాసినీ చిహ్నాలను తీసివేయాలని పట్టుబట్టి,**

బలవంతాన క్షురకర్మ చేయించారు. ఆ పని పూర్తి అయినాక స్వామివారి పుష్కరిణిలో ఒక్క మునక వేయగానే జుట్టు యథాప్రకారం ఉన్నదట! తిరుమలలో అక్కారాం వెంకటరామదీక్షితులు చేసిన అసభ్యకరమైన పనికి కోపగించి తిట్టగానే, అది శాపమై వారి వంశం అంతా నశిస్తున్న స్థితిలో, పశ్చాత్తాపతప్తుడై ప్రార్థిస్తే వారి వంశంలో తరానికి ఒక్కడు మాత్రమే ఉంటాడని అనుగ్రహించిందట! ఇది వెంగమాంబ శాపానుగ్రహ శక్తిని తెలియచేస్తుంది. తుంబురుకోనలో తపస్సు చేసుకునే రోజుల్లో, చనిపోవడానికి నిశ్చయించుకున్న కుష్టురోగికి క్షణమాత్రంలో రోగనివారణ చేసిన వరప్రసాద సమర్థతగలది.

స్వామివారికి పుష్పార్చన చేయడానికి, పూలతోట పెంచి, దానికి కావలసిన నీటికోసం నూతిని తవ్వుతున్నప్పుడు పెద్దరాయి అడ్డుపడి నీరు రాకపోతే, వెంగమాంబ ఆర్తితో గంగాభవానిని ప్రార్థించినదట! అంతే! నీరు బుసబుస పొంగి, బావి నిండిందట! ఆ పాటను ఇప్పటికీ అందరూ పాడుతూ ఉంటారు.

వెంగమాంబ తిరుమలలోని ఉత్తర మాడవీథిలో ఉండే రోజుల్లో, తను పెంచిన బృందావనంలో ఒక రాయిమీద కూర్చుని ఆనంద నిలయ శిఖరాన్ని చూస్తూ ధ్యాన నిమగ్నురాలై ఉన్నప్పుడు ఒక తెల్లని సర్పం ఆమెకు పడగతో నీడను పట్టిన దృశ్యాన్ని చూచామని ఆనాటి వారు చెప్పుకునేవారు.

వేంకటేశ్వరుని తన గుహకు పిలిపించుకుని యక్షగానాలు వినిపించేదని జనశ్రుతి. తిరుమలలో ద్విపద భాగవత రచన చేస్తున్న రోజులలో సుప్రభాతసేవకు సమయం అయిందని త్వరపడి వెళ్లిపోతున్న స్వామిని ఉత్తరీయం పట్టుకుని ఆపినప్పుడు అది చిరిగి వెంగమాంబ చేతిలో మిగిలిపోయిందనీ, స్వామి ఉత్తరీయం చిరిగి ఉండడం, గమనించిన పూజారులు మిగిలిన

ముక్క కోసం వెదకి వెంగమాంబ ఇంటిలో కనుగొన్నారని చెప్పేమాట ఈ సత్యాన్ని బలపరుస్తుంది.

విధవరాలు హారతి ఇవ్వడమేమిటని కొందరు ఈసడించిన కారణంగా వెంగమాంబ ఒకనాడు స్వామికి హారతి ఇవ్వలేదట. స్వామివారు ఊరేగింపు సమయంలో రథం వెంగమాంబ ఇంటిముందు నిలిచిపోగా, అందరూ వెళ్లి ఆమెను క్షమాపణ అడిగి, హారతి ఇప్పించిన తరువాత కదిలిందట! అప్పటి నుంచి ఈనాటివరకు వేంకటాచలపతికి అనుదినం చివరిసేవ "తాళ్లపాక వారి లాలి, తరిగొండ వారి హారతి."

**సాహిత్య తపస్విని :**

*"అలఘునభంబు నుండి విమలాక్షర పంక్తుల రీతి వచ్చి*
*నలసతఁ జెందియున్న తఱి నాననమందు వసించి, జ్ఞానముం*
*గలుగఁగఁ జేసి మానస వికారములందొలగించి, జిహ్వపై*
*నిలిపి నటించు శారదను నిత్యము సన్నుతి చేయుచుండెదన్."*

అని వెంగమాంబ శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో చెప్పుకుంది. తనను అక్షర రూపంలో శారద అనుగ్రహించిన నాటి నుంచి సాహిత్య తపస్సును, తపస్సుతోపాటు కొనసాగించింది వెంగమాంబ. అందువల్లనే ఎన్నో కావ్యాలు, యక్షగానాలు, శతకాలు సహజాతంగా వచ్చిన పాండితీ ప్రకర్షతో వెలువడ్డాయి. అమాత్యునివలె దీనిని సమర్థించడానికి తగిన అధారాలామె రచనలలోనే కనిపిస్తాయి. ఎంత వినయమో చూడండి!

*"నా చిన్నమాట నోనామాలనైన నా*
*చార్యుల చెంత నేఁ జదువలేదు*
*పరఁగ ఛందస్సులో పది పద్యములనైన*
*నిక్కంబుగా నేను నేర్వలేదు*

*లలిఁ గావ్యనాటకాలంకార శాస్త్రముల్*
*వీనులనైన నే వినఁ గలేదు*
*పూర్వాతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్*
*శోధించి వరుసగాఁ జూడలేదు*
*చేరి తరిగొండ పురి నారసింహదేవుఁ*
*డానతిచ్చిన రీతిగా నేనిమిత్త*
*మాత్రమై పల్కుదును; స్వసామర్థ్యమిప్పు*
*డరసి చూచినగాని నాయందు లేదు."*

అంతేకాదు. తనది 'బాలభాష' అని, తీపి తిని మొహం మొత్తినప్పుడు 'పచ్చడియునంజుకొనిన విధంబుగ' తన రచన ఆనందించమని 'వరుస నాక్షేపింపవలదు' అని ప్రార్థించింది. భక్తి పరాయణతలోనూ, హరిహరాభేదంలోనూ మాత్రమే కాక, సహజ పాండిత్య విషయంలోనూ, గ్రంథకర్తృత్వ నిరాసంలోనూ కూడా తరిగొండ వెంగమాంబ బమ్మెరపోతరాజుగారిని స్ఫురణకు తేక మానదు. ఆ విషయాన్ని తన ద్విపద భాగవతంలో స్పష్టం చేసింది కూడా.

*"ఆనాడు పోతరాజాత్మయందుండి*
*నానార్థ సార నిర్ణయ వాక్యములను*
*పలికించినటువంటి పట్టాభిరాముఁ*
*డలర నామీద నేఁ డభిమానముంచి*
*చెలువొప్ప నెపుడును బల్కి తత్కృతిని*
*శ్రీ తరిగొండ నృసింహు డనంగ*
*ఖ్యాతిగా వెలయు వేంకటగిరీశ్వరుని*
*పదయుగళికి సమర్పణము చేసెదను."*

ఈ అంశాన్ని సమర్థించే మాట మరెవ్వరూ చెప్పనిది కూడా చెప్పింది వెంగమాంబ. లోకంలో పోతన విషయంలో ఒక ఐతిహ్యం

ప్రచారంలో ఉంది. "అలవైకుంఠ పురంబులో..." పద్యం కొంత రచించిన తర్వాత పోతన ఆపివేస్తే, పోతన రూపంలో వచ్చి సాక్షాత్ విష్ణువే దానిని పూరించాడనేది. పోతన వైకుంఠం చూడలేదు కనుక వర్ణించలేకపోయాడు. స్వామి సహాయం చేశాడు. అదేవిధంగా శృంగార రస భూయిష్ఠంగా చెప్పలేనని వెంగమాంబ అంటే, స్వామి తానే ఆ విధంగా చెప్పుకున్నాడంటుంది వెంగమాంబ.

*"శృంగారాకృతితోడ వచ్చి పదముల్ శృంగార సారంబుతో*
*డం గూఢంబుగఁ జెప్పనీవనగ 'నట్లా చెప్పలే'నన్న, నన్*
*ముంగోపంబునఁ జూచి, లేచి యటనే మ్రొక్కంగ మన్నించి, త*
*చ్ఛృంగారోక్తులు తానె పల్కికొను నాకృష్ణు సేవించెదన్."*

వెంగమాంబ రచనలు సరళంగా హృదయానికి హత్తుకొనిపోయే విధంగా ఆర్ద్రంగా ఉండటానికి ఇదే కారణం అయి ఉండవచ్చు.

వెంగమాంబ తన రచనలను గురించి ఈ విధంగా చెప్పుకుంది:

*"అటు గాన నారసింహాంకిత శతక*
*మట మీద నారసింహ విలాస కథయు*
*నట శివనాటకంబదియునుగాక*
*నట రాజయోగ సారాఖ్య సద్ద్విపద*
*నట కృష్ణ నాటకం బదియునుగాక*
*నట పారిజాతాపహరణ సత్కృతియు*
*నట రమాపరిణయంబును పెండ్లిపాట*
*యట చెంచు నాటకంబును నొక్క కథయు*
*మఱియును శ్రీకృష్ణమంజరి యవల*
*నిరుపమ శ్రీ రుక్మిణీ నాటకంబు*
*విరచించి భక్తితో వేంకట శైల*

*వరమందు తరిగొండ వాసుఁడై నన్ను*
*పరిపాలనము చేయు ప్రభువై తనర్చి,*
*కరుణార్ద్ర దృష్టితోఁ గడతేర్తు ననుచు*
*సరస విజ్ఞాన లక్ష్యమునచ్చినట్టి*
*శ్రీనివాస స్వామి శ్రీపాదములకుఁ*
*బూని యర్పించితిప్పుడు సంతసమున."*

అని ద్విపద భాగవత ప్రారంభంలో చెప్పుకుంది. వీటిలో అధికభాగం యక్షగానాలు. వెంగమాంబ లాగా పెక్కు యక్షగానాలు రచించిన కవయిత్రులు కాని, కవులుగాని తెలుగులో లేరు"- అని యక్షగాన వాఙ్మయంపై పరిశోధన చేసిన అచార్య యస్వీ జోగారావుగారన్నమాట వాస్తవం.

ప్రప్రథమంగా తరిగొండలో నివాసం చేస్తున్న కాలంలోనే "నరసింహ శతక రచన కావించింది. అటుపై ద్విపద భాగవత రచన చేయడానికి ముందు చెప్పిన కావ్యాల పట్టికపైన ఉంది. అవికాక "విష్ణుపారిజాతం", "జలక్రీడా విలాసం" అనే యక్షగానాలు, వేదాంత, తాత్త్విక విషయాలతో నిండిన "వాసిష్ఠ రామాయణం", "ముక్తికాంతా విలాసం", "అష్టాంగ యోగసారం" కూడ రచించింది. తన ఆరాధ్యదైవం శేషకుధరాధ్యక్షుని ఆజ్ఞానుసారం "శ్రీ వేంకటాచలమాహాత్మ్యం" రచించింది.

**వెంగమాంబ-అన్నమయ్య :**

యక్షగానాలలోవి కాక వెంగమాంబ రచించిన కీర్తనలు రమారమి ఇరవై వరకు ఉన్నాయి. వెంగమాంబ కీర్తనలన్నింటికీ కూడా అన్నమయ్యవలె రాగ నిర్దేశకమే కాక, తాళ నిర్దేశం కూడా చేసింది. తాళ్లపాకవారు అభిమానించి ఆదరించి చిన్న ఇంటిని నివాస స్థానంగా ఇచ్చినందున, వారి గ్రంథాలు చదివే అదృష్టం

లభించింది. వాటి ప్రభావం కూడా వెంగమాంబ మీద వలసినంతగా ఉందనడానికి ఇదొక నిదర్శనం. తాళ్లపాక తిమ్మక్క "సుభద్రా పరిణయం" ప్రేరణ వల్లనే "రమాపరిణయం" అనే పెండ్లిపాట రచించి ఉండవచ్చు. పేరుకు మాత్రమే ఇది పాట. వాస్తవానికి కావ్యం. అన్నమాచార్యుల సంకీర్తన ఫణితులను 'శృంగార మంజరి'ని, చిన్నన్న 'అష్టమహిషీ కల్యాణా'న్ని వెంగమాంబ తన రచనలలో సమర్థవంతంగా అనుసరించింది. పూరకవిస్తుతిలో "వరలబ్ధ మన్నమాచార్యునకు" అని అన్నమయ్యను కొనియాడి తన అభిమానాన్ని, కృతజ్ఞతను ప్రకటించిన ఏకైక కవయిత్రి వెంగమాంబ. అన్నమయ్య వలెనే వెంగమాంబ కూడా తెలుగు పాటలలో ఎంతో శైలీ వైవిధ్యాన్ని ప్రదర్శించింది. తెలుగు పలుకుబళ్లతో అలంకరించింది. అన్నమయ్య కీర్తనల వలెనే యతి నియతి, అంత్య ప్రాసనియుక్తి కలిగి వెంగమాంబ కీర్తనలు కావ్య గౌరవం సంతరించుకున్నాయి.

అన్నమయ్య సంకీర్తనలలో శివ, గణపతి, శక్తి సంబంధమైనవి కానరావు. శ్రీవైష్ణవ మత స్వీకారం వల్ల కావచ్చు. కాని, వెంగమాంబ శివకేశవ భేదం పాటించినట్లు కానరాదు. "జలక్రీడా విలాసం"లో "గణనాయకా! శరణు" అని గణపతి స్తుతి రచించింది. "శివపారిజాతం" లేక "శివనాటకం" అనే పేరుతో శివకథను రచించింది. 'చెంచు నాటకం'లో కూడా శివుని కీర్తించింది.

"సలలిత నాగ భూషణముల తోడ
పులితోలు త్రిపుండ్రంబుతోడ........"
.... అంటూ

ఆర్ద్ర భావుకత, అభివ్యక్తి తీవ్రత, ప్రౌఢ శబ్దగ్రథన నిపుణత వెంగమాంబ రచనలో కానవచ్చే ముఖ్య లక్షణాలు. వసుచరిత్రకారుని ప్రయోగాల వంటి ప్రౌఢ ప్రయోగాలు కూడా దర్శనమిస్తాయి వెంగమాంబ రచనలలో.

యక్షగానరచన కత్యావశ్యకమైన పాత్రోచిత సంభాషణా చాతుర్యం వెంగమాంబకు వెన్నతో పెట్టిన విద్య అనిపిస్తుంది. చెంచు నాటకంలో వేంకటేశ్వరుని చెంచు రూపంలో తదనుగుణమైన భాషతో వర్ణించింది.

"వినరన్ననే జూచు వేంకటేశ్వరుడు
మినమినమని చాల మెరిసేటి దేమొ
ఘట్టిగా తలమీద గదియించి దాని
చుట్టు పూదండలు చుట్టుకున్నాడు
లలిమించు మొసలి పిల్లల వంటివేమొ
తళుకుగా చెవులకు తగిలించినాడు

రచనలో పోతనను స్ఫురణకు తెచ్చే వెంగమాంబను పుష్పగిరి పీఠాధిపతులు ప్రహ్లాదుని అవతారంగా చెప్పినా, భక్తులు శిష్యులు, గిరిధర గోపాలుని పతిగా భావించి, తరించిన మీరాబాయి అపరావతారంగా భావించేవారు.

**సమతాభావం :**

వెంగమాంబ విష్ణు తత్త్వాన్ని పరిపూర్ణంగా ఎరిగి, వంట పట్టించుకున్నది కనుక సమస్తంలో విష్ణువును మాత్రమే దర్శించింది. "సర్వం విష్ణుమయం సద్గురురాయా!"... అని కీర్తించగలిగింది. నందవరీకుల కులదైవం చౌడేశ్వరీదేవి. తరిగొండ నృసింహ క్షేత్రం మహాయోగి అయిన రూపావతారం సుబ్రహ్మణ్య శాస్త్రిగారి శిష్యరికంలో వెంగమాంబ పరమయోగినిగా, మహాకవయిత్రిగా రూపొందటంలో ఈ మూడు దైవీశక్తులు తోడ్పడ్డాయి. అవే వెంగమాంబ వ్యక్తిత్వంలో భక్తితత్త్వంలో మనకు ద్యోతకమవుతాయి. వెంగమాంబ చౌడేశ్వరీదేవిని ఇష్టదేవతా

స్తుతుల్లో కీర్తించింది. సందర్భోచితంగా గణపతి పైనా, శివునిపైనా కీర్తనలు కూర్చింది. అంతటితో ఊరుకోక ప్రత్యేకంగా "శివ పారిజాతం" అని శివుడి ఇతివృత్తాన్నే యక్షగానంగా రచించింది. ఇదేమి?- అని అడిగిన వారికి శివకేశవులకు భేదం లేదని సందేహ నివారణ చేసింది.

*"శివుడంటేనేమి? కేశవుడంటేనేమి?*
*శివకేశవుల చిత్త స్థితి భేదమేమి?*
*....."అని.*

దేవతామూర్తులనే కాదు; ద్వంద్వాలను కూడా అభేదంగా చూడటం యోగసిద్ధి నొందిన వెంగమాంబకు సిద్ధించింది. చెడుదంటేనేమి? మంచిది యంటేనేమి?" అనే ద్వంద్వాతీత స్థితికి చేరుకుంది. ఈ స్థితిని సాధించటమే మానవజన్మ ఎత్తినందుకు ప్రయోజనమని బోధించింది.శ్రీ కృష్ణమంజరి - అనే స్తోత్రములో ప్రాణప్రయాణ సమయంలో శ్రీకృష్ణుని తనముందు నిలబడమని ప్రార్థించి, కృతార్థురాలయింది.

జీవితాన్ని సాహిత్య తపస్సుగా, యోగసాధనగా మలచుకుని స్త్రీలు ఎంత ఎత్తుకు ఎదగగలరో నిరూపించి, అడ్డంకులను ఏవిధంగా అధిగమించాలో ఆచరణాత్మకంగా చూపించిన మహా సిద్ధురాలు, మహాకవయిత్రి, పరమయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

# * తరిగొండ వెంకమ్మ

- ఆచార్య బిరుదురాజు రామరాజు

భక్తికీ, బ్రహ్మానుభవానికీ కులమతాలు వర్ణ వర్గాలు, స్త్రీ పురుషులు అనే భేదాలు అడ్డు కా వనటానికి ప్రపంచదేశాలన్నిటా దృష్టాంతా లున్నవి. మనదేశంలో వేదకాలంనుండి బ్రహ్మావాదిను లున్నారు. ఆంధ్రదేశంలో అన్ని కులాల్లోను భగవత్సాక్షాత్కారమూ, బ్రహ్మానుభవమూ పొందిన తల్లులెందరో ఉన్నారు. అట్టివారిలో తరిగొండ వెంకమ్మ ప్రముఖురాలు. తెలుగు సాహిత్యచరిత్రలో ఆమెది విశిష్ట స్థానం. గొప్ప కవయిత్రిగానే కాక యోగవిజ్ఞానానికి సంబంధించిన రెండు ఉత్తమ గ్రంథాలు రచించటంచేత వెంకమ్మను ఆంధ్రయోగినుల్లో అగ్రేసరురాలుగా సంభావించవలెను. తరిగొండలో జన్మించటం చేత ఆమెను తరిగొండ వెంగమ్మ-వెంకమ్మ అంటున్నారు. తరిగొండ చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకా కేంద్రానికి ఉత్తరాన రెండు క్రోసుల దూరాన ఉన్నది. అది లక్ష్మీనరసింహ క్షేత్రం. కర్నూలు జిల్లా కానాలనుండి వసిష్ఠ గోత్రీకులు నందవరీకులు కొందరు వచ్చి తరిగొండలో ఎన్నడో స్థిరపడ్డారు. వారి సంతతిలో కానాల కృష్ణయ్య ఒకరు. అయన భార్య మంగమ్మ. దంపతు లిద్దరూ ధర్మపరాయణులు, తరిగొండ లక్ష్మీనరసింహస్వామి భక్తులు. వాళ్ళకు చాలాకాలందాకా సంతానం కలుగనందున తిరుమలకు పోయి వేంకటేశ్వరస్వామికి మ్రొక్కుకొని వచ్చినారు. స్వామి అనుగ్రహంతో వారికి ఒక అందాల బిడ్డ పుట్టింది. అందువలన ఆమెకు వెంగమ్మ-వెంకమ్మ అని పేరు పెట్టినారు. లేకలేక కలిగిన సంతానం కనుక వెంకమ్మ శైశవం అల్లారుముద్దుగా గడచింది. మంగమ్మ కృష్ణయ్యలు తమ ఇలువేలుపు

---

*ఈ వ్యాసం ఆచార్య బిరుదురాజు రామరాజుగారు రచించిన "ఆంధ్రయోగులు'- (ప్రథమభాగము) - అనే గ్రంథంనుండి ధన్యవాదములతో స్వీకరింపబడింది.

లక్ష్మీనరసింహస్వామిని, బిడ్డను ప్రసాదించిన వేంకటేశ్వరస్వామిని అభేదంగా సేవిస్తుంటే ఆ కైంకర్యంలో శిశువు వెంకమ్మ పాలుపంచుకొనేది. అదృశ్యం కన్నవారికీ కనుగొన్నవారికీ ఆనందదాయకం. తరతరాలుగా సాహిత్య వాతావరణం ఉన్న ఆ యింటిలో వెంకమ్మకు సాహిత్యమూ భక్తీ సహజంగా అబ్బినవి.

వెంకమ్మ పెరిగిన కొలది ఆమె భక్తీ పెరిగింది. అది తల్లిదండ్రులకు ఇబ్బందిగా ఉండేది. తోటి పిల్లలతో ఆడుకోకుండా వెంకమ్మ మైమరచి భగవత్సంకీర్తనం చేస్తూ నాట్యం చేస్తుంటే కృష్ణయ్యకు ఆందోళన ఎక్కువైనది. ఆమె మనస్సు మారటానికి ఇంటి పనులు ఎక్కువగా చెప్పేవారు. ఆ పనులు త్వరగా చేస్తూ ఆమె భక్తిభావం మరింత దృఢపరచుకున్నది. పెండ్లి చేస్తే మారవచ్చునని వరాన్వేషణ చేస్తుంటే ఆమె తనకు లౌకికమైన వివాహం అక్కరలేదని, భగవంతుడే తన భర్త అని తండ్రికి ధైర్యంగా చెప్పింది. ఆయన వెంకమ్మను తీవ్రంగా మందలించి, చిత్తూరు సమీపంలోని నారగుంట పాళెం వాస్తవ్యులు శ్రీ వత్సగోత్రీకులు ఇంజేటి తిమ్మయ్య కొడుకు వెంకటాచలపతితో మూడుముడులు వేయించినాడు. త్రికరణశుద్ధిగా శ్రీనివాసునికంకితమైన తనను ఎవరికో ధారాదత్తం చేసినందుకు తండ్రిని విమర్శించి వెంకమ్మ తన భక్తిసాధనలు కొనసాగించింది. ఆమె వ్యక్తురాలైన తరువాత పుట్టింట నిషేకం ఏర్పాటు చేసినారు. శోభనగృహంలో భర్తతో వెంకమ్మ తన సర్వస్వం వేంకటేశ్వరస్వామికి అంకితం కనుక, తనను శరీర సుఖానికై నిర్బంధించవద్దని ఖండితంగా చెప్పింది. ఆమె భక్తికీ, వైరాగ్యధోరణికీ అబ్బురపడి వెంకటాచలపతి వేకువనే తన గ్రామానికి తిరిగిపోయినాడనీ, పడకగదిలో వెంకమ్మ తమ కులదేవత చౌడేశ్వరివలె కనపడటంచేత భయపడి వెళ్ళిపోయినాడనీ కథలు ప్రచారంలో ఉన్నవి. సౌందర్య వతియైన భార్యతో కాపురం చేసే

భాగ్యం కోల్పోయిన విచారంతో మనోవేదన పాలై వెంకటాచలపతి అనతికాలంలోనే తీవ్రంగా జబ్బుపడి చనిపోయినాడు. విరక్తయైన వెంకమ్మకు భర్త మరణం వేంకటేశ్వరస్వామిపై భక్తిని దృఢతరం చేసింది. ఆమె వైరాగ్యం మారాకులు తొడిగింది. వివేక, వైరాగ్యాలతో పాటు సుజ్ఞానం సహజంగా అబ్బిన వెంకమ్మ నాటి సమాజం కట్టుబాట్లను తృణీకరించి, వేంకటరమణుడే తన భర్త అని బాహాటంగా చాటి, మాంగల్యచిహ్నాలు తీసివేయలేదు. నాటి బ్రాహ్మణులు ఆమెకూ ఆమె తండ్రికీ సంఘమర్యాదలు బోధించినారు. వెంకమ్మ తల్లిదండ్రులు సంఘానికి భయపడితే ఆమె బుద్ధివైభవంతో వైరాగ్యంతో వారికి నచ్చచెప్పి సంఘాన్ని ఎదిరించి నిలిచింది. కూతురు కోరిన శ్రేయోమార్గమే మంచిదనుకున్న కృష్ణయ్య మదనపల్లిలో ఉండే ఆధ్యాత్మికవిద్యావేత్త రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రుల వద్దకు పోయి ఆమెకు బ్రహ్మ విద్యోపదేశం చేయవలసిందిగా అభ్యర్థించినాడు. శాస్త్రులు అందు కంగీకరించినాడు.

సుబ్రహ్మణ్యశాస్త్రులు తమ ఉపాస్యదైవం సోమేశ్వర స్వామి సన్నిధిలో వెంకమ్మకు వేదాంతం బోధించినాడు. వెంకమ్మ గురువును త్రిమూర్తిస్వరూపుడుగా కొలిచింది. ఆమె భక్తి జ్ఞాన వైరాగ్యాలకు మెచ్చి గురువు మంత్రోపదేశం చేసి, భక్తితత్త్వాన్ని, యోగశాస్త్ర రహస్యాలను వివరించినాడు. తీవ్రసాధనలతో ఆమె జ్ఞానం పక్వమైనది. దేశికుడు సంతృప్తుడై మరికొన్ని సాధన మార్గాలు, మెలకువలు చెప్పి దీవించి వెంకమ్మను తరిగొండకు పంపినాడు. పితృగృహానికి తిరిగి వచ్చిన వెంకమ్మ దినంలో చాలా భాగం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గడుపుతుండేది. ఆ గుడిలోనే ఒకవైపున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం చాటున ఏకాంత ప్రదేశంలో యోగసమాధిలో ఉండేది. ఈ విషయం ఎవ్వరికీ

తెలియదు. తక్కిన సమయాల్లో ఇంటిపట్టున భక్తి కవితా రచనలు చేస్తుండేది. వెంకమ్మ భక్తిసాహిత్యంలో తొలిరచన తరిగొండ నృసింహశతకం. రెండవ కృతి ప్రహ్లాదచరిత్ర ఆధారంగా రచించిన నృసింహవిలాస కథ - యక్షగానం. ఈ రెండు కృతులూ తరిగొండ నృసింహస్వామికి అంకితం. మూడవ కృతి శివవిలాస యక్షగానం రాచవీటి (రాయచోటి) వీరభద్రస్వామికి అంకితం. అందాలరాశి, నవయౌవన, విగతభర్తృక, వెంకమ్మ నృసింహాలయానికి రాకపోకలు చేస్తుంటే కుమతులు కొందరు ఎగతాళి చేస్తుండేవారు; కొందరు దుష్ప్రచారం సాగించినారు. ఆమె సమస్త భారం లక్ష్మీనరసింహ స్వామిపై వేసి యోగసాధన, కవితా తపస్సు, కొనసాగించింది. యోగంవలె ఆమె కవిత్వం దినదినం పరిపక్వస్థితికి చేరింది. ఈ కాలంలోనే ఆమె రాజయోగామృత సారమనే తాత్త్విక ద్విపదకావ్యం నరసింహస్వామి కంకితంగాను, బాలకృష్ణ నాటకమనే యక్షగానం వాసుదేవ పరబ్రహ్మ కంకితంగాను రచించినది.

వెంకమ్మ వైరాగ్యం, వేదాంతధోరణి తరిగొండ బ్రాహ్మణులకు నచ్చలేదు. ఆమెపై నిందలు మోపి గేలిచేస్తుంటే ఆమె సరకు చేయలేదు. కొందరికి పట్టుదల పెరిగి ఆమెకు వైధవ్యలక్షణమైన శిరోముండనం చేయించకపోతే కృష్ణయ్యను బ్రాహ్మణసంఘంనుండి వెలివేస్తా మన్నారు. కూతురుపై ఎంత ప్రేమ విశ్వాసాలున్నా కృష్ణయ్య సంఘానికి భయపడి వెంకమ్మకు శిరోముండనం చేయించటానికి పూనుకున్నాడు. వెంకమ్మ నరసింహస్వామిపై భారం వేసి ధ్యానం చేస్తూ తలవంచింది. తల కొరగటానికి వచ్చిన మంగలికి గుండెదడ పుట్టి చేయాడ లేదు; పులిని చూచిన లేడి వలె భయభ్రాంతుడైనాడు. ఆ వినోదం చూడటానికి వచ్చిన విప్రబృందానికి అదే గతి పట్టింది. శిరోముండనం ఆగిపోయింది. కాని పూర్వాచార పరాయణులైన

బ్రాహ్మణులు పుష్పగిరి పీఠాధిపతులకు వెంకమ్మ వలన తమ సంఘానికి జరుగుతున్న అపచారం తెలియజేసినారు.

అప్పటి పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ మదభినవోద్దండ విద్యానృసింహ భారతీస్వాముల వారు ముందుగా శ్రీముఖం పంపి, తాము బయలుదేరి వచ్చినారు. జగద్గురువులు దేవాలయంలో విడిది చేసి వెంకమ్మను తీసుకరావటానికి పరిచారకులను పంపినారు. ఆమె భోజనానంతరం వస్తానన్నది. ఆమె సమాధానం జగద్గురువులకు ఆశ్చర్యావేశాలను, విప్రబృందానికి కోపతాపాలను కలిగించింది. శిరోముండనం చేయించుకోని విధవను చూడరాదని జగద్గురువులు తెరకట్టించినారు. ఆమె వచ్చి తెరచాటున నిలిచింది. స్వామివారు సదాచారాలు, కులవధూ వర్తనం, బ్రాహ్మణస్త్రీ ధర్మం బోధించి, విప్రవితంతువుకు ఉచితమైన శిరోముండనం చేయించుకొమ్మని ఆదేశించినారు. తెరచాటునుండే వెంకమ్మ ప్రతివాదం ప్రారంభించింది. పతివ్రత పరపురుషుని ముట్టరాదు గదా! పరపురుషుడైన మంగలిని తానెట్లు ముట్టగలననీ, కేశాలుంటే తొలగిపోయే, కేశాలు తీయిస్తే నిలిచే పాతివ్రత్యధర్మం ఏశాస్త్రంలో ఉన్నదనీ, వెంట్రుకలు తీయించటానికి ఆదేశించే జగద్గురువులు వెంట్రుకలు మరల మొలవకుండా ఆదేశించగలరా? - అనీ ధైర్యంగా ప్రశ్నించినది. ఆమె సహేతుక ప్రశ్నలకూ, తమకు నమస్కరించనందుకూ, జగద్గురువులకు కోపం, ఆశ్చర్యం కలిగినవి. జగద్గురువులకు ఏల నమస్కరించలేదని ప్రశ్నిస్తే, ఆ సింహాసనంనుండి జగద్గురువులు లేచి ప్రక్కకు జరిగితే నమస్కరిస్తానన్నది. ఆమె మాటల్లో ఏదో పరమార్థం ఉంటుందని జగద్గురువులు తెర తీయించి తాము లేచి ప్రక్కకు తొలగినారు. వెంకమ్మ లక్ష్మీనరసింహస్వామిని ధ్యానిస్తూ రెండుచేతులు జోడించి నమస్కరించింది. వెంటనే సింహాసనం భగ్గున మండి కాలిపోయింది.

జగద్గురువులు భయభ్రాంతులై వెంకమ్మ ప్రహ్లాదావతారమంటూ తామే నమస్కరించి, ఆమెను ప్రశంసించి విప్రమండలిని మందలించి వెళ్ళిపోయినారు. బ్రాహ్మణసంఘం అవమానం పాలైనది. బ్రాహ్మణులు కృష్ణయ్య ఇంటికి రాకపోకలు మాని, వెలివేసినట్లు ప్రవర్తిస్తుంటే నిస్సహాయుడైన కృష్ణయ్య తన బ్రతుకు, కన్నకూతురు మూలంగా పరిహాసభాజనమైనందుకు ఏడ్చి, విసుగుతో వెంకమ్మను ఇంటినుండి వెళ్ళిపొమ్మన్నాడు.

వైరాగ్యం మూర్తీభవించిన వెంకమ్మ తండ్రి మాటలు దైవవాక్కుగా స్వీకరించి ఇల్లు విడిచి నృసింహాలయం చేరి సదా ధ్యానంతో సంకీర్తనల గానంతో రేయింబవలు తీవ్రసాధన చేసింది. ఆమె ఒక్కొక్కసారి భక్త్యావేశంతో మైమరచి గర్భాలయం చొచ్చి స్వామిని చేతులారా పూజించేది. రాత్రిపూట పూజారులు గుడి తలుపులు మూసిపోతే ఆమె ప్రాకారమండపంలో భగవన్నామసంకీర్తనం చేస్తుండేది. తెల్లవారుజామున ఆమె గొంతెత్తి మేలుకొలుపులు, కీర్తనలు పాడుతుంటే ఆలయమంతా భక్తి భావతరంగాలతో నిండిపోయేది. ఉత్తర దేశాన మీరాబాయి వలె ఆంధ్రదేశాన వెలసిన మహాభక్తురాలు తరిగొండ వెంకమ్మ. ఆమె వారాల తరబడి ఆంజనేయవిగ్రహం చాటున నిరాహారంగా ధ్యానసమాధిలో ఉండే విషయం ఎవరికీ తెలియదు. ఆమె కనబడకపోతే ఊరు విడిచి పోయిందనుకున్నారు. ఒకనాడు అర్చకుడు ఆంజనేయవిగ్రహం చాటున చీకటిలో ఉన్న వెంకమ్మను చూచి ముందుగా భయపడి, తరువాత ధైర్యం చేసి, గుప్తవర్తనం కోసం ఆమె అక్కడ దాగిందని శంకించి తలవెంట్రుకలు పట్టి ఈవలి కీడ్చినాడు. యోగసమాధి భంగమైనందున వెంకమ్మ కనులు తెరచి చూచింది. ఆమె దృష్టికి తట్టుకోలేక పూజారి మూర్ఛితుడై, కొంతసేపటికి తేరుకొని కాళ్ళపైబడి అపరాధం క్షమించవలసిందిగా

ప్రార్థించినాడు. వెంకమ్మ ఇక తాను తరిగొండ విడిచిపోవటమే భగవదిచ్ఛగా భావించి ఒంటరిగా బయలుదేరి ఆకలిదప్పులు నరకుచేయక తిరుపతి దిశగా నడచి వేంకటాచలారణ్యం ప్రవేశించినది. లక్ష్మీనరసింహస్వామిని కీర్తిస్తూ ఆమె నడచి పోతుంటే క్రూరమృగాలు, విషసర్పాలు వైదొలగిపోయేవి. ఆ దట్టమైన అడవిలో వెంకమ్మ రెండు దినాలు నడచి సందెకావు మొగలి పెంటకోన ప్రవేశించినది. అక్కడ వెలసియున్న ఆంజనేయస్వామి సన్నిధిలో పద్మాసనాసీనయై వేంకటేశ్వరస్వామిని ధ్యానిస్తూ తీవ్రంగా తపస్సు చేసింది. ఒకనా డామెకు శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై తన సన్నిధికి రావలసిందిగా ఆదేశించినట్లు అనుభూతి కలిగింది. ఆ కారడవిలో తనను కాపాడిన అంజనేయస్వామిని స్తుతించి, అడవి గడచి, కొండలెక్కి, తిరుమల చేరినది. ఆమె తపస్సు ఫలించింది. భక్త్యావేశంతో వేంకటేశ్వరస్వామిని కొనియాడుతూ ఆలయం ప్రవేశించి తనివిదీరా స్వామిని దర్శించి మైమరచింది. వెంకమ్మ కంటె ఆమె భక్తి, భక్తికంటె ఆమె కీర్తి ముందుగా తిరుమల చేరినట్లున్నవి. వెంకమ్మ మహాయోగిని, మహాభక్తురాలని ఇదివరకే విన్న ఆనాటి మహంతు శ్రీనివాసుని కోవెల తూర్పుమాడవీథి చివరలో ఉన్న పూరిల్లు ఆమె నివాసం కోసం ఇచ్చినాడు. స్వామివారి పాకశాలనుండి వకుళమాలిక పేరుతో బియ్యం ఇతర సంభారాలు పంపించే ఏర్పాటు చేసినాడు.వెంకమ్మ స్వయంపాకం చేసుకొని స్వామికి నైవేద్యం పెట్టి, అరగించి గ్రంథరచనం చేస్తుండేది. తీరికవేళల్లో పూలచెట్లు పెంచి స్వామికి ప్రతిదినం మాలాకైంకర్యం చేసివచ్చేది. తిరుమలకు చేరిన తరువాత ఆమె హయగ్రీవ మంత్రోపదేశం పొందినది. తిరుమలపై ఉంటూ రచించిన కృతులన్నింటిలో అతఃపూర్వం లేని హయగ్రీవస్తుతి కానవస్తుంది. తిరుమలలో ఆమె రచించిన మొదటి కృతి విష్ణుపారిజాత యక్షగానం. భక్తి పరిమళాలు వాసించే కవితామకరందం అది!

తిరుమలలో ఉండే సంకీర్తనాచార్యులు తాళ్ళపాక పెద తిరుమలాచార్యుల వంశీయులు తరిగొండవెంకమ్మ భక్తి మహిమ, కవితా మహత్త్వం విని, ఉత్తర మాడవీథిలో తమ యింటిప్రక్కనున్న చిన్న యిల్లు ఆమెకుచితంగా ఇచ్చినారు. వెంకమ్మ ఇంతకు ముందున్న పూరిల్లు విడిచి తాళ్ళపాకవారిచ్చిన మిద్దెటిల్లు ప్రవేశించినది. అక్కడ పూలచెట్లు, తులసీవనం పెంచి స్వామికి మాలాకైంకర్యం చేసేస్తుండేది. ఆయింట్లో ఉంటూ 'రమాపరిణయ'మనే ద్విపదకావ్యం పెండ్లిపాటగా రచించినది. వెంకమ్మ యింటినానుకొని అక్కా రామయ్య దీక్షితులుండేవారు. ఆయన ఈస్టిండియా కంపెనీ నియోగించిన సర్కారు అర్చకుడు; పలుకుబడిగల ప్రముఖుడు. పూర్వాచారాన్ని ధిక్కరించిన యౌవన వితంతువు వెంకమ్మ స్వామికి మాలాకైంకర్యం చేయటం ఆయన ఇష్టపడలేదు. ఆమె తన పొరుగున ఉండటం ఆయనకు కంటగింపైనది. ఆమె వినేటట్లు సూటిపోటి మాటలంటూ, తమ యింటి యెంగిలి విస్తళ్ళు ఆమె పూలతోటలో పడవేయించి కష్టపెడుతూ సంతోషించేవాడు. ఒకనాడు వెంకమ్మ పెరడులోని తులసికోట తిన్నెపై కూర్చుండి ధ్యానం చేసుకుంటుండగా దీక్షితుల ఇంటి ఎంగిలి విస్తళ్ళు ఆమెపై బడినవి. ఆమెకు ధ్యానభంగ మైనది. ఎన్నడూ కోపమెరుగని వెంకమ్మ ఆవేశంతో దీక్షితులను "నీ వంశం నాశనంగాను" అంటూ శపించింది. ఆరాత్రే వాంతులు విరేచనాలతో దీక్షితుల కుటుంబీకులు కొందరు చనిపోయినారు. దీక్షితులు వెంకమ్మ కాళ్ళపైబడి క్షమాభిక్ష యాచించినాడు. ఆ యమ్మ క్షమించి 'ఇకనుండి నీ కుటుంబం ఏకప్రాణిమాత్రంగా ఉంటుం'దని తన శాపాన్ని కొంత ఉపసంహరించుకున్నది.

దైవికమైన ఈ సంఘటనతో ఆమె మనస్సు వికలమైనది. ఇకనుండి విజన స్థలంలో ఏకాంతంగా తపస్సు చేసుకోవలెనని

తీర్మానించుకున్నది. ఎవరికీ తెలియకుండా తుంబురుకోనకు పోయి తీవ్రతపస్సులో మునిగిపోయింది. తుంబురుకోన తిరుమలేశుని మందిరానికి ఉత్తరాన 10-12 మైళ్ళ దూరంలో ఉండే రమణీయ ఏకాంత ప్రదేశం. బ్రహ్మచర్యం, ప్రాణాయామం, తపస్సు చేసేవారు మాత్రమే ఇక్కడ ఉండగలరు. తదితరుల కిది అగమ్యం. ఇన్నూరేండ్ల తరువాత ఏర్పేడు వ్యాసాశ్రమ స్థాపకులు, సద్గురువులు మలయాళస్వామివారు (1897-1962) ఇక్కడ చాలాకాలం తపస్సు చేసినారు. తిరుమలవాసులు వెంకమ్మ కనబడకపోతే ఆమె చనిపోయిందో, అడవిలో కలిసిపోయిందో అనుకున్నారు. తుంబురుకోనలో వెంకమ్మ కఠోరమైన సాధన చేస్తూ తీరిక సమయంలో 'చెంచునాటకం' యక్షగానం రచించినది. కొంతకాలం తరువాత కుష్ఠరోగపీడితుడైన చంద్రశేఖరుడనే బ్రాహ్మణుడు తిరుమల చేరి, అందరి నిరాదరణకు గురియై అడవిబాట పట్టి, తుంబురుకోన చేరి దీనంగా అరుస్తుంటే అతని అరుపులు విని వెంకమ్మ మంచినీళ్ళు, అడవిపండ్లు ఇచ్చి ఆదరించి ఆశీర్వదించినది. తనను అక్కడ చూచినట్లు ఎవరికీ చెప్పవద్దనీ, చెప్పితే ప్రమాదం జరుగుతుందనీ హెచ్చరించి కండ్లు మూసుకొమ్మన్నది. అతడట్లే చేసి స్వస్థుడై స్వామి పుష్కరిణిలో తేలినాడు. కొన్నాళ్ళా బ్రహ్మణుడు వెంకమ్మ వార్త రహస్యంగానే ఉంచినాడు. తనకారోగ్యం అబ్బిన సంబరంలో పరవశుడై ఒకనాడు రహస్యం బయలుచేసి తలపగిలి చచ్చినాడు. అతని బృందావనం స్వామిపుష్కరిణి పడమట ఇప్పటికీ ఉంది. ఈ వార్త తెలిసి మహంతు మొదలైనవారు మంగళవాద్య పురస్సరంగా తుంబురుకోనకు పోయి, వెంకమ్మను బతిమాలి తిరుమలకు తీసుకవచ్చినారు. వెంకమ్మ తాళ్ళపాకవారిచ్చిన యింట్లో మరల ఉంటూ వేంకట రమణుని అర్చింపసాగింది.

క్రమంగా వెంకమ్మ తమ ఇంటికి ఉత్తరాన కొంత స్థలం సేకరించి పూలమొక్కలతో గూడిన తులసీబృందావనం పెంచింది. ఆ చెట్లకు నీళ్ళకోసం బావి త్రవ్వించింది. ఎంత లోతు త్రవ్వినా నీళ్ళు పడకపోతే స్వయంగా బావిలోనికి దిగి గంగాభవాని నుద్దేశించి ఒక కీర్తన పాడింది. తత్ఫలితంగా జలపడి పుష్కలంగా నీరు లభించింది. వెంకమ్మ చెల్లెలి కూతురు మంగమ్మ వచ్చి పెదతల్లిగారి సేవలో నిలిచిపోయింది. వెంకమ్మ కొన్నాళ్ళకు మంగమ్మను గరిడిమిట్ట చీనేపల్లి వారింటికిచ్చి పెండ్లి చేసింది. అపర వయస్సులో ఆ వంశంలోని నరసప్పను దత్తు తెచ్చుకున్నది. (అతని భార్య చెంగమ్మ. వారి సంతానం లక్ష్మమ్మ. ఆమె భర్త గమ్మన్న. వారి సంతానం గంగాధరప్ప; విష్ణుపారిజాత లేఖకుడు). వేంకటేశ్వరస్వామి సాయం కైంకర్యాలు ముగిసిన తరువాత ఏకాంతసేవ జరిగేటప్పుడు వెంకమ్మ కర్పూరహారతి ఇచ్చేది. పూర్వాచార పరాయణులైన కొందరు అర్చక స్వాములు ఈసడించుకొనేవారు. ఒకనాడామెకు వినపడేటట్లు తూలనాడితే ఆమె గుడిలో హారతి మాని, తన యింట్లో హారతి ఇచ్చి సంతృప్తి పడినది. మరునాడు రథోత్సవం. తిరువీథులు ఊరేగి వస్తున్న స్వామివారి రథం వెంకమ్మ ఇంటి ముందు వచ్చి నిల్చిపోయింది. ఎంత లాగినా కదలలేదు. మహంతుమొదలుకొని ప్రధానార్చకులు వచ్చి ప్రయత్నించి విఫలులైనారు. అప్పు డర్చకస్వాముల కండ్లు తెరుచుకున్నవి. వాళ్ళు తమ భుజాలు తడుముకొని వెంకమ్మగారిని అపరాధక్షమాభిక్ష వేడి, శ్రీవారి రథం సాగిపోవటానికి హారతివ్వవలసిందిగా బతిమాలినారు. మహంతుమాట మన్నించి వెంకమ్మ వచ్చి, రథారూఢులై యున్న శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామివారికి కర్పూరహారతి ఇచ్చినది. స్వామి రథం కదలింది. వెంకమ్మగారి మాహాత్మ్యానికి తిరుమల వాసులందరూ జేజేలు పలికినారు. ఆనాటినుండి వెంకమ్మ హారతి **ఆలయాధికారులచే నిత్యహారతిగా ఆమోదింపబడింది. ఈనాటికీ**

'తరిగొండవారి హారతి' 'ముత్యాల హారతి' పేర్లతో వెంకమ్మగారి హారతి అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది.

వెంకమ్మ తిరుమల చేరినప్పటినుండి వేంకటేశ్వర స్వామిని, తమ యిలువేలుపు తరిగొండ లక్ష్మీనరసింహస్వామితో అభేదంగా కొలిచేది. ఏటేటా లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు జరిపేది. తరిగొండలో తన తండ్రిగారింటిలో ఉండిన దేవతార్చన సంపుటి ఆమె మఠానికి చేరింది. వైశాఖ శుద్ధ చవితి మొదలుకొని పదిదినాలు నృసింహ జయంత్యుత్సవాలలో అన్నదానాలు, ధార్మికకార్యక్రమాలు నిర్వహించేది. పదియవనాడు వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి వెంకమ్మ ఇంటికి వచ్చి, నైవేద్యాది కైంకర్యా లందుకోవటంతో ఉత్సవాలు ముగిసేవి. తిరుమలకు వచ్చే ధార్మికులు మహాత్ములు, సాహిత్యప్రియులు ఆమెను దర్శించి పోయేవారు. క్రమంగా సంపన్నులు, జమీందార్లు, పాళెగార్లు వచ్చి వెంకమ్మ జరిపే ఉత్సవాలకు అయాచితంగా భూరివిరాళాలు, భూములు దానం చేసేవారు. ద్విపద భాగవతం రచించేనాటికి ఆమె మఠంలో అష్టఘంటములనే పేరుతో ఎనిమిది మంది వ్రాయసకాండ్రు ఉండేవారు. వారు ఆమె కృతులకు ప్రతులు వ్రాసేవారు. తిరుమలకు వచ్చే పండితులు, కవులు ఆమెను దర్శించి ఆమె కృతులకు ప్రతులు వ్రాయించుకొని పోయేవారు. ఆమె రచించిన నృసింహవిలాసం, విష్ణుపారిజాతం, గోపీనాటకం వంటి యక్షగానాలకు ప్రతులను ప్రదర్శకులకోసం ఎక్కువగా వ్రాయవలసి వచ్చేది. ద్విపదభాగవతం తరువాత ఆమె వేంకటాచల మాహాత్మ్యం చంపువుగా రచించినది. ఇంకా జలక్రీడావిలాసం, ముక్తికాంతా విలాసం యక్షగానాలు, వాసిష్ఠ రామాయణం ద్విపదకావ్యం, తరిగొండ శేషకుధరాధ్యక్షుని సంబోధిస్తూ అనేక కీర్తనలు, పద్యాలు, పాటలు, సంవాదాలు, తత్త్వాలు రచించినది. కోరి

వచ్చిన జిజ్ఞాసువులకు తత్త్వోపదేశాలు చేసినది. ఈ విధంగా 18వ శతాబ్దం ఉత్తరభాగం, 19వ శతాబ్దం ప్రథమపాదంలో కొంతకాలం ఒక దివ్య సారస్వతమూర్తిగా, ఆధ్యాత్మిక తేజోరాశిగా వెలిగిన తరిగొండ వెంకమ్మ, తాళ్ళపాక అన్నమయ్యవలె, హత్తీరాం బాబావలె శా.శ. ౧౭౩౯ ఈశ్వర సంవత్సరం శ్రావణ శుద్ధ నవమి నాడు వేంకటేశ్వరస్వామి పాదాల్లో కలసిపోయినది. ఆమె పెంచిన పూలతోటలో, ఆమె నిత్యం ధ్యానసమాధిలో కూర్చుండేచోట ఆమెను మహాసమాధి చేసినారు. తరువాత మండపమూ, దాని మధ్యన తులసికోట కట్టించినారు. సమాధికెదురుగా నేరేడు చెట్టుక్రింద గూటిలో ఆంజనేయ విగ్రహం నిల్పినారు. ఆ ప్రదేశాన్ని తరిగొండ వెంకమ్మ బృందావనమంటారు. వెంకమ్మ సమాధి వద్ద నిత్యపూజతో పాటు శుక్రవారం విశేషపూజ జరుగుతుంది.

వేదకాలంలో ఎట్లుండేదోకాని, భారతదేశంలో ప్రాచీనకాలం నుండి ఆధ్యాత్మిక శక్తి సంవలితులైన మహిళలు కూడా కడగండ్లపాలౌతూ వచ్చినారు. ఆంధ్రయోగిను లందరివలెనే తరిగొండ వెంకమ్మకు కూడ కష్టాలు, అవమానాలు తప్పలేదు. ఐనా వెంకమ్మ తనను భక్తితో కొలిచేవారి కిప్పటికీ దర్శనాలు ప్రసాదిస్తూ అభీష్టాలు తీరుస్తున్నారు. ఇన్నేండ్ల తరువాత 1915లో తుంబురుకోనలో తపస్సు చేస్తున్న సద్గురు మలయాళస్వామివారికి వెంకమ్మ దర్శనమిచ్చిందంటే, ఆమె ఎంతటి మహిమోపేతురాలో మనం ఊహించవచ్చు.

తరిగొండ వెంకమ్మ కృతులు చాలా వరకు అలభ్యములు అముద్రితాలు. రుక్మిణీ నాటకం, గోపికానాటకం, ద్విపద భాగవతంలోని చివరి ఆరుస్కంధాలు లభించలేదు. మిగతా కొన్ని అచ్చై, మరికొన్ని వ్రాతప్రతులుగా లభిస్తున్నవి. ఆమె రచించిన **కీర్తనలు ఆత్మబోధామృత తత్త్వములు, వేదాంతజ్ఞానబోధిని,**

సుజ్ఞానరత్నావళి - వంటి సంకలన గ్రంథాల్లో కలగాపులగంగా కానవస్తున్నాయి. తరిగొండ ముద్ర ఉన్న ఆమె రచనలను సులభంగానే గుర్తించవచ్చును.వెంకమ్మ ఏ గురువుల వద్ద సాహిత్యవిద్య నేర్వలేదు. ఇంట్లో స్వయంగా నేర్చుకున్నది. ఆమెకు సహజంగా కవితాకళ అబ్బింది. ఆమె రచించిన ప్రథమకృతి తరిగొండ నృసింహశతకం. అప్పటికామె 16 ఏండ్ల వితంతువు కాబోలు. ఐనా అందులోని యోగం, యోగవిద్యలో పండుబారిన ఆమె అనుభవం ఇది:

> *"కొలఁకుల మధ్యమందు నొకకోమలి యున్నది; దానిలోపలన్*
> *సలలిత వహ్నిమండలము, చంద్రదివాకరమండలంబులున్*
> *అలవడ నాఱు చక్రముల కావల నందొక సారసంబులోఁ*
> *గులుకుచునుండు హంస తరిగొండ నృసింహ దయాపయోనిధీ!"*

వెంకమ్మ రచించిన కృతు లెక్కువగా భక్తివేదాంత పరములు. ఆమె రచించిన యోగకృతులు రెండు; మొదటిది రాజయోగామృత సారం; రెండవది అష్టాంగయోగసారం. రాజయోగామృతసారం దాదాపు 900 ద్విపదల్లో ఉన్న మూడు ప్రకరణాల గ్రంథం. ఇందులో గురుపరంపర, సాంఖ్యయోగతత్త్వం, సప్తచక్రాలు, దశవాయువులు, ముఖ్యనాడుల వివరణ, స్వరయోగ ప్రతిపత్తి, కపటయోగుల నిరసన, గ్రంథుల వర్ణన, తారక లక్షణం, మండల త్రయం, శాంభవీ షణ్ముఖీ ముద్రలు, దృష్టులు, లక్ష్యత్రయ వివరణ, యోగవిద్యకు అనర్హులు, బ్రహ్మవేత్తల లక్షణం, యోగమహిమ, సిద్ధాసనలక్షణము లున్నవి. అష్టాంగయోగసారంలో మంత్ర, లయ, హఠ, సాంఖ్య, అమనస్క, రాజయోగాలు, ఉత్తమ రాజయోగి, సచ్ఛిష్యుల లక్షణాలు స్వానుభవపూర్వకంగా సులభశైలిలో చెప్పినది. బ్రహ్మానుభవం పొందటంతోపాటు ఇన్ని కృతులు రచించి ఆంధ్రయోగినుల్లో ప్రథమగణ్యురాలైన తరిగొండ **వెంకమ్మ ప్రాతఃస్మరణీయ.**

మేము 7-12-1996నాడు తిరుమలపై వెంకమ్మగారి సమాధి దర్శించబోయినాము. సమాధి తోట ఇంగ్లీషు మీడియం స్కూలుగా మారింది. వెంకమ్మగారి బృందానవం మాత్రం భద్రంగా ఉన్నది. ఆంజనేయ విగ్రహం పూర్వస్థలంనుండి మార్చి, ఆమె బృందావనం పాదులో చేర్చినారు. అచటి స్కూలులో పనిచేసే ఉపాధ్యాయవర్గం శుక్రవారం నాడు భక్తిప్రపత్తులతో బృందావనాన్ని అర్చిస్తూవుంటారట!

## శ్రీవెంకన్న భక్త కవయిత్రి తరిగొండ వారి హారతి

**-శ్రీమేరుగు రాధాకృష్ణమూర్తి**

తిరుమల పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి. ఏకాంతసేవా సమయంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారి వంశీయుల లాలిపాటతో పాటుగా తరిగొండవారి ముత్యాలహారతి కూడా ఇవ్వడం నేటికీ నిత్యకృత్యం. ఏడుకొండలవాడిపై తనకు గల అనన్యమైన భక్తి, నాడుసమాజంలోని సాంఘిక దురాచారాలపట్ల తన నిరసన, స్త్రీజాతిపై జరుగుతున్న మూఢాచారాల దాడిపట్ల తన ఆవేదన, ఘర్షణ, తపనలతో కూడిన వైవిధ్యభరితమైన చైతన్యవంతమైన ఆమె సంపూర్ణ మూర్తిమత్త్వానికి సాక్షాత్కారం ఆమె సాహిత్యమే. శ్రీ వేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణసంస్థ (శ్వేత) నేతృత్వంలో, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుమల-తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన సాహిత్య సదస్సు విశేషాల సమాహారమే ఈ వ్యాసం.

తిరుమల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవ సమయంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారి వంశీయుల లాలిపాటతో పాటుగా తరిగొండవారి ముత్యాల హారతి కూడా ఇవ్వడం నేటికీ నిత్యకృత్యం. ఈ విశిష్టసేవ నుండి వచ్చిన నానుడే " తాళ్ళపాకవారి లాలి-తరిగొండవారి హారతి". ముత్యాల హారతి ఇవ్వనిదే స్వామివారి ఆనందనిలయం వాకిళ్ళు మూయబడవు. ఆ కర్పూరనీరాజనం అందుకోనిదే ఆ భోగశ్రీనివాసమూర్తి యోగనిద్రకు ఉపక్రమించరు - పవ్వళింపుసేవ పూర్తికాదు. అంతటి ఘనమైన ప్రాశస్త్యం కల్గిన ఆ మంగళ హారతి నేపథ్యం ఎంతగా కీర్తించదగినదో కదా!... అంతటి **విశిష్టతను సంతరించుకొన్న ఆ కర్పూరనీరాజనం క్షేత్ర సత్యం**

ఎంతటి దివ్యమైనదో కదా!.... ఆ మహిమాన్వితమైన గతం ఎల్లరు ఎరుగవలసినదే కాదు - ఎంతగానో స్ఫూర్తిని పొందవలసినది కూడా!

మూఢాచారాలకు వట్టంకడుత్తున్న తొలినాళ్ళలోనే తిరుగుబాటు బావుటా చేతబూని, స్త్రీజాతిపై జరుగుతున్న దౌష్ట్యంపై, లింగవివక్షతపై విప్లవశంఖం పూరించిన ఓ సామాన్య మహిళ - నేటి తరానికే కాదు, రానున్న తరాలకు కూడా తన జీవితమే ఒక సందేశంగా అందించిన ఓ విదుషీమణి - అక్షర శారదా సాక్షాత్కారంతో భక్త కవయిత్రిగా వినుతికెక్కిన ఓ భక్తశిరోమణి... అలమేలుమంగ పతికి అత్యంత ప్రీతిపాత్రురాలై, ఆ బ్రహ్మాండనాయకుడి అనుగ్రహాన్ని పొంది, నేడు వ్యావహారికంగా 'తరిగణమ్మ'గా పిలువబడుతూ, పూజలందుకుంటూన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ దివ్యమయ జీవితగాథే నేటికీ శ్రీనివాసుడు అందుకుంటున్న ఈ మంగళ కర్పూర నీరాజనానికి క్షేత్రమూలం.

ఏడుకొండలవాడిపై తనకు గల అనన్యమైన భక్తి, నాడు - సమాజంలోని సాంఘిక దురాచారాలపట్ల తన నిరసన, స్త్రీజాతిపై జరుగుతున్న మూఢాచారాల దాడిపట్ల తన ఆవేదన ఘర్షణ, తపనలతో కూడిన వైవిధ్యభరితమైన, చైతన్యవంతమైన ఆమె సంపూర్ణ మూర్తిమత్త్వానికి సాక్షాత్కారం ఆమె సాహిత్యమే. తెరమరుగైన ఆ యోగిని సాహిత్యసంపదలకు వెలుగుచూపి, నేటి తరంలో స్ఫూర్తిని నింపాలన్న ఆలోచనల్లోంచి ఆవిర్భవించిన పవిత్ర ప్రయత్నమే తిరుమల - తిరుపతి దేవస్థానం వారు స్థాపించిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు. ఈ మహాప్రస్థానంలో వేసిన ముందడుగే ఆమె సాహిత్యంపై సదస్సుల నిర్వహణ. ఈ ప్రయాణంలోని ఒక ప్రధాన ఘట్టమే విజయవాడ నగరంలో 2008 ఏప్రిల్ 12,13 తేదీలలో నిర్వహించిన సాహిత్య సదస్సు.

శ్రీ వేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణసంస్థ (శ్వేత) నేతృత్వంలో, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, తిరుమల - తిరుపతి దేవస్థానంవారు నిర్వహించిన ఈ సాహిత్య సదస్సుకు విజయవాడ -సిద్ధార్థ కళాపీఠం వేదిక అయ్యింది. ఈ రెండురోజుల సదస్సులో పలువురు ప్రముఖులు వెంగమాంబ జీవితం గురించి, రచనా విశేషాల గురించి ఆమె సాహిత్యంలోని సామాజిక స్పృహ గురించి, తిరుమలతో ఆమెకున్న ఆధ్యాత్మిక అనుబంధం గురించి ప్రసంగించారు.

మొదటిరోజు సదస్సులో, వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు మరియు 'శ్వేత' సంచాలకులు 'భూమన్' స్వాగతోపన్యాసమిస్తూ వెంగమాంబ సాహిత్యానికి విస్తృత ప్రచారంచేసి, తద్వారా ఆమె ఆశయాలను, ఆదర్శాలను, భక్తి ప్రపత్తులను చైతన్యదీపికలుగా ఈ సమాజానికి అందించాలన్న తమ కృతనిశ్చయాన్ని తెలియజేశారు. ఆ సిద్ధయోగిని సిద్ధాంతాలు తెలుగువారందరూ తెలుసుకోవలసి ఉందని అంటూ, ఆమె సాహిత్య సదస్సులను ఆంధ్రరాష్ట్రమంతటా నిర్వహించి ఆ భక్త కవయిత్రి ఆత్మ సాక్షాత్కారాన్ని తెలుగు ప్రజలకు చేరువ చేయాలన్న తమ సంకల్పానికి ప్రజలు విరివిగా పాల్గొని ప్రోత్సహించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. తిరుమల-తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యురాలు శ్రీమతి చదలవాడ సుధ మాట్లాడుతూ వెంగమాంబ సాహిత్యంలో అందరూ ఆస్వాదించదగిన అనుభవసారం ఉన్నదని, ఆనాటి సామాజిక స్థితిగతులకు ఆమె రచనలు అద్దం పట్టాయనీ అన్నారు. ప్రముఖ పాత్రికేయులు శ్రీ సి. రాఘవాచారి తెలుగు సంస్కృతికి పెట్టని రాజధానిగా తిరుమలను అభివర్ణించారు. సాహిత్య సదస్సులద్వారా వెంగమాంబ రచనలకు విస్తృతప్రచారం తీసుకురావాలని తి.తి.దే. వారు కార్యాచరణ చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, ఆమె

జీవితం గురించి, సాహిత్యం గురించి జరుగవలసిన పరిశోధన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

డా॥ వి.బి. సాయికృష్ణ యాచేంద్ర ప్రసంగిస్తూ వెంగమాంబ రచనల్లోని గానయోగ్యమైన గీతాలను సేకరించి స్వరబద్ధం చేసే ప్రయత్నం జరుగుతున్నదనీ, ఆ ప్రయత్నంలో భాగంగా 'స్వరలహరి', 'గీతసుధ', 'జీవనగానం' మొదలగు సి.డి.లు రూపొందించబడినవనీ తెలియజేశారు.

అనంతరం, మొదటిరోజు జరిగిన ప్రారంభ సమావేశానికి ముగింపుగా, తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల సంగీత విభాగం ఆచార్యులు శ్రీమతి వై.వి.యస్. పద్మావతి గీతాలాపన ఆహూతులను అలరించగా, తిరుపతి - అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీమతి సావిత్రి జయంతి వెంగమాంబ జీవితకథపై చెప్పిన హరికథ సభికుల్ని ఆకట్టుకుంది. ఈ ప్రారంభ సమావేశంలో ప్రముఖ పాత్రికేయులు డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు, ప్రముఖ రంగస్థల నటులు శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్య, వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు గ్రంథ పరిష్కర్త ఆచార్య కె.జె. కృష్ణమూర్తి, సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షులు శ్రీ పి.యల్.ఎన్. ప్రసాద్ కూడా పాల్గొన్నారు. సమన్వయకర్తగా శ్రీ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య వ్యవహరించారు.

రెండవరోజు సదస్సులో ప్రముఖ వక్తలు వెంగమాంబ సాహిత్యం గురించి, ఆమె జీవన గమనం గురించి వివరణాత్మక ప్రసంగాలు చేశారు. 'వెంగమాంబ సాహిత్యంలో సామాజిక స్పృహ అన్న అంశంపై సికింద్రాబాద్ రైల్వే డిగ్రీ కళాశాల తెలుగు రీడర్ డాక్టర్ అనంతలక్ష్మి ప్రసంగించారు. 'ఏ కవి రచనలోనైనా ఆ యా కాలాల సామాజిక అంశాలు ప్రతిబింబిస్తుంటాయి; అందుకు చక్కటి ఉదాహరణ వెంగమాంబ రచించిన నృసింహాశతకమే' అని

అంటూ, వెంగమాంబకు తండ్రి కానాల కృష్ణయామాత్యుల నుండే సదాలోచన సంక్రమించినదనీ, ఆడపిల్ల జన్మిస్తే, 'అయ్యో! ఆడపిల్లా!' అనే నిరసన భావం వ్యక్తమయ్యే రోజుల్లోనే అయిదుగురు మగసంతానం అనంతరం, కన్యాదానం కొరకై కనీసం ఒక్క పుత్రికనైనా ప్రసాదించమని శ్రీ వేంకటేశ్వరుని కృష్ణయామాత్యులు వేడుకున్నారనీ, అలా సంక్రమించిన సద్భావనే ఆమె రచనల్లో ప్రముఖంగా ప్రస్ఫుటించిందన్నారు. వెంగమాంబ తాను గ్రహించిన సామాజిక సత్యాన్ని నిర్భయంగా తనరచనల్లో కనబరచింది. మూఢాచారాలు బలంగా వేళ్ళూనుకున్న అరోజుల్లోనే వైధవ్యచిహ్నాలను వ్యతిరేకించిన మొట్టమొదటి స్త్రీమూర్తి వెంగమాంబ - అని పేర్కొంటూ, "జుట్టు తీసినంత మాత్రాన పాతివ్రత్యం నిలబడుతుందా!" అని పీఠాధిపతినే ప్రశ్నించిన ధైర్యశాలి ఆమె - అని పేర్కొన్నారు.

ప్రవాహశీలత కలిగిన ఆమె సాహిత్యంలోని సామాజిక స్పృహ అభినందనీయమేకాదు, ఆదర్శనీయం కూడా. ఆమె రచనల్లో అభేదభావం స్పష్టంగా గోచరించేది. అందుకు నిదర్శనం ఆమె రచించిన గణనాయకా! శరణు! అనేగేయ రచనే. ఆమె శిష్యుల్లో మురాషావలి అనే మహమ్మదీయుడు కూడా ఉండటం ద్వారా ఆమెకు సమదృష్టి, మతసామరస్యంకూడా అలవడ్డాయని అక్షరసత్యంగా పేర్కొనవచ్చు - అని అంటూ తేట తేనియ లాంటి వెంగమాంబ రచనలు ఆనాటి కులవివక్షతలను, సామాజిక సమస్యలను స్పష్టంగా తేటతెల్లం చేశాయన్నారు. సామాజిక స్పృహ అద్దిన ఆమె సాహిత్యం ఈ తరానికే కాదు, ముందు తరాలకు కూడా ఆదర్శప్రాయమని డాక్టర్ అనంతలక్ష్మి అభిప్రాయపడ్డారు.

అనంతరం, 'వెంగమాంబ మూర్తిమత్త్వం' గురించి తిరుపతి - శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు

విభాగం అధ్యాపకురాలు ఆచార్య పి. కుసుమ కుమారి ప్రసంగించారు. ఏ వ్యక్తి మూర్తిమత్త్వం అయినా ఆ వ్యక్తి జీవనశైలిని బట్టి, ఆ వ్యక్తి రచనల పోకడలనుబట్టి చెప్పవచ్చు - అని అంటూ, బాల్యప్రాయం నుండి వెంగమాంబ జీవితాన్ని గమనించినా, ఆమె సాహిత్యాన్ని పరిశీలించినా ఆమె మూర్తిమత్త్వం ఇట్టే అర్థం కాగలదన్నారు. వెంగమాంబ ఇతర చిన్నపిల్లలకుమల్లే ఆటపాటలలో ఆసక్తి కనబరచేది కాదు. భజనలతో, ధ్యానంతో కాలక్షేపం చేసేది. పిన్నవయస్సులోనే ఆమెలో భక్తిబీజం నాటుకుంది. బాల్యవితంతువు దశలో ఆ భక్తే ఆమెకు విముక్తి అయ్యింది. తాను "నృసింహ జయంతి" ఉత్సవం నిర్వహించుట ద్వారా వ్యవహార దక్షత కల్గిన వ్యక్తిగా నిరూపించుకుంది. తిరుమల నుంచి వేరుచేసి చూడలేని ఆమె జీవనప్రయాణంలో నిరంతర ఘర్షణ, వేదన, చైతన్యం, సంస్కర్త లక్షణాలు స్పష్టంగా గోచరిస్తాయనీ, తాను నమ్మిన సిద్ధాంతాల పట్ల దీక్ష దక్షత కల్గిన వ్యక్తిగా వెంగమాంబను పేర్కొనవచ్చని అంటూ, భర్త వియోగానంతరం కూడా భర్త ఇంటిపేరుతోనే కొనసాగి, భర్తపట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్న స్త్రీమూర్తి వెంగమాంబ - అని అన్నారు.

నృసింహస్వామి దేవాలయంనుండి అనైతికంగా తనను బయటకి గెంటినా, ఎవ్వరిపట్ల కూడా మచ్చుకి ఒక్క పరుషమైన పదంకూడా మాట్లాడని మహోన్నత వ్యక్తిత్వంగల మహామనిషి వెంగమాంబ. ఆమె రాసిన 'శ్రీకృష్ణమంజరీ' శతకాన్ని పరికించిన చాలు, భక్తుడికి భగవంతునికి మధ్యగల భక్తిబంధం ఎంతటి ఉన్నతమైనదో, భగవంతుడి పట్ల ఆమెకున్న భక్తిభావం ఎంతగా గౌరవించదగినదో అక్షరసత్యంగా స్పష్టమవుతుందని ఆచార్య కుసుమకుమారి వివరించారు. మరింత లోతుగా వెంగమాంబ మూర్తిమత్త్వాన్ని విపులీకరిస్తూ, వెంగమాంబ తన రచనల్లో స్త్రీ

వ్యక్తిత్వాన్ని గౌరవించెడిదనీ, స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని గుర్తించి ప్రతిఘటించే ప్రయత్నం కూడా చేసిందన్నారు. 'ముక్తి' అంటే సంకల్పాన్ని త్యజించుటే - అని అభిప్రాయపడిన వెంగమాంబ మూర్తిమత్త్వం అత్యంత అభినందనీయ మన్నారు.

తదుపరి, 'తరిగొండ వెంగమాంబ గీతసుధ' అన్న అంశంపై డాక్టర్ వి.బి. సాయికృష్ణ యాచేంద్ర ప్రసంగించారు. ఆమె గీతాల్లో త్యాగరాజ కీర్తనల్లోని ఛాయలు కూడా తొంగిచూచెడివని సోదాహరణంగా చెప్తూ, అలౌకిక భావనను, తాత్త్విక చింతనను రంగరిస్తూ గానయోగ్యంగా ఎన్నో గీతాలు ఆమె మనఃఫలకం నుండి జాలువారాయనీ, వాటిల్లో యుగళ గీతాలు, శృంగార గీతాలు, తత్త్వ గీతాలు, జానపదాలు, గురుస్తుతి గీతాలు కూడా కలవని తెలియజేశారు. స్వర సౌలభ్యానికి అనువుగా, సంగీతబద్ధంగా కూడా రచించడం ఆమె ప్రత్యేకత - అని అంటూ, శ్రీ వేంకటేశ్వరుడిపై, నృసింహస్వామిపై ఆమెకున్న అపరిమితమైన భక్తినే కాకుండా, ఆనాటి సామాజిక వాతావరణాన్ని కూడా తను రాసిన పద్యాల్లో, కీర్తనల్లో వెంగమాంబ ప్రతిబింబింపజేసిందన్నారు.

తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు గ్రంథ పరిష్కర్త ఆచార్య కె.జె. కృష్ణమూర్తి ప్రసంగిస్తూ 'అక్షర శారదా సాక్షాత్కారం' పొందిన ఏకైక కవయిత్రిగా వెంగమాంబను కొనియాడారు. పంద్రెండు ఏళ్ళు యోగాభ్యాసం చేసి సంపూర్ణ సిద్ధిపొందిన ఆమెవద్ద "అష్టఘంటములు" అన్న పేరుతో ఎనిమిదిమంది నిత్యం ప్రతులు వ్రాస్తుండెడివారనీ, తిరుమలను దర్శించిన భక్తులు వివిధ ప్రాంతాల సంస్థానాధీశులు, కూచిపూడి భాగవతులు పనిగట్టుకొని వెంగమాంబ రచనాప్రతులను ఎంచుకుని తీసుకెళ్ళెడివారని అంటూ, ఆమె రాసిన "వేంకటాచల మాహాత్మ్యం" పద్యకావ్యం ప్రతి ఇంట్లో ఒక పవిత్ర గంథ్రంలా భాసిల్లిందన్నారు.

అనంతరం "తరిగొండ వెంగమాంబ జీవితం - సందేశం" అన్న అంశంపై విజయవాడ - మాంటిస్సోరి డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు శ్రీమతి సి.హెచ్. విజయలక్ష్మి ప్రసంగించారు. చిత్తూరు జిల్లా - వాయల్పాడు సమీపాన గల నృసింహక్షేత్రమైన తరిగొండ గ్రామమే వెంగమాంబ జన్మస్థలం. క్రీ.శ. 1730 ప్రాంతంలో కానాల మంగమాంబ, కానాల కృష్ణయామాత్యులకు శ్రీవేంకటేశ్వర వరప్రసాదంగా కల్గిన సంతానమే వెంగమాంబ. బాల్యం నుండే భక్తి అలవడింది. వెంగమ్మగా పేరుపెట్టబడి కాలక్రమేణ యోగిని అయి 'వెంగమాంబ' గా పిలువబడింది. చిత్తూరుకు సమీపంలోని నారగుంటపాళ్యెంకు చెందిన ఇంజేటి వేంకటాచలపతితో బాల్యవివాహం జరిగింది. యుక్తవయస్సు రాకమునుపే భర్తను కోల్పోయి బాల్య వితంతువైంది. శ్రీ వేంకటేశ్వరుడే తనభర్త - అంటూ ముత్తైదువ చిహ్నాలు తీయుటకు వ్యతిరేకించిందని, పిమ్మట మదనపల్లి వాస్తవ్యుడైన రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రి గారి వద్ద యోగాభ్యాసం చేసిన వెంగమాంబ దాదాపు పద్దెనిమిది పుస్తకాలు రచించిందని వివరిస్తూ, వాటిలో యక్షగానాలు, సంకీర్తనలు, స్తోత్రాలు, శతకాలు, పద్యాలు, ద్విపదలు, నాటకాలు కూడా కలవని అన్నారు. దైవాంశ సంభూతురాలుగా ఆమెను గుర్తించినా, సహించలేని సమాజం ఆమెను వెలివేసినా, తిరుమలకు వచ్చి శ్రీ వేంకటేశ్వరుడి సేవలో తరించి జన్మధన్యం చేసుకున్న వెంగమాంబ జీవితం ఏ కోణంలో చూసినా సందేశాత్మకమే - అని విజయలక్ష్మి తమ అభిప్రాయాన్ని వివరించారు.

'వెంగమాంబ సాహిత్యం - భక్తి' అన్న అంశంపై విజయవాడ - అప్పలస్వామి కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి. శ్యామలానంద ప్రసాద్ ప్రసంగిస్తూ ఆమె సాహిత్యంలో భక్తి

పరిపక్వత, పరిణతి కన్పిస్తుందన్నారు. నూటనలభైనాలుగు ద్విపదలతో కూర్చిన వెంగమాంబ "కృష్ణమంజరి" లో ఆమె స్వభక్తి సుస్పష్టం - అని అంటూ, సగుణస్థితి నుండి నిర్గుణ స్థితి దిశగా సాగిన ఆమె భక్తి ప్రయాణం అద్భుతమంటూ ప్రశంసించారు.

అనంతరం వెంగమాంబ రచనల్లో అగ్రతాంబూలం అందుకున్న "వేంకటాచల మహాత్మ్యం"పై డాక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి వివరణాత్మక ప్రసంగం చేశారు. పద్దెనిమిది పురాణాల్లోని ప్రాధాన్యతను, అష్టాంగ యోగసారాన్ని అక్షరీకరిస్తూ సాగిన ఈ కావ్యం దివ్యానుభూతి కల్గజేసే కరదీపిక - అని ప్రస్తుతించారు. తిరుమల క్షేత్ర వైభవాన్ని సాక్షాత్కరింపజేసిన ఈ రచనలో ఆలయవిశేషాలతో పాటుగా, స్వామివారి ఉత్సవ విశేషాలను కూడా క్రోడీకరించారన్నారు.

స్ఫూర్తిదాయకంగా, చైతన్యవంతంగా నిర్వహించబడిన ఈ సాహిత్యసదస్సుకు శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు వందన సమర్పణ గావించారు.

ఎందరెందరికో ఎఱుకలేని వెంగమాంబను గురించిన విశేషాలు ఆమె సాహిత్యపుటల్లో నిక్షిప్తమై ఉన్నాయనే సత్యాన్ని ఈ సాహిత్యసదస్సు ఎరుక పరిచిందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అంతటి దివ్యచరిత్రను సొంతం చేసుకున్నది కాబట్టే, వెంగమాంబ శ్రీనివాసుడి అనుగ్రహానికి పాత్రురాలైంది - నిత్యం స్వామివారి ఏకాంత సేవలో ఆమె పేరిట సమర్పించెడి మంగళ కర్పూర హారతికి యోగ్యురాలైంది. శ్రీస్వామివారి విశిష్ట సేవలో స్థానం సంతరించుకున్న ఈ కర్పూర హారతిని గురించిన ఓ విశేషం కూడా చరిత్రలో స్పష్టపరచబడింది. ఓ రథోత్సవం నాడు దక్షిణ, పశ్చిమ, మాడ వీధుల్లో అలవోకగా పరుగులు తీసిన స్వామివారి

రథం ఉత్తరమాడ వీథిలో ఉన్నపళంగా ఆగిపోయిందట! - వెంగమాంబ కర్పూరనీరాజనం అందుకున్న పిమ్మట మాత్రమే కదిలిందట! మరొకనాటి సాయంత్రం యథాప్రకారం వెంగమాంబ స్వామివారికి కర్పూర నీరాజనం సమర్పిస్తున్న సమయంలో ఆ స్వామి మూల విరాట్‌మూర్తిలో దశావతార దర్శనమూ, బ్రహ్మాండ భాండములతో కూడిన శ్రీవారి విరాట్ తేజస్స్వరూప దర్శనభాగ్యం ఆమెకు కలిగాయట! నాడు మొదలుకొని ప్రతిరోజూ చిట్టచివరిదిగా వెంగమాంబ కర్పూరహారతి ఇవ్వనిదే ఆలయం తలుపులు మూయరాదనీ, ఆ కర్పూరహారతి పిదప మరే హారతి ఇవ్వరాదనీ అర్చకస్వాములచే, అధికార గణంచే ఆదేశాలు జారీకాబడినవట! అలా అంకురార్పణ జరిగిన తరిగొండవారి హారతి నేటికీ కొనసాగుతూ ఉండటం విశేషమేగా మరి! క్రీ.శ. 1817లో సమాధి నిష్ఠురాలై సిద్ధిపొందిన వెంగమాంబ బృందావనం నేటికీ తిరుమల క్షేత్రంలో పూజలందుకుంటూ భక్తులను దర్శనీయ పుణ్యస్థలంగా విలసిల్లుతోంది. పుణ్యచరితురాలు వెంగమాంబ జన్మ ధన్యం - తరిగొండ వారి హారతి దర్శించినవారి జన్మ ధన్యం.

# * తరిగొండ వెంగమాంబ

**-శ్రీ శ్యామప్రియ**

ఇంచుమించు ఇరవై సంవత్సరాల వయస్సుగల ఒక భక్తురాలి భర్త కాలధర్మం చెందాడు. ఆచార ప్రకారం ఆమె జుత్తు తీయించాలి. కాని, ఆమె అందుకు ఒప్పుకోలేదు. తల్లిదండ్రులు బ్రతిమాలారు. ఊరివారు భయపెట్టారు. ససేమిరా ఆమె తన నిర్ణయం మార్చుకోలేదు. ఇలావుండగా పుష్పగిరి పీఠాధిపతులు ఆ గ్రామానికి విచ్చేశారు. ఆమె తండ్రికి శ్రీముఖం పంపారు. తండ్రి కుమార్తెను తీసికొని వచ్చి స్వామి ఎదుట హాజరు పరిచారు.

బాల వితంతువుకు బలవంతంగా జుత్తు తీయించారు. మరుక్షణమే ఆమె ప్రక్కనే వున్న నృసింహస్వామి కోనేరులో మూడు మునకలు వేసింది. ఆమెకు యథాపూర్వకంగా వెండ్రుకలు వచ్చాయి.

అశేష జనం తమ తొందరపాటుకు తలలు వంచారు.

ఆ బాల వితంతువు ఎవరనుకొన్నారు? మహాభక్తురాలయిన తరిగొండ వెంగమాంబ. చిత్తూరు జిల్లా వాయల్పాడు గ్రామానికి నాలుగైదు మైళ్ల దూరంలో వున్న తరిగొండ వెంకమ్మ గారి జన్మస్థలం. 1730 ప్రాంతంలో కానాల కృష్ణయ్య మంగమాంబ దంపతులకు వెంగమాంబ జన్మించింది. ఆ గ్రామంలో వేంచేసి యున్న నృసింహ స్వామి వారి ఇలవేల్పు .

ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు ఇంజేటి వేంకటాచలపతితో ఆమె వివాహం జరిపించారు. కాని, అనతికాలంలోనే అతడు కాలధర్మం చెందాడు.

బాల్యంనుండి స్వగ్రామంలో నరసింహస్వామిని సేవిస్తూ వచ్చిన వెంగమాంబ కొంతకాలానికి తరిగొండ వదలి తిరుమల

---

*ఈ వ్యాసంశ్రీ శ్రీ శ్యామప్రియ వారి రచించిన "దక్షిణాది భక్తపారిజాతాలు"- అనే గ్రంథంనుండి ధన్యవాదములతో స్వీకరింపబడింది.

చేరింది. అక్కడ మొదట గోగర్భ తీర్థంలో తపోదీక్షకు పూనుకొన్నది. జనసంచారం అధికం కావడంతో అక్కడి నుండి పదిమైళ్ల దూరంలో ఉన్న తుంబురు తీర్థం చేరి అక్కడ గుహలో తపస్సు కొనసాగించింది.

బిలమార్గం గుండా సూక్ష్మశరీరంతో వేంకటేశ్వరుని గర్భగుడి చేరి, రాత్రి వేళల కైంకర్యం చేసేదని భక్తులు భావించేవారు.

జానకీదాసు అను పూజారి ఒకనాటి రాత్రి రహస్యంగా గర్భాలయంలో దాగి, ఆమె రాత్రి వేళల స్వామి కైంకర్యం చేస్తున్న మాట సత్యమే నని రూఢి చేసి కొన్నాడు. అప్పటి నుండి ప్రజలు ఆమెను మహాయోగినిగా గుర్తించారు.

శ్రీనివాసుని నృసింహమూర్తిగా సంభావించిన వెంగమాంబ నృసింహ జయంతి నాడు తిరుమలలో విశేషంగా అన్నదానం జరిపించేది.

1817లో ఆమె తనువు చాలించే వరకు పూలు కోసి, మాలలు కట్టి శ్రీవారికి సమర్పించేది. అందుకొరకు ఆమె మూడు తోటలను నెలకొల్పింది. ఒక తోటలో బావి కూడా త్రవ్వించింది.

ఆమె అర్చిస్తూ వచ్చిన చిన్న ఆంజనేయ విగ్రహాన్ని ఆమె సమాధి చెంత ప్రతిష్ఠించారు. అలాగే తరిగొండలోని నరసింహస్వామి ఆలయ ప్రాంగణములో వెంగమాంబ మందిరం కూడా నిర్మితమైంది.

తిరుమలలో తాళ్ళపాక వారి యింటి ప్రక్కనే వెంగమాంబ ఒక ఇల్లు సంపాదించింది. వయోభారం చేత ఏనాడైనా ఆమె స్వామిని దర్శించ లేకపోతే, స్వామి స్వయంగా విచ్చేసి ఆమె గృహాన్ని పావనం చేసేవారు. వెంగమాంబ నివేదించిన వంటకాలను స్వామి ప్రీతిగా స్వీకరించేవారని ప్రతీతి.

వెంగమాంబ స్వామికి జరిపిన ముత్యాల హారతి ఈ నాటికీ ఏకాంత సేవలో భాగంగా ఆమె పేరిటనే నిర్వహించబడడం విశేషం.

శ్రీనివాసుని అంతరంగిక భక్తురాలైన తరిగొండ వెంగమాంబ మహాకవయిత్రిగా సాహిత్యంలోనూ విశిష్టస్థానం పొందింది.

ఈమె శ్రీవేంకటాచలమహత్యం, శ్రీభాగవతం, రమా పరిణయం, రాజయోగ సారం, విష్ణుపారిజాతం మున్నగు గ్రంథాలు రచించింది.

ఈమె కృతులన్నియు తరిగొండ నరసింహస్వామికి, తిరుపతి వేంకటేశ్వరులకు అభేదంగా అంకితమిచ్చింది. శృంగారం పేరిట అసభ్య వర్ణనలు చేయకపోవుట ఈమె ప్రత్యేకత. తాను గురుముఖంగా విద్య నేర్వలేదని తనరచనలను పండితులు, ప్రజలు చిన్న పిల్లల పల్కులవలె ఆదరించమని వేడుకొన్నది.

సంస్కృతాంధ్రములలో అనేక కావ్యాలుండగా మరలా తాను ఎందుకు వ్రాసినదీ తెలుపుతూ, భక్ష్యములు తిన్నవారు పచ్చడి నంజుకొన్న మాదిరి నేను వ్రాసిన కావ్యాన్ని ఆదరిస్తారనే పేరాసతో వ్రాశానని తెలిపింది.

వేదాంతగ్రంథమైన రాజయోగసారాన్ని చక్కని ద్విపదలో సుబోధకంగా వ్రాయటంలో వెంగమాంబ ప్రతిభ కన్పిస్తుంది. **దేవహూతి తన కుమారుడైన కపిలునే గురువుగా భావించి ఇలా అంటుంది:**

**"ఏ నొల్ల భాగ్యంబు, ఏ నొల్ల పదవి,**
**నేనొల్ల సంసార మేనొల్ల నెల్ల;**

నీ లీల దెలియకయే యిన్ని నాళ్లు
కాలంబు నూరకగడుపు చునుంటి ;
సకలలోకాతీత! సదమల తత్త్వ
మిఁకనైన నుపదేశ మీవయ్య! దేవ!"

వెంగమాంబ రచించిన "శ్రీకృష్ణమంజరి" స్త్రీలు పాడుకొనుటకు అనువైనదై అన్నిటికన్నా మిన్నగా బహుళ ప్రచారం పొందింది.

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం - వెంగమాంబ వైదుష్యం

**- డాక్టర్ పి. నాగమల్లీశ్వరరావు**

భక్త కవయిత్రులలో అగ్రగణ్య మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. భక్త కవయిత్రిగా, బహుగ్రంథ కర్త్రిగా, భాగవతోత్తమగా, భక్త కవి కులోత్తమగా, ధన్య జీవితగా, పుణ్యచరితగా రూపు దిద్దుకొన్న సజ్జన సన్నుతాంబ తరిగొండ వెంగమాంబ!

ఆమె రచించిన అష్టాదశ గ్రంథాలలో శ్రీవేంకటాచల మాహాత్మ్యం తలమానికం. అందులోని అవతారికా భాగం ప్రస్తుతాంశం.

ఆంధ్ర సాహిత్యంలో అవతరించిన కవులందరిలో అవతారికా భాగం అవశ్యాంశం. ఆదికవి మొదలు ఆధునికకవి వరకు అది సామాన్యాంశం. అందులో కవి ఆత్మీయత ఆవిష్కృతం అవుతుంది. కనుక పాఠకులకు అది ఆసక్తిదాయకం. అంతేకాక, కవి కాలం, దేశం, వంశాదికం, అతని ఇతర రచనలు, స్వీయ కవితా విశేషాలు, గ్రంథస్థ విశేషాలు, కవి ఆత్మీయతాంశాలు - ఇలా కవి అంతరంగం అంతా అందులో ఆవిష్కృతం అవుతుందనేది నిర్వివాదాంశం.

తృ (=తరించుట, దాటుట)+ఇక - తారిక - అవ+తారిక= అవతారిక - అని దీని నిష్పత్తి. "అవతారయతీతి అవతారికా" అని దీని వ్యుత్పత్తి. కాగా, కథలోనికి (దిగుటకు) ప్రవేశించుటకు ముందున్న స్తుత్యాదిక భాగం అవతారిక అనవచ్చు.

ఈ అవతారికా భాగం సంస్కృత వాఙ్మయంలో లేదని, ఆంధ్ర వాఙ్మయంలోనే ఆరంభమైందని పరిశోధకుల అభిప్రాయం. తమిళ కర్ణాటాది సోదర భాషల్లోను ఇది కనిపిస్తుంది. తెలుగులో

మాత్రం ఇది నియత లక్షణంగా ఉంది. ఈ సంప్రదాయాన్ని శాసన వాఙ్మయంనుంచి తెలుగు కవులు గ్రహించారని వేదం వారి వాదం.

తెలుగు వాఙ్మయంలో ఆది కావ్యంలో అంకిత భాగం మృగ్యం; ఐనా, అవతారికా భాగం మాత్రం సుస్పష్టం. ఆదికవి నన్నయతో ఆరంభమైన ఈ అవతారికా సంప్రదాయం ఆధునిక కవుల దాకా అలా కొనసాగుతూనే ఉంది.

ఆంధ్ర కవయిత్రులలో ఆమె ఆది కవయిత్రి కాకున్నా ప్రముఖ కవయిత్రి. తెలుగు సాహిత్యంలో మహాకవులకు దీటు రాగలిగిన మహాకవయిత్రి వెంగమాంబ ఒక్కరేనని పండిత ప్రశంస. ఆమె ప్రసిద్ధ భక్తాగ్రణి, పరమ యోగిని, ప్రముఖ కవయిత్రి. ప్రత్యేకించి భక్త కవయిత్రులలో ఆమె అగ్రగణ్య.

శ్రీ వేంకటేశ్వరుని చిత్తమందు నిలుపుకొన్న వెంగమాంబ అష్టాదశ గ్రంథకర్త్రి. ఆ అన్నింటిలో అనర్ఘరత్నం శ్రీ వేంకటాచల మాహాత్మ్యం. అది క్షేత్ర మాహాత్మ్య కావ్యాల్లో తలమానికం!

శ్రీ వేంకటాచల మాహాత్మ్యం అనే పద్యకావ్యాన్ని-

*"శ్రీకాంతాత్మ సరోజ చండకిరణం శీతాంశు బింబాననం,*
*శ్రీకంఠాబ్జజ సన్నుతాంఘ్రికమలం చిన్మాత్ర మప్రాకృతం।*
*లోకాతీత మనేక గోపయువతీలోలం పరం సర్వగం,*
*స్వాకారం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥"* (I-1)

అంటూ కృత్యాదిని శ్లోకంతో ప్రారంభించి, అనంతరం -

*"క్షీర సముద్ర మందు సువిశేష మతిన్ జనియించి, కూర్మితో*
*వారిజనాభు దివ్యతర వక్షమునందు వసించి, పూర్ణ శృం*
*గార విలాస లీలల సుఖస్థితి నొప్పుచు, భక్తకోటికిన్*
*గౌరవ మొప్పఁగా నెపుడు గల్మల నిచ్చు సిరిన్ భజించెదన్."* (I-2)

అని లక్ష్మీదేవి ప్రార్థనతో, ఉత్పలమాలతో పద్య రచన ప్రారంభించింది. తదనంతరం అనేక దేవతల్ని ఒకే పద్యంలో స్తుతించింది. ప్రత్యేకించి సరస్వతిని మాత్రం వరుసగా మూడు పద్యాల్లో స్తుతించింది. ఆమె అక్షర సరస్వతీ సాక్షాత్కారాన్ని పొందిందనడంలో ఇది కూడా ఒక నిదర్శనంగా భావించవచ్చు.

"శ్రీ వేంకటాచల మాహాత్మ్యకావ్యం వెంగమ సారస్వత తరు పరిపక్వ ఫల మనియు, తాళ్లపాక తిమ్మక్క వంటివారు కేవల దేశి రచనలను, మొల్ల వంటివారు మార్గ కృతులను వెలయించినట్లుగా, వెంగమ యుభయ మార్గాల్లో మనోజ్ఞ కృతుల్ని నెలకొల్పింద"ని వెంగమాంబ సాహిత్య పరిశోధకులు ఆచార్య కె.జె. కృష్ణమూర్తి గారి అభిప్రాయం. అది అక్షర సత్యం.

ఇక, ఇందులో గ్రంథాది అవతారికలో దేవతా స్తుతి అనంతరం ఆమె పూర్వకవి స్తుతిని ఇలా ఆచరించింది -

"ఆది కవీశ్వరుండైన వాల్మీకికి
వ్యాస మౌనికిఁ గాళిదాస కవికి
నరయంగ వరలబ్ధ మన్నమాచార్యున
కాంధ్రభాషా కవిత్వాఢ్యు లగుచు
మొనయు నన్నయకుఁ దిక్కన సోమయాజికిఁ
బోతరాజునకు, సునీతులైన
కవులకుఁ బండితాగ్రణులకుఁ బౌరాణి
కులకు భక్తిని మ్రొక్కి కొనుచు నేను
వేంకటాచల మాహాత్మ్య విభవములను
పద్య ఫణితిని రచియించి భక్తి మెఱయ
శ్రీనివాసుని పాదరాజీవములకు
బొసఁగ నర్పించెదన్ ముక్తిఁ బొందు కొఱకు." (I-18)

ఇందులో ముందుగా ఆది కవిని ప్రస్తుతించింది. ఆయనతో బాటు వ్యాస కాళిదాసుల్ని మొత్తం ముగ్గురు సంస్కృత కవుల్ని స్తుతించింది. తెలుగు కవుల్లో మున్ముందు అన్నమయ్యను స్మరించింది. తరువాత నన్నయ, తిక్కన, పోతనలకు మాత్రమే నమస్కరించింది. ఇలా సంస్కృత కవుల్ని ముగ్గుర్ని, తెలుగు కవుల్ని ముగ్గుర్ని మాత్రమే పూర్వ కవి స్తుతిలో ప్రస్తావించింది. సంస్కృతకవుల్లో రామాయణ భారత రఘువంశాది గ్రంథకర్తల్ని, తెలుగు కవుల్లోను అన్నమయ్య అనంతరం భారత భాగవత కర్తల్ని మాత్రమే ప్రస్తుతించడం - ఆమెలోని గాఢమైన భక్తిభావానికి నిదర్శనం. తెలుగు కవుల్లోను ఆది కవులకు ముందుగా, అనంతర కాలికుడైన అన్నమయ్యను స్మరించడం ఆమె భక్తిభావ జనిత విశేషం. అంతేకాక, భక్తకవుల్లోను శ్రీవేంకటేశ్వర భక్తాగ్రగణ్యుడైన అన్నమయ్యకు అగ్రస్థానం ఇవ్వడం, తాను రచించబోయే శ్రీవేంకటాచల మాహాత్మ్య కావ్యానికి భక్తిభావభరిత శోభ నందించడమే కదా! మొత్తమ్మీద వాల్మీకి నుంచి పోతన వరకు ఇంచుమించు భక్త కవుల్నే ఆమె స్మరించింది.

అలా పూర్వ కవి వందనం ఆచరించి, శ్రీనివాసుని పాదరాజీవాలకు భక్తితో తన కావ్యకుసుమాన్ని సమర్పిస్తా నంటుంది.

అదిన్నీ "ముక్తిఁ బొందుకొరకు" అని పద్యంలో కొసమెఱుపుగా స్పష్టంచేసింది. ఆమె అభిలాష, అకాంక్ష, ఆశయం, ఆదర్శం - అన్నీ ఒక్క మోక్ష ప్రాప్తి కోసం మాత్రమే. ముందు చేసిన దేవతా స్తుతిలోను "మోక్షాభిలాష" అనే పదాన్నే కొసమెఱుపుగా ప్రయోగించింది. ఇక్కడ కూడ మరల అదే మాట అన్నది. ఇంకా పలు సందర్భాల్లోను ఆమె అదే మాట చెప్పింది. ఆమె భక్తాగ్రగణ్యతకు అంతకంటె తార్కాణం మరేముంది?

ఇక్కడ మరో విశేషం కూడ విన్నవించాలి. అదేమంటే తెలుగు సాహిత్యంలో భక్త కవులు, కవయిత్రులు బహుళంగానే ఉన్నారు. హరి(హర) నామాంకిత కావ్యాలాపన చేసిన కవులు తిక్కన, పోతన. ధూర్జటి, బైచరాజు, సంకుసాల, అబ్బయామాత్యుడు, తిమ్మన, మొల్ల- ఇత్యాదు లెందరో ఉన్నారు. ఇందులో "ఇమ్మనుజేశ్వరాధముల కివ్వ" నని పోతన, "రాజకీటకముల కివ్వ" నని ధూర్జటి, "ఏమిటి కీ నరాధముల కిత్తురొ యుత్తమ కావ్యముల్?" అని కనుపర్తి ఈసడించు కొన్నారు. అయితే, మొల్లమాత్రం "సల్లలిత ప్రతాప గుణసాగరుఁడై విలసిల్లి, ధాత్రిపై బల్లిదుఁడైన రాము నరపాలకునిన్ స్తుతి సేయు జిహ్వకున్, చిల్లర రాజలోకమును జేకొని మెచ్చగ నిచ్చ పుట్టునే? - " అంటూ కొంత మెత్త మెత్తగా చిత్తగించింది. మొత్తమ్మీద ఇతర భక్తకవుల్లో, కవయిత్రుల్లో నర స్తుతి వైముఖ్యం, హరి స్తుతి సౌముఖ్యం - రెండూ ప్రాముఖ్యం వహించాయి. కాని వెంగమాంబ ఎవరినీ అలా నిందించకపోవడం ఆమె వినయాన్ని, సంయమనాన్ని విశదం చేస్తాయి. అందుకే కేవలం దైవస్తుతి మహిమ మాత్రమే ప్రస్తావించింది.

అటు తరువాత తన వినయ సంపదను ఇంకా విపులం చేసింది ఇలా -

*"పండితాగ్రణులార! ప్రజలార! యిపుడు నా*
*బాలభాష లసహ్య పడక వినుఁడి!*
*తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కు లా*
*హ్లాదంబుగా విందు; రా విధమున*
*మీరు నా తప్పొప్పు లేరీతిగా నైన*
*గేలి చేయక చిత్తగింపవలయు;*
*నాంధ్ర గీర్వాణ మహాకృతు లుండఁగా*
*నిప్పుడీ కృతి విననేల? యనక,*

*భక్ష్యములు మెక్కి యావలఁ బచ్చడియును*
*నంజుకొనిన విధంబుగా నా ప్రబంధ*
*మాలకింతురు గా కను నాశ చేత*
*నేనుఁ జెప్పెద మీరు మన్నించి వినుఁడు!"* (I-19)

ఆమె జీవితం పరిశీలిస్తే, అడుగడుగునా ఆమెకు అవమానాలే కనిపిస్తాయి. పండితులే కాదు; పామరులూ ఆమెను అవమానించిన సందర్భాలు బహుళం. అందుకే పద్యం ఎత్తుగడలోనే "పండితులార!, ప్రజలార!" అంటూ - నేను చెప్పేది బాలభాష. దాన్ని అసహ్యించుకోకుండా వినండి! - అంటూ వినయ పూర్వకంగా అర్థిస్తుంది. -మీ రంతా నాకు తల్లిదండ్రులవంటి వారు; నేను బాలను. పిల్లలు చెప్పే వచ్చీ రాని మాటల్ని పెద్దలు ప్రేమతో వింటారే, అలా నా మాటల్ని వినండి! నా తప్పొప్పులు పరిశీలించి నన్ను గేలి చేయకండి! - అంటూ వినయంగా బ్రతిమాలుతోంది. అంతేకాక, మరో మాట కూడ అంటోంది. -ఆంధ్రగీర్వాణభాషల్లో మహా మహులు రచించిన మహాకృతు లెన్నో ఉండగా ఈ బాల చెప్పేది, వినేది ఏమిటి? అని తిరస్కరించకండి! - అని ప్రార్థిస్తూ, దానికి ఉపమానంగా పంచభక్ష్యాలు మెక్కినా, అనంతరం పచ్చడి నంజు కొన్నట్లుగా నా మాటల్ని వినండి! - అంటోంది. దాదాపు భక్ష్యాలన్నీ పక్వాహారాలు. ఒక విధంగా పచ్చడి అపక్వాహారం. అయినా ప్రకృతి వైద్యుల దృష్టిలో అదే హితకరం కదా! ఈ సీస పద్యంలో - విను, చిత్తగించు, ఆలకించు - అనే క్రియా బాహుళ్యం ఆమె విన్నపంలోని పారమ్యాన్ని పాఠకులకు పట్టియిస్తుంది.

ఇలాగే, మొల్ల కూడ శ్రీరాముని చరిత్రం విన్నవిస్తున్నాను, "తప్పు లెంచకుఁడు కవుల్" అన్నది కదా!

తదనంతరం వెంగమ -

"నా రీతిం దగ విన్నవించెదఁ గృపన్ నా తండ్రులారా! వినుం
డా రాజీవ దళాక్షు సత్కరుణ నా యందుండు, నైనన్ మదిన్
సారార్థంబుల నేర్పరించికొని భాస్వద్భక్తి యోగక్రమ
శ్రీ రమ్యంబుగ నాంధ్రరీతినిఁ బ్రకాశింపన్ గృతిం జెప్పెదన్."
(I-20)

అంటూ, - నా తండ్రులారా! దయతో వినండి! ఆ శ్రీనివాసుని కరుణ నా పై ఉంది; దానితో బాటు సారవంతం, అర్థవంతం అయిన విషయాలు గ్రహించి, భక్తియోగక్రమం ప్రకాశించే విధంగా విన్నవిస్తాను - అంటోంది. ఇందులో ఆమె నిశ్చల భక్తిభావం, వినయ శీలం వ్యక్తమౌతూవున్నాయి.

ఇక, తరువాతి పద్యంలో ఆమె వినయం ద్యోతకమౌతున్నది.

"నా చిన్ననాఁట నోనామాల నైన నా
చార్యుల చెంత నేఁ జదువలేదు
పరఁగ ఛందస్సులోఁ బది పద్యములనైన
నిక్కంబుగా నేను నేర్వలేదు
లలిఁ గావ్య నాటకాలంకార శాస్త్రముల్
వీనుల నైన నే వినఁగలేదు
పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్
శోధించి వరుసగాఁ జూడలేదు
చేరి తరిగొండపుర నారసింహదేవుఁ
డానతిచ్చిన రీతిగా నే నిమిత్త
మాత్రమై పల్కుదును; స్వసామర్థ్య మిప్పు
డరసి చూచినఁ గాని నా యందు లేదు." (I-21)

తనకు కనీసం ఓనమాలు అయినా రావంటోంది. ఓనమాలు రాని వ్యక్తి అనవాళ్లు ఇలా ఉంటాయా? అలాంటి వ్యక్తి ఇంతటి వైవిధ్య భరితమైన సాహిత్యాన్ని సృజిస్తుందా?

ఛందస్సులో పది పద్యాలైనా నేర్వలే దంటోంది. కానీ శ్రీవేంకటేశ్వర మాహాత్మ్యం అనే ఒక్క కృతిలోనే జాత్యుపజాతులు, సామాన్యవృత్తాలతో బాటు మత్తకోకిల, పంచచామరం, తురంగ, మాలిన్యాది వృత్తాలను కూడా వాడింది. ఇలాగ మొత్తం 15 ఛందోభేదాలతో బాటు 10 శ్లోకాలు కూడా రచించింది. దాన్ని బట్టి అమె ఛందశ్శాస్త్రాభిజ్ఞతను అంచనా వేయవచ్చు.

అటు తరువాత కావ్యనాటకాలంకార శాస్త్రాల్ని విననైనా లే దన్నది. కాని, ఆమె కావ్యంలో ప్రదర్శించిన అలంకారిక రచన, పాత్ర చిత్రణ, రస పోషణ, వర్ణన నైపుణి ఆమె అలంకారాది శాస్త్ర పాండిత్యాన్ని పట్టి యిస్తున్నాయి. అంతేకాక, అందందు ఆమె ప్రస్తావించిన జ్యోతిష నాట్య సంగీత సాముద్రికాది శాస్త్రవిషయాల్ని బట్టి కూడ ఆమె పాండిత్య గరిమను గమనించవచ్చు.

ఇక, ఆనాటి ఆ యా ప్రాంతాల వేషభాషల్ని, ఆచార సంప్రదాయాల్ని వర్ణించిన పట్టుల్లో ఆమె లోకజ్ఞత స్పష్ట మౌతుంది. పూర్వేతిహాసాదుల్ని శోధించి చూడలేదన్నా, పౌరాణి కేతివృత్త సంకలనంగా ఉన్న సంస్కృత వేంకటాచల మాహాత్మ్యాన్ని అనువాదం చెయ్యడంలోనే ఆమె పురాణేతిహాస వ్యుత్పత్తి వ్యక్త మౌతుంది.

ఇక, పైన ఉద్ధరించిన ఎత్తుగీతిలో ఉత్తమభావాన్ని వ్యక్తం చేసింది. తరిగొండ నారసింహ దేవు డానతిచ్చిన రీతిగా తాను

రచిస్తున్నానని, తాను నిమిత్తమాత్రనని స్పష్టం చేసింది. అంతటితో ఆ ప్రసంగం విడిచి పెట్టక "స్వసామర్థ్య మే మాత్రము లేద"న్నది.

తొలుత గురూపదేశం, అనంతరం అక్షర సరస్వతీ సాక్షాత్కారం, తరిగొండ నారసింహుని, ఏడుకొండల వేంకటేశ్వరుని కృపాకటాక్షాలు ఆమె వైదుష్యానికి "కారణంబులు, ఉద్బోధకములు" అయ్యా యనవచ్చు.

రామాయణ రచయిత్రి మొల్ల కూడ ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పదాలు, పదార్థాలు, పదబంధాలు, పద సంధులు, భావార్థాలు, భావ చమత్కారాలు, విభక్తులు, ధాతువులు, అలంకారాలు. ఛందోరీతులు, కావ్య సంపదలు - ఏవీ తనకు తెలియవని, కేవలం -

" - విఖ్యాత గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరము చేత

నెఱిఁ గవిత్వంబుఁ జెప్పఁగా నేర్చుదాన" అన్నది.

అంతేకాక, "చెప్పుమని రామచంద్రుఁడు చెప్పిం"చాడని మొల్ల అన్నది. పోతన కూడ "పలికించెడి వాఁడు రామభద్రుఁడు" అన్నాడు కదా!

అలాగే వెంగమాంబ కూడ -

"దారు నిర్మిత వీణ నారూఢిఁ బలికించు
గాయక పురుషుని కరణిగాను
పురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నా జిహ్వ
యందుఁ దా వసియించి యరుదుగాను
పలికించుఁ గావున భాగవతపురాణ
మమర నే ద్విపద కావ్యంబుగాను
ద్వాదశ స్కంధముల్ తగఁ జెప్పి హరికి స
మర్పించి, శ్రీవేంకటాద్రి మహిమ

మవనిపై రమ్య పద్యకావ్యంబు చేసి,
శ్రీనివాసునికే సమర్పింతునంటి
నీఁగ తోయధిఁ దాఁటఁ బోయిన విధమున
నా స్వతంత్రత కిల బుధుల్ నవ్విపోరె?" (I-22)

అన్నది. అయితే, పోతన కాని, మొల్ల కాని అందించని అలంకారాల్ని వెంగమాంబ ఎంత అందంగా అందులో ఒదిగించిందో చూడండి! దారు నిర్మితమైన వీణను గాయకుడు పలికించినట్లు, దామోదరుడు తన నాలుకతో పలికించాడట! ఎంత అందమైన అలంకారం!

ఇంకో మాట చెప్పింది - తాను వేంకటాద్రి మహిమను వర్ణించడం "ఈఁగ తోయధిఁ దాఁటఁబోయిన విధమున" ఉందట! ఎంత వినయం, ఎంత వినమ్రత, ఎంత భక్తి భావం, ఎంత ఉపమాన వివేచనం!

నే నిలా చెయ్యడం చూస్తే అంతా "నవ్విపోరా?" అని ప్రశ్నించుకొని, "నవ్వినను సమ్మతంబ"ని భావించి - ఇక వేంకటగిరి పురవర్ణనతో కావ్యారంభం కావించింది.

ఈ విధంగా శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో వెంగమాంబ వైదుష్యం అభినంద్యం.

"శ్రీనివాసుని రసరమ్యాలైన కావ్యకుసుమాలతో పూజించి, తరించిన సుమధుర సారస్వత మూర్తి తరిగొండ వెంగమాంబ" అనీ, "ఆమె కావ్యదీప కళికల కాంతులు ఈ నాటికీ నిరంతరం ఆ తిరుమలేశుని దివ్య వైభవాన్ని అక్షరంగా ప్రకాశింప జేస్తున్నా" యని వాకొన్న భూమన్ గారి అమృత వాక్కులు అక్షర సత్యాలు.

# * వెంగమాంబ కథ

-శ్రీ ఆర్.వి.శ్రీనివాసరావు

తిరుపతి క్షేత్రమునకు పడమరగా వాయల్పాడు గ్రామమున్నది. అచటికి నాలుగుమైళ్ల దూరాన తరిగొండ క్షేత్రమున్నది. ఆ గ్రామములో నివసించిన వెంగమాంబ యను మహాభక్తురాలి చరిత్ర మిప్పటికిని ప్రసిద్ధమే!

వెంగమాంబ శ్రీ ఆండాళ్లువలె భగవంతునే తన భర్తగా వరించి, ఆయనను గూర్చి తపముగావించుటలోనే తన జీవితమంతయు సార్థకము గావించుకొనిన మహాసాధ్వి యనదగును. ఆమె గాథ మిక్కిలి ఆశ్చర్యకరమగు నట్టిదియు, అనేకాద్భుతములు నిండినదియు నగును. ఆమె చరిత్ర క్రింద వివరించుచున్నాను.

తరిగొండ గ్రామమందు కృష్ణయ్య అను విప్రు డొకడుండెను. సర్వ విద్యా సంపన్నుడు, ధనవంతుడు నయిన ఆయన నడత తప్పక పలు దానధర్మాదుల గావించుచు జీవించ సాగెను. పంచపాండవులవలె ఆయనకు అయిదుగురు పుత్రులుండిరి: కాని, తనకు ఆడు సంతానము లేకపోవుట మహావేదన నొందించగా, కృష్ణయ్య తన భార్యా పిల్లలతో తిరుమల యాత్ర కేగి ప్రార్థన గావించెను. కొంతకాలమునకు పిదప శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహాన ఆయన కొక అందమైన యాడుబిడ్డ కలిగినది. అత్యద్భుత తేజోవిలాసముతో వెలుగొందు ఆ బిడ్డకు వెంగమాంబ అని పేరిడి యా దంపతులు ప్రేమానురాగములతో పెంచసాగిరి.

---

* ఈ వ్యాసము శ్రీ ఆర్.వి.శ్రీనివాసరావుగారు రచించిన "శ్రీ వేంకటేశ్వర భక్తవిజయము" నుండి ధన్యవాదాలతో స్వీకరింపబడింది.

వెంగమాంబ మనస్సులో స్వత స్సిద్ధముగా భక్తి యేర్పడెను. చదువుల తల్లియే అవతరించినదా? - యనునట్లు మిక్కిలి తెలివి తేటలు గలిగియుండినది. అయిదు సంవత్సరముల వయస్సులోనే శ్రీ వేంకటేశ్వరునిపై పాటలు పాడుచుండెను.

తన కుమార్తె సౌందర్యమును, విద్యాధిక్యమును గాంచి కృష్ణయ్య చాలా సంతోషపడెను. ఆమెను మిక్కిలి ప్రేమతో పెంచసాగెను. అయినను తన కుమార్తె సర్వధా శ్రీవేంకటేశ్వరుని గూర్చియే ఆలోచించుట కృష్ణయ్య మనస్సులో కొంత అలజడిని లేవదీసినది.

దినములు గడచు కొలది వెంగమాంబ నడవడికలో మార్పు కనిపింపసాగెను. ఆమె భగవంతునే తన నాయకునిగా భావించి ఆయనతో మాటలాడుటయు, ఆయనను గూర్చి పాడుటయు గాంచి కృష్ణయ్య చింతింపదొడగెను. "ఈ బాలిక భగవంతుడే తన భర్త యని చెప్పుచున్నదే? ఇది యేమివెఱ్ఱి? భగవంతుడేమిటి? ఈ పిల్లను పెండ్లాడుటేమిటి? ఇట్లే వదలి వేసిన నిజముగానే ఎవరిని పెండ్లాడ ననునేమో? ఏమి చేయువలయును?'' అని ఆలోచింపసాగెను.

వెంగమాంబ విషయము చుట్టుపక్కల బ్రాహ్మణులకు తెలిసినది. చిన్నబిడ్డగా ఉండియు వివాహమైనదాని వలె నడుచుకొనుటయు, దేవుడే తన భర్తయని పలుకుటయు, భర్తను గూర్చి మాట్లాడునపుడెట్లు సిగ్గిల్లునో అట్లుసిగ్గిల్లుటయు, "బిడ్డమిక్కిలి భక్తితో నున్నదను టాలోచింప వలసిన విషయమే. కాని దేనికైన ఒక హద్దు ఉండవలెను కదా? భక్తి శ్రుతిమించి దాంపత్య జీవనమును నిర్లక్ష్యము చేయువరకు ముదిరి పోయిన అపాయము గదా? బాలిక మనస్సును వేరు మార్గములోనికి త్రిప్పు టవసరము," అని బంధుజనము పల్కిరి.

ఈ విషయ మంతకు పూర్వమే కృష్ణయ్య మనస్సున మెదలినది. కావున కృష్ణయ్య వెంగమాంబ మనస్సు మార్చుటకు మార్గము వెదుకసాగెను. ఇంటిపని, వంటపని మొదలగు కార్యములను గమనించుమని నిర్బంధించెను.

కాని, మిక్కిలి కష్టతరమైన యింటిపనులను చేయునపుడు వెంగమాంబ తనను మరచి దైవచింతలో నుండుటచే ఆమె కలసట కలుగలేదు. కొన్ని సమయములలో నేదైన పని చేయునపుడు తనను మరచి సమాధిలోనుండి నిద్రించునట్లుండెను. ప్రపంచ జీవితములో నంటియు నంటక, ఆశను వీడి భగవంతుని స్మరించు జ్ఞానుల వంటి మనః పరిపక్వదశ ఆ బాలికకు ప్రకృతి సిద్ధముగా నేర్పడియుండినది. ఆమె తండ్రియైన కృష్ణయ్య దానిని గాంచి మిక్కిలి వ్యాకులతను, కోపము నొందెను.

"ఓ దైవమా! ఈ బాలిక యిట్లుండినచో రేపు వివాహమైన పిదప తన దాంపత్యమెట్లు చక్కదిద్దుకొనగలదు?" అని తలంచి ఆమె భగవంతుని తలచుటకు వీలు కలుగకుండునట్లుగా సదా తిట్టుచు, కొట్టుచు, పను లధికముగా చెప్పుచు, కొన్ని సమయములందు పస్తుంచి హింసించెను. పిండగా పిండగా నింకను పాలిచ్చు పశువువలె ఆమె భక్తి మరింత అధిక మయ్యెను.

కృష్ణయ్య అదిగాంచి మిక్కిలి వ్యాకులత నొందెను. తన కుమార్తెకు వెంటనే వివాహమొనరించుట మంచిదని తీర్మానించుకొనెను. అందులకు కావలసిన ప్రయత్నములు చేయసాగెను. బాలికను చూడవచ్చినవారు ఆమె యందమును చూచి మహాలక్ష్మివలె ఉన్నదని, వెంగమాంబ తమ యింటికి కోడలుగా వచ్చిన అది తమ అదృష్టమని భావించిరి. కాని, వెంగమాంబ భక్తి పారవశ్యమును గాంచి భయపడిరి. 'ఈ బాలిక

మనుష్యులతో సంసారము చేయదగినదిగాదు.' - అనికొందరు, 'ఏదో దేవతయే ఈ విధముగా వెంగమాంబ రూపమున జన్మించినది' అని మరికొందరు తలంచిరి. 'అందము నిచ్చిన భగవంతుడు బుద్ధి నిచ్చుట మరచిపోయెనే! ఈ పిల్ల దాంపత్య జీవనములో నెట్లమరిపోవును? ఇది బాలికగా పుట్టినది వ్యర్థము' అని కొందరు వంక జూపిరి. ఇట్లు ఆ బాలికనుచూచిన వారిలో నొకరైనను సంబంధమున కంగీకరింపలేదు.

కృష్ణయ్య మనస్సు మిక్కిలి వ్యాకులత నొందెను. తన కూతురు కెట్లయిననూ వివాహము చేయవలెననెడి లక్ష్యముతో వెర్రివానివలె తిరుగసాగెను. చివరికొకరిని జూచి పెద్ద కట్నమిచ్చి మహావైభవముతో వివాహ మొనరించెను.

అత్తగారిల్లు చేరిన వెంగమాంబ తానెచ్చటఉన్నదో గూడ మరచి, భగవంతుని ధ్యాసలోనేయుండి ఆయననే ధ్యానించుచు భజించుచుండెను. దానిని చూచి ఆమె అత్తమామ లామెయందు భక్తిశ్రద్ధలు గలిగినవారై ఆమెకు కొంచెమైనను కష్టము కలిగింపక వినయముగా నడచుకొనుచుండిరి. ఆమెను వివాహమాడిన పిల్లవాడు చిన్నవాడగుటచే ఆటల ధ్యాసలో దేనిని గమనింపలేదు. వెంగమాంబ భక్తిని గ్రహించిన ఆ యూరి ప్రజ మిక్కిలి ఆశ్చర్యవంతులై 'ముక్కుపచ్చలారని పసిబిడ్డ ఇంత భక్తితో ఉండుట మిక్కిలి యపూర్వము; పూర్వజన్మ సుకృతమునగాని ఇట్టి భక్తి కలుగదు. ప్రహ్లాదుడో, ధ్రువుడో మరల యీ బాలిక రూపమున జన్మించి యుండవలెను. ఈమె భక్తి కాటంకము కలిగించిన హిరణ్యకశిపునకు పట్టిన గతియే పట్టును.' అని మాట్లాడుకొనిరి. వెంగమాంబ అత్తమామలు కొంతకాలమునకు పిదప ఆమెను కృష్ణయ్య వద్దకు తీసికొనివచ్చి 'కోడలు భక్తికి మేము చాల సంతోషపడుతున్నాము. కాని దాని మనస్సు నెక్కడ కష్టపెట్టుదుమో యని భయముగా నున్నది. ఇంక కొంత కాలము మీవద్దనే

యుంచుకొని లౌకిక జ్ఞానమేర్పడునట్లు చేయుడు.' అని పలికి వెంగమాంబను వదలి పెట్టిపోయిరి.

ఆ పల్కులు కృష్ణయ్యకు మనోవేదన కలిగించినవి. మిక్కిలి దుఃఖితుడై 'వివాహమైనను దీని మనస్సు మారకున్నదే. నేనేమిచేయుట'? అని చింతించెను.

మరల వెంగమాంబకు ప్రపంచ విషయములలో ఆసక్తియు, దాంపత్య జీవితముపై సుముఖత్వము కలిగించుటకై ఇంటిపనులు మున్నగు పనులను పురమాయించుచు తొందరపెట్టసాగెను. ఈ పరిస్థితిలో వెంగమాంబ యుక్తవయసునకు వచ్చి మహాలక్ష్మివలె ప్రకాశించుచు సౌందర్యవతియై వెలుగొందు చుండెను..

కృష్ణయ్య వెంటనే వియ్యంకునకు కబురు పంపెను. దాంపత్య జీవితమునకు లోబడిన తనకుమార్తె మనసు మారవచ్చునని తలచి, కార్యము చేయుటకై పెద్ద అర్భాటము గావించెను.

శాంతి ముహూర్తపునాటి రాత్రి వెంగమాంబ తన దగ్గరకు వచ్చిన యువకుని చూచినంతనే ఉన్మాదోద్రేకముతో లేచి నిలబడి "నీవెవరవు? ఎందుల కిక్కడికి వచ్చితివి? నా ప్రాణనాయకుడు శ్రీ వేంకటేశ్వరుడని నీకు తెలియదా? నేను వివాహితనని దెలిసియు నా తండ్రి మూర్ఖత్వముచే నాకు మరల వివాహమొనరించెను. నాకు నీపై ఆశానురాగములు లేవు. నాకు, నీకు దాంపత్య జీవితము కుదరదు. నీవింకొక స్త్రీని చూచి వివాహము చేసికొనుము. ఇచ్చటినుండి పొమ్ము" అని యరచెను.

దిగ్భ్రాంతినొందిన ఆ యువకుడు భయపడి పారిపోయెను. ఊరి వారు కొందరు తనకు భార్యగా లభించిన

స్త్రీ దేవతయో, మోహినియో అనుట నిజమని భావించెను. వెంగమాంబను తలచినంత లోనే శరీరము వణకసాగినది. ఆనాటి రాత్రంతయు నిద్రింపక మరునాడు తెల్లవారకముందే లేచి ఎవరికి చెప్పకుండ తన గ్రామమునకు పోయెను. కొంత కాలమునకు భయభ్రాంతిచే వెంగమాంబ భర్త మరణించెను.

కృష్ణయ్య తన అల్లుని మరణమునకు మిక్కిలి చింతించి, తన కుమార్తె మాంగల్యమును తీయించి, గుండు గొరిగించి వైధవ్య రూప మేర్పరచుట కేర్పాట్లు గావించెను. వెంగమాంబ దాని కంగీకరింపలేదు. "భగవంతుడే నా భర్త. నేను దీర్ఘసుమంగళిని. ఆయన ధ్యానమే నా జీవితాశయము. నేను సుమంగళిని కాని, అమంగళిని కాను" అని వాదించెను.

ఆ గ్రామ కాపురస్థులయిన బ్రాహ్మణులు కులాచార తిరస్కారమున కంగీకరింపలేదు. కృష్ణయ్య వైదిక ధర్మము ప్రకారము తన కుమార్తెకు గావింపవలసిన కార్యములను చేయులేదని, అందువలన వానిని తమ జాతి నుండి వెలివేయవలెనని కొందరు పలికిరి. కృష్ణయ్యవిచారగ్రస్తుడై మరణించెను. ఆయన మరణానంతరము ఆ గ్రామవాసుల దృష్టియంతయు వెంగమాంబవైపు మళ్ళినది. వెంగమాంబ ఎల్లప్పుడును పుష్పాభరణములు ధరించి సదా భగవంతునే ధ్యానించుచు, ఆయనను పూజించుచు కాలము గడుపుచుండెను. ఆమె భక్తిపారవశ్యము గ్రామములోని ప్రజల దృష్టి నాకర్షించినది. వారామె యందు భక్తిశ్రద్ధలను జూపుచుండిరి. కళామతల్లియగు సరస్వతీదేవియే వెంగమాంబగా నవతరించి పామర జనావళికి భక్తామృతమొసంగు చున్నదని మాట్లాడుకొనిరి, అదియుగాక, ఆమె కవసరమగు సమస్త సదుపాయములు కావించి కంటి రెప్పవలె కాపాడుచుండిరి.

కాని అసూయాపరులైన బ్రాహ్మణులు వెంగమాంబను కులద్రోహి యనియు, అహంకారియనియు, వ్యభిచారియనియు దూషించిరి. వెంగమాంబ వారిని లక్ష్యపెట్టలేదు. ఆమె భక్తి పారవశ్యమున మునిగి యుండెను. ఆమె ఊహాలోకమున భగవంతునకే స్థానమిచ్చినది. తక్కిన విషయము నామె మరచినది.

ఈ సమయమున శంకరాచార్య పరంపరకు చెందిన వచ్చిన పుష్పగిరి పీఠాధిపతి యొకరు ఆ యూరికి వచ్చెను. ఆయన నాహ్వానించి యుపచరించిన ఆ యూరి బ్రాహ్మణులు ఆ శంకరాచార్యుల వద్ద వెంగమాంబను గూర్చి ఫిర్యాదు చేసిరి. బ్రాహ్మణ కులమున జన్మించి, కుల ధర్మమును వీడి, మనస్సు పోవు మార్గములో నడచుకొనుట పెద్ద అపచారమనియు, అట్లే వెంగమాంబను వదలివేసిన తక్కిన కన్యలును కులధర్మము వీడి తమ ఇష్టప్రకారము నడచుకొన వచ్చునని, ఆమెను సరిదిద్దవలసిన దనియుకోరిరి.

శంకరాచార్య స్వాములు వెంగమాంబకు బుద్ధిచెప్పదలచి ఆమెను తన వద్దకు తీసుకు రావలసినదని తన సేవకుల బంపిరి. వారుపోయి ఆమెను రమ్మనగా, భోజనము చేసి వచ్చెదనని వెంగమాంబ వారిని పంపివేసెను.

శంకరాచార్యస్వాముల కావిధముగా ఎదురు జవాబొసంగినవా రరుదు. అందువలన అచట కూడియున్న బ్రాహ్మణులు మిక్కిలి కోపించి, వెంగమాంబవద్దకు బోయి, ఆమెను బలవంతంగా లాగుకొని వచ్చి స్వాముల వారిముందు నిలిపిరి. వెంగమాంబ విధవ యగుటచే నామెను స్వాములవారికినీ మధ్యలో నొక తెర కట్టబడెను. తెరవెనుక జగద్గురువు సింహాసనముపై గూర్చొని యున్నారనియు, వెంగమాంబను ఆయనకు నమస్కారము

చేయుమని పలుమార్లు పలికిరి. కాని వెంగమాంబ ఆయనకు నమస్కరించలేదు. అది గాంచిన బ్రాహ్మణులు "ఎంత అహంకారిఇది! జగద్గురువులకే నమస్కరింపకున్నదే. దీనికి పోకాలము దాపురించినది. దీని కేదో గ్రహము పట్టినట్లున్నది. "అని పలువిధములుగా పలుకుచు పరిహాసము జేసిరి. కొందరు వెంకమాంబను కొట్టిరిగూడ. ఆమె అవిధేయతకు కోపించి శంకరాచార్యులు తెరను వీడదీయమనెను. వెంగమాంబను చూచి "అహంభావీ! నీవేల ఇట్లు నిలబడితివి. పెద్దలకు నమస్కరించ వలెనని నీకు దెలియదా?" అని ప్రశ్నించెను.

"మీరా సింహాసనము దిగి ప్రక్కకు బోయి నిలబడిన నమస్కరించెదను" అని వెంగమాంబ పలికెను.

అదివిని శంకరాచార్యులవారు మిక్కిలి కోపించిరి. "మహా విద్వాంసులు, పండితులు, తపస్వులు గురువుగా నంగీకరించి నమస్కరించు నన్ను నీవలక్ష్య పరచితివి. కానిమ్ము. కుల ధర్మము ననుసరింప వలెననెడి నిజమును నీవు గ్రహించినట్లు చేయుటకై నేను ప్రక్కకు బోవుచున్నాను" అని ప్రక్కకు బోయినిలబడెను.

వెంగమాంబ సింహాసనము జూచి రెండు చేతులు మోడ్చి నమస్కరించెను. వెంటనే ఎవరును కని విని ఎరుగని వింత యొకటి జరిగెను. పిడుగుపడినట్లు ప్రకాశవంతమైన ఒక కాంతి ఆ సింహాసనము తాకినది. వెంటనే అది మండి మసియయ్యెను, చుట్టుప్రక్కల బ్రాహ్మణులు ప్రాణము లర చేతిలో ఉంచుకొని పారిపోసాగిరి. సింహాసనమునకు తటస్థించిన జ్వాలాగ్ని వలన ఏర్పడిన వేడి భరింపశక్యము గా కుండినది.

శంకరాచార్యస్వాములవారు దానిని గాంచి మిక్కిలి ఆశ్చర్యపడిరి. తానా సింహాసనముపై గూర్చుండి యుండిన

మసియై పోయి ఉందునని భావించి, ఆయన వెంగమాంబ పాదములకు నమస్కరించి, "తల్లీ, నేను తెలియక పలికిన పల్కులు మన్నింపుము. నీ భక్తి యొక్క గొప్పదనము నెరుంగక బ్రాహ్మణుల వార్తలు విని సాధారణ స్త్రీగా నెంచితిని. భక్తి యొక్క గొప్పతనము దెలియ జేయుటకు లోకమాతయే నీ రూపున వచ్చినట్లున్నదని నిజ మెరింగితిని. క్షమింపుము" అని పలువిధములుగా ప్రార్థించి, వెంగమాంబకు మరల మర్యాదలతో ఉపచరించెను.

ఆ పిదప శంకరాచార్యులు ఆయూరి బ్రాహ్మణులకు భక్తి యొక్క గొప్పదనము గూర్చి పలు ఉపదేశములు గావించిరి. కర్మానుష్ఠానములు సామాన్య మానవులకే చెందును. కర్మబంధము వీడినవారు, సుజ్ఞానులై భగవంతునికి సమీపమున ఉందురు. వారు కర్మల పాటింపవలసిన పనిలేదు. మురికి నీరు శరీరము నెట్లు శుభ్రముగావింపదో, అట్లే కర్మలనుండి వీడఁబడిన వారికి కర్మానుష్ఠానముల వలన ప్రయోజనము లేదు. వెంగమాంబ ప్రపంచ సౌఖ్యముల త్యజించి, భక్తి పారవశ్యమున ఉండుటచే నామె తక్కిన సాధారణ మనుష్యులు పాటించు కర్మలనుపాటింప వలసిన అవసరము లేదని పలికినారు. దానిని విని తక్కిన బ్రాహ్మణులు వెంకమాంబ పాదములపై బడి నమస్కరించిరి.

కాని వారి మనస్సులో పాతుకొని పోయియున్న కులాచార ధర్మములను అనుసరించు అలవాటు వారిని వీడలేదు. వారు శంకరాచార్యుల వారిని గాంచి "వెంకమాంబ గొప్పదనము మేము కండ్లయెదుట చూచుటచే ఒప్పుకొను చున్నాము. అయినను ఉన్నత స్థానమున ఉన్నవారు కుల ధర్మములు పాటించుట తక్కిన వారికి మార్గదర్శకముగా ఉండవలెను. కొండపై రగిలిన మంట చాల దూరము కనబడునట్లు ఉన్నత స్థానమందుండు వారు కులాచార

ధర్మములు పాటించినచో తక్కిన వారికి వాని నమ్మకము గలుగజేయును కావున వెంకమాంబ కులాచారముల పాటించునట్లు చేయవలసినది" అని వేడుకొనిరి.

శంకరాచార్యులు వెంకమాంబను గాంచి 'భగవంతుడే భక్తుల కోరికలను నెరవేర్చునపుడు, మీరు వీరి వేడ్కోలు నంగీకరించుట కేమి?' యని ప్రశ్నించెను.

అది విని వెంకమాంబ 'మీ కేదియు నేనడ్డుజెప్పజాలను. మీరు నా గుండు గీయించిన యెడల మరల నా తలపై శిరోజములు మొలవకుండ జేయవలెను' అని పలికెను.

అది విని స్వాములవారు వెంకమాంబ పాదములను పట్టుకొని 'తల్లీ అది నావల్ల కాదు. మీ గొప్పదన మెరుంగక పలికితిని. నేను నాది - అను వానిని వీడి పరిపక్వదశలోనున్న తమకు నేనేమియు జెప్పనవసరము లేదు' అని పలికి బ్రాహ్మణుల జూచి 'వెంకమాంబ లోకమాతతో - సమానమని గ్రహింపుడు. ఇక ఆమె మార్గమునకు అడ్డుపడవలదు' - అని వారికి తెలియ జెప్పి వెడలిపోయెను.

ఆనాటి నుండియు సకల జనులు వెంకమాంబను ప్రత్యక్ష దైవముగా భావించి పూజింప సాగిరి. వెంకమాంబ రాత్రనక, పగలనక, ఎండయనక వానయని తలంపక సర్వదా భగవంతునే స్మరింప సాగెను.

భక్తి పారవశ్యంబున వెంకమాంబ అచటగల నృసింహుని యొక్క ఆలయమునకు బోయి స్వామిని తానే తన చేతులతో నలంకరించి పూజింప సాగెను. అది కోవెలయందలి అర్చకులకు నచ్చలేదు. ఒకనాడు వెంగమాంబను కోవెల బయటికి త్రోసివేసి

కోవెల తలుపులను మూసికొని పోయిరి. కాని వెంగమాంబ భగవంతుని పూజించుటకై పుష్పములు కోసికొని వచ్చినంతనే కోవెల తలుపులు తమకు తామె తెరచుకొనినవి. ఈ విధముగా వెంగమాంబ తనకు పూజచేయుటలో తన కానందమేనని భగవంతుడు అర్చకుల కనేక విధములుగా దెలియజేసెను. కాని ఆచారానుష్ఠానముల నను సరించుచు మూఢాచారులై యుండిన అర్చకులకు కొంచెమయినను మనః పరివర్తన కలుగలేదు. వెంగమాంబపై వారికి గల ఈర్ష్యాసూయలు వారి నంధులను గావించెను. దైవవశమున జరిగినవన్నియు మాయ యనియు, ఇంద్రజాలమనియు భావించిరి. వెంగమాంబ యొక మంత్రగత్తెయని, ఆమె అందరిలో దిరుగుట ప్రమాదమని తీర్మానించుకొని, ఒకనాడు వెంగమాంబ భక్తి పారవశ్యములో మైమరచి యుండగా ఆమె చుట్టును ఒక గోడ లేపి సమాధి గావించుట కాయత్తమైరి. అర్చకులు వెంగమాంబ చుట్టు గోడ కట్టించి, ఆమె వలన నిక కష్టములు కలుగవని దలచినవారై వెడలిపోయిరి. కాని వెంగమాంబ యచట నుండి మాయమై శ్రీ వేంకటేశ్వరుడు వెలసియున్న తిరుపతి క్షేత్రమునకు వచ్చి చేరెను.

తిరుపతి క్షేత్రమున భగవంతుని అనుదినము తులసీ దళములచే అర్చన గావించి పూజించుట కొరకైన ఒక తులసీవనమును దానికి నీరు పారించుటకు ఒక బావి నేర్పరచుటకు వెంగమాంబ యేర్పాటు చేసెను.

బావిని త్రవ్వువారనేక దినములు పని చేసినను ఆ బావిలో నీరు పడక వట్టి బండమయమైయుండెను. ఇంకను బండను పగులగొట్టి త్రవ్వుట తమకు సాధ్యముగాదని పలికి కొలను త్రవ్వువారు వెడలిపోయిరి. వెంగమాంబ వారు వెళ్లిపోయిన పిదప బావి మధ్యకు బోయి నిలబడెను.

'పరమేశ్వరుని శిరోమకుటమున నుండు దానా! గంగాదేవీ! నీ విక్కడికి రావలసినదిగా ప్రార్థించుచున్నాను' అని వెంగమాంబ ప్రార్థించి నంత బండరాతిని చీల్చుకొని నీటి ప్రవాహము పైకి వచ్చి బావిని నింపి వేసెను.

వెంగమాంబ తులసీవనము వేర్పరచి అచ్చట తులసీ దళములచే అనుదినము భగవంతుని పూజించుచుండెను. వెంగమాంబ మాహాత్మ్యము వలన రాతి నుండి నీరేర్పడినదనెడి వార్త దేశమంతయు వ్యాపించెను. ప్రజలు దిన మామెను దర్శింపవచ్చుచుండిరి.

ఈ కాలమున వెంగమాంబ వేంకటాచలమహాత్మ్యమను తిరుపతి స్థలపురాణము రచించి భగవంతుని కంకిత మిచ్చెను. శ్రీవేంకటేశ్వరు డామె భక్తికి మెచ్చి ప్రత్యక్షమై ప్రతి దిన మామె పూజ గావించు నపుడు ఆ పూజలు తానే స్వయముగా స్వీకరించు చుండెను.

వెంగమాంబ గొప్పదనము దేశమంతట వ్యాపించుటచే ప్రతిదిన మామెను దర్శింప వచ్చు వారి సంఖ్య అధికము కాసాగెను. భగవంతునిపై మనస్సు కేంద్రీకరించుటకు సాధ్యము గాకున్నదని గ్రహించిన వెంగమాంబ ఆ ప్రదేశము వదలి తిరుపతి క్షేత్రమునకు పన్నెండు మైళ్ళ దూరమున గల తుంబురు తీర్థ సమీపమున నొక భయంకరమైన గుహలో ప్రవేశించి, అచట వసింపసాగెను. వెంగమాంబ కనబడక పోవుట గాంచిన జనులామె భగవంతునిలో లీనమైయ్యెనని తీర్మానించుకొని తులసీ వనమున ఒక సమాధి నేర్పరచి దానిని పూజింప సాగిరి.

పూర్వకాలమున వెంగమాంబ నివసించు గుహనుండి దైవసన్నిధి వరకు ఒక సొరంగమార్గముండినది. దానినెవరును

గమనింప కుండినందున అది మరుగున పడిపోయెను. అట్లొక దారియున్నదని ఎవరును గ్రహింపలేదు. వెంగమాంబ ఆ గుహా మార్గమున అర్ధరాత్రి అయిన పిదప కోవెలకు బోయి సూర్యోదయమునకు పూర్వమే పరంధాముని తులసీ దళముల పూజించి తన గుహకు పోవుచుండెను.

ప్రతిదినము తాము భగవంతునికి గావించు అలంకారములు మరునాటి ఉదయము వచ్చి చూచినపుడు మారియుండుట అర్చకులు గమనించిరి. భగవంతు డలంకరింపబడి యుండుట, అప్పుడే విరబూసిన పుష్పములచే, దళములచే అర్చింప బడియుండుట గాంచి ఆ విషయమును దేవస్థాన మహంతున కెఱింగించిరి.

భగవంతుని అర్ధరాత్రమున-దేవతలు వచ్చి పూజించు చున్నారో? వేరే దయిన జరుగుచున్నదో?యని తలచు చుండిరి. ఇట్లనేక దినములు గడిచినవి. దినము తప్పక అట్లు జరుగుట గ్రహించిన మహంతు దానికి కారణమెరుంగ దలచెను. ఒకనాటి రాత్రి ఆ కోవెల మూయునపుడు మహంతు మటు కొక చోట నిలిచి గమనించుచుండెను.

అర్ధరాత్రమయిన పిదప చీకటిగా నుండిన గర్భ గృహము నందొక ప్రకాశ ముదయించెను. వనమోహినియో, దేవతయో, లేక తపో వేషమున నున్న మహాలక్ష్మియో అని ఆశ్చర్యపడు విధముగా పుష్పములచే తన నలంకరించుకొని యుండిన వెంగమాంబ గుహా మార్గమున కోవెల గర్భగృహమున ప్రవేశించెను. భగవంతున లంకరించి యుండిన పుష్పమాలను తీసివేసి, స్వచ్ఛమైన గంగాజలముతో అభిషేకము గావించెను. పిదప తాను తెచ్చియుండిన పుష్పమాలికలచే నలంకారము చేసెను. తాను దెచ్చిన ఫలములను పెట్టి, పూజ గావించెను. భగవంతుడు

ప్రత్యక్షమయ్యెను. ఆమె తీసికొని వచ్చిన పండ్లను తిని సంతుష్టుండయ్యెను. ఉదయమగు లోపల తన పూజను ముగించుకొని మరల గుహా మార్గమున వెంగమాంబ వెడలి పోయెను.

మహంతు జరిగినంతయు గమనించు చుండెను. ఆయన కాళ్లు చేతు లాడలేదు. నోటమాట రాలేదు. వెర్రివానివలె నిలిచిపోయెను. మరునాడు అర్చకులు వచ్చి తలుపులు తెరచిరి. మహంతు ఆనంద బాష్పములు రాల్చుచు ప్రతిదినము రాత్రి వేళలో భగవంతుని పూజించి పోవునది వెంగమాంబ యనియు, ఆమెకు భగవంతుడు ప్రత్యక్షమై ఆమె చేతులలో ఇచ్చిన పండ్లు తినుట తాను జూచితిననియు, కలియుగమున తానింతటి భక్తులఁ జాడ లేదనియు వారికి దెల్పెను.

వెంకమాంబ జీవించి యున్నదనెడి విషయము ప్రజలకు దెలిసినంతనే వారామె దర్శింప గోరి కొండ ప్రాంతమున వెదుక సాగిరి. ఒక్కొక్క గుహయందు, జలాశయ తీరములందు, తీర్థ ప్రదేశములందు వెదకిరి. అది యెఱింగిన వెంకమాంబ భగవంతుని దర్శింపబోవుట నాపివేసి, గుహయందే నివసింపసాగెను.

మహాభక్తురాలైన వెంకమాంబ. తనను పూజింపరా కున్నను భగవంతుడే ఆమెను వెదకుచు బోయెను. వయోవృద్ధుని వలె వెంగమాంబ యున్న గుహవద్దకు బోయి "తల్లీ! నాకు ఆకలి వేయుచున్నది. భిక్ష పెట్టుము" అని పలుకుచు నిలబడినాడు. వెంగమాంబ ఇచ్చిన పండ్లను ప్రేమతో భుజించివాడు. "ఈ కొండ ప్రదేశములో తిరిగి నా కాళ్ళన్నియు బాధపెట్టుచున్నవి" అని పలికి తన పాదములు పట్టుమని వెంగమాంబను కోరెడివాడు.

వెంకమాంబ తాను భగవంతుని దర్శింపలేక పోయితినే అని చింతించు నపుడాయన ఆమెకు తన నిజరూపముతో దర్శన

మిచ్చెడివాడు. భక్తిలో లీనమై వెంగమాంబ చాల కాల మందే వసించెను.

ఈ విధముగా నుండగా పెద్ద రోగముచే బాధింపబడిన ఒకడు తన భార్యాబిడ్డలచేతను బంధు మిత్రుల చేతను త్యజింపబడి, అంతట దిరుగుచు తిరుమలకు వచ్చి చేరెను. ధర్మముగా నిచ్చు కోవెల ప్రసాదము తినియైనను తన జీవితము గడపివేయ వచ్చునని తలచెను. అతడు రోగముచే చూచుటకు సహింపరాని విధముగా కృశించి పుచ్చి కంపు గొట్టు శరీరము గలిగియుండెను. వాని రూపును చూచి నంతనే వాని నసహ్యముతో తరుమ సాగిరి. వానివద్ద వచ్చు దుర్గంధము సహింపలేనట్టిదిగా నుండుటచే ఎవరును వాని దరి జేరలేదు. అది గాంచి మనస్సు విరిగినవాడై ఆ వ్యాధిగ్రస్తుడు కన్నీరు గార్చుచు "వేంకటేశ్వరా! ఎందులకు నన్ను బ్రతికించితివి? కుక్క కన్న నీచముగా నే నీ భూమిపై దిరుగుటకు కారణమేమి? అయ్యో! కాలిచే తన్నబడు హీనజంతువుకంటె నీచమైన ఈ జన్మ మెత్తుటకు నేనెంత పాప మొనరించితినో? అని తలచినంతనే నా హృదయము బ్రద్దలగుచున్నది. దేవా! నేను దుఃఖించిన ప్రయోజన ముండునా? పాప ఫల మనుభవింపఁవలెగదా! తమ పాపముల ననుభవింపకున్న నిక ప్రయోజన మేమి?

హే అనాథ రక్షకా! ఇతరులచే అసహ్యించుకొనబడు శరీరముతో నేనిక జీవింపజాలను. నీ పుణ్య క్షేత్రమైన ఈ తిరుమల క్షేత్రముపై నా జీవితమంత మగుటచే నా పాపములు దీరి, రాబోవు జన్మలోనైన నాకు సద్గతి గల్గును. నా పాప విమోచనమునకే ఏదో ఒక శక్తి నన్నిచ్చటికి దీసుకొని వచ్చియుండును. ఇక, క్షణమైన జీవింపజాలను. జన సంచారము లేని ప్రదేశమునకు బోయి కొండపై నుండి పడి ప్రాణములు పోగొట్టుకొనెదను - అని పలుకుచు కన్నీటితో పిచ్చివానివలె నేడువసాగెను.

జీవితము త్యజింపగలిగిన వైరాగ్యము, విరక్తియు వానిని పిచ్చివానివలె నడిపింపసాగినవి. నడచి నడచి తుంబురు తీర్థ సమీపమున వెంగమాంబ నివసించు గుహాసమీపమునకు వచ్చెను. అతని దీనారావము వెంగమాంబ చెవుల బడినది. వెంటనే వెంగమాంబ స్వామికి నివేదించిన పండ్లను దీసుకొని వచ్చి వానికిచ్చి "వీనితో నీ ఆకలి దీర్చుకొనుము. నీవు చేసిన పాపఫల మింతటితో ముగిసిపోయెను. ఇక కష్టములు దీరి సుఖింతువు. కాని నన్నీ ప్రదేశమున చూచితినని ఎవరికిని చెప్పవద్దు. అట్లు చెప్పిన మరుక్షణమే నీ తల పగిలి మరణింతువు." అని పలికి కనుమరు గయ్యెను.

పెద్ద వ్యాధితో బాధపడువా డా ఫలముల దినెను. భగవంతునికి సమర్పింపబడిన ప్రసాదమైన వానిని తినినంతనే వాని శరీరమంతటను ఒక జ్వాల వ్యాపించెను. అట్లే మైమరచి, అతడు తుంబురు తీర్థములోనికి దిగెను. పైకి లేచునపుడు స్వామి పుష్కరిణి నుండి బయటికి వచ్చెను. వాని శరీర వ్యాధి నయమై, దివ్యకాంతితో గూడిన శరీరము దేవతవలె ప్రకాశించుచు ఆ సమయమున అక్కడ స్నానము చేయుచుండినవారు దివ్యదేహముతో ఉన్నట్టుండి బయటికి వచ్చిన వానిని చూచి దేవతగా భావించి, వానిని సమీపించి ఉపచారములు గావించిరి. ఆరాటము చంపుకోలేక వెంగమాంబ గూర్చియు, ప్రవేశమును గూర్చియు దెల్పెను. కాని ఆక్షణమే తల పగిలి అతడు మరణించెను.

మరల భక్త వాహిని తనను చుట్టుముట్టబోవుచున్నదని తన దివ్యదృష్టిచే గ్రహించిన వెంగమాంబ ప్రజల కంటిలో పడగూడదని నిశ్చయించుకొని గుహ త్రోవన శ్రీ వేంకటేశ్వరుని సన్నిధికి వచ్చి ఆయనలో లీనమయ్యెను. ఇప్పటికిని శ్రీవేంకటేశ్వరునికి ప్రతిదినము 'వెంగమాంబ హారతి' అని తిరుమలలో పూజ జరుపబడుచున్నది. వెంగమాంబ గొప్పదన

మెరింగిన భక్తులు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని దర్శించిన పిదప, ఆమెచే నేర్పరుపబడిన తులసీ వనమును సమాధిని, దర్శించి, వెంగమాంబ గంగాదేవిని రప్పించిన తిరుక్కోణ తీర్థమును భక్తితో తమ తలలపై చల్లుకొని వెడలి పోవుచుందురు. తక్కిన తీర్థములు, జలాశయములు ఎండిపోయినను వెంగమాంబ కొలను మట్టు కెండకున్నది. పౌర్ణమి దినమున తుంబురు తీర్థమున స్నానమాచరించుట మంచిదని పెద్దలు చెప్పుదురు.

గోదాదేవి, మీరాబాయి, మొల్లమాంబ వంటి వారివలె వెంగమాంబ చరిత్రయు ప్రసిద్ధమే.

శుభం.

# * తరిగొండ వెంగమాంబ

**- ఆచార్య ఎస్. గంగప్ప**

తెలుగు ప్రాచీన సాహిత్యంలో కవయిత్రులు ఎందరో లేరు. వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు వారిలో ఆతుకూరి మొల్ల తరువాత పరిగణించదగిన మహాభక్తురాలు, ఉత్తమ కవయిత్రి తరిగొండ వెంగమాంబ.

ఈ కవయిత్రి పదునెనిమిదో శతాబ్ది పూర్వభాగంలో తరిగొండలో జన్మించింది. కనుక ఈమె 1750 ప్రాంతంలో జీవించి ఉన్నట్లు తెలుస్తుంది.

వెంగమాంబ తండ్రి కానాల కృష్ణార్యుడు; తల్లి మంగమాంబ. కృష్ణుడనే సోదరుడుండేవాడు.

"నా చిన్ననాట నోనామాలనైన
నా చార్యులెవరు నాకానతీలేదు"

అని తనకు ఆచార్యులెవరూ లేరని తెలిపింది. కాని, మరోచోట తన గురువర్యుడు సుబ్రహ్మణ్యదేశికుడని పేర్కొన్నది. అయితే, ఇతడు వేదాంతోపదేశికుడని అంటారు. అంటే కవితాగురువు ఎవరూలేరని ఆవిడ అభిప్రాయమని తలంపవచ్చు. భర్త పేరును ఈమె తన రచనలలో అక్కడక్కడ స్మరించింది. అతడు శ్రీవత్సగోత్రుడూ, ఇంజేటి తిమ్మయ్య పుత్రుడూ అయిన వేంకటాచలపతి. మరి ఎక్కడా భర్తనుగూర్చి చెప్పలేదు. ఈవిడ బాలవితంతువని ప్రతీతి.

* ఈ వ్యాసం ఆచార్య ఎస్. గంగప్పగారు రచించిన 'ఉపవాచకము' నుండి ధన్యవాదాలతో స్వీకరింపబడింది.

ఈమె ఇంటిపేరు తరిగొండ కాదని, 'తరికుండ' అని కొందరి అభిప్రాయము. ఇందుకు కారణం లేకపోలేదు. చిన్న ఐతిహ్యం కూడా ఉంది. ఇప్పటి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం ప్రాంతంలో ఒకానొక సమయంలో కరువు కాటకాలు విలయ తాండవం చేశాయట. అచ్చటి ప్రజలు ఇతర ప్రదేశాలకు బ్రతుకుతెరువు కోసం వెళ్లిపోయారు. మార్గ మధ్యంలో 'ప్రత్తి మిట్ట' అనే ప్రాంతంలో కొంతకాలం గడిపారు. అక్కడ ఒకానొక స్త్రీ మజ్జిగ చిలుకుతుండగా ఏదోరాయి లాగా అడ్డుపడిందట. చేయిపెట్టి చూడగా కుండలోపలి భాగంలో నరసింహస్వామి శిలారూపంలో కనిపించాడట! ఆ రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, వారు నరసింహస్వామిని పూజించ నారంభించారు. అదే ప్రదేశంలో ఊరు వెలసింది. దానిపేరే 'తరికుండ'. మజ్జిగ చిలుకుతుండగా నరసింహస్వామి వెలిశాడు గనుక. అది 'తరికుండ' అని అనబడిందని కొందరి తలంపు. కాని, వెంగమాంబ ఇంటి పేరు 'తరిగొండ' అనే ఎక్కువ ప్రచారంలో ఉంది. మరోవిధంగానూ దీన్ని సమర్థించవచ్చు. 'తరిగొండ' అంటే అమృతంకోసం దేవతలు, రాక్షసులు మంథర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని సముద్రాన్ని మథించారు గనుక 'మంథర పర్వత' మని అయినా అనుకోవచ్చు. ఇందులో తప్పులేదు. పైపెచ్చు అధిక ప్రచారంలో ప్రసిద్ధి పొందిన 'తరిగొండ వెంగమాంబ' అనడం సైతం చక్కగా కుదురుతుంది.

వెంగమాంబ పుట్టుక, జీవిత విశేషాలు వింతగా కనిపిస్తాయి. ఈమె తల్లి దండ్రులకు చాలాకాలంవరకు సంతానం కలుగలేదు. అందుకని తండ్రి కృష్ణార్యుడు ఎందరో దేవతలకు గుడులుకట్టి మొక్కుబళ్లు చెల్లించినా సంతు కలుగలేదు. పిల్లా పాపలతో ఇల్లు కళకళలాడుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. చివరికి శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహంతో ఒకే ఒక బాలిక కలిగింది. వరాల

పంటగా బిడ్డను గన్న తల్లిదండ్రుల సంతోషానికి మేరలేకపోయింది. మిక్కిలి ఆనందించారు. 'వెంగమాంబ' అని నామకరణంచేశారు. అపురూపంగా పుట్టిన బిడ్డ గనుక, తల్లిదండ్రులు ఎంతో గారాబంగా పెంచుతూవుండే వారు. వారి ఆశలు మోసులెత్తునట్లు ఆ బాలికసైతం ఎత్తువారి చేతిబిడ్డగా అందరికీ ఆనందం కూరుస్తూ ఉండేది. ఆ బిడ్డ బుద్ధి సూక్ష్మత కలది. సుమారు ఏడెనిమిదేండ్ల వయస్సురాగానే లౌకిక విద్యల్ని విడనాడి, అధ్యాత్మిక విద్యలలో మునిగిపోయింది. ఎల్లప్పుడు కృష్ణుని పేరు స్మరిస్తూ పరమ భక్తురాలైనది. బిడ్డ ముద్దుముచ్చటలు చూచి మురిసిపోదామను కున్న తండ్రికి ఇది కంటగింపైంది. ఆమెపై పుట్టెడాశలు పెట్టుకొన్న తండ్రి ఆమె లౌకిక కార్యాలపై గల విముఖతకు ఖిన్నుడయ్యాడు. తండ్రి అనేక విధాల తనయకు బోధింప నారంభించాడు. తండ్రి బోధనలను వెంగమాంబ పెడచెవిని బెట్టింది. తండ్రివలదన్నకొలదీ, ఆమె పట్టుదల అధికమైంది. కృష్ణనామం స్మరించడంతప్ప మరో ఆలోచన లేదు. నిరంతరం అదేధ్యాస. ఈ విషయం మనకొక పురాణకథను తలపింపజేస్తుంది. పూర్వం హిరణ్యకశిపు డనే రాక్షస రాజు తన శత్రువైన విష్ణువును స్మరించకూడదని శాసనంచేస్తే, అతని పుత్రుడు ప్రహ్లాదుడు అతిశయితంగా విష్ణువునే ధ్యానించినట్లయింది. ఆశలన్నీ నిరాశలుకాగా కుపితుడైన తండ్రి వెంగమాంబను గద్దించాడు. అంతటితో వదలక హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని బాధించినట్లు పుత్రికను అనేక హింసలకు గురిచేశాడు. ఆ బాధలను భరించలేక చక్కటి కంఠమెత్తి కోయిలవలె కృష్ణునిపై పాటలుకట్టి పాడుతూవుండేది. తండ్రికిది భరింపరాని అవమానంగా పరిణమించింది. హరికీర్తన మానుమని హెచ్చరించాడు. పుత్రిక లెక్కచేయక మరింత పట్టుదలతో కృష్ణ సంకీర్తనలో నిమగ్నురాలైంది. మూతిపై వాతలు వేయించాడు. అయినా వెంగమాంబ మానుకోలేదు.

తండ్రి ప్రయత్నాలు విఫలమయ్యాయి. లౌకిక జీవితం చవి చూపిస్తే ఆమె ఈ లోకంలోకి వస్తుందని ఆశించాడు. పెళ్లి గావించిన ప్రయోజకురాలవుతుందని భావించాడు. తగిన వరుని వెదకి తనయకు వివాహంచేశాడు. పెళ్లి తరువాత సంసారంలో ఆసక్తి చూపక మరింతగా విముఖురాలైంది. ఆమె గొప్ప భక్తురాలు. ఇహలోక సుఖాలు కోరలేదు. భగవద్భక్తి ప్రధానంగా భావించింది. భార్యసుఖాలకు దూరుడైన భర్త అదే దుఃఖంతో కొంతకాలం తరువాత మరణించాడు. శ్రీ వేంకటేశ్వరుడే తన భర్త అని నమ్మిన భక్తురాలు వెంగమాంబ మధురభక్తిలో నిమగ్నురాలైంది. భగవంతుడొక్కడే పురుషుడు, సమస్త ప్రాణులు స్త్రీలు - అన్నది మధుర భక్తి లక్షణం. అదే రీతిని ఈమె మహాభక్తురాలై తదేక ధ్యానంలో ఉండిపోయింది. ఆనాటి ఆచారం ప్రకారం భర్త మరణంతో కురులు తీయించాలని తండ్రి ప్రయత్నించాడు. కాని, ఆమె నిరాకరించింది. అయినా బంధువుల పట్టుదలతో ఆమె తల వెంట్రుకలను తండ్రి తీయించి వేశాడు. ఆమె చాల వగచి ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరుని సంస్మరించింది. కోనేరులో మునిగి తేలేసరికి తన తల వెంట్రుకలు యథాతథంగా వచ్చాయి! అందుకు అక్కడ గుమికూడిన వారు ఆమె భక్తిని మెచ్చుకొన్నారు. మహాభక్తురాలని ప్రశంసించారు. ఆమె నిత్య సువాసినిలా మెలగసాగింది. కాని, తుంటరులు అంతటితో తమ ఆగడాల్ని ఆపలేదు. ఆమె నేదోవిధంగా ఎగతాళి చేస్తూ హింసిస్తూనే ఉండేవారు. అయినా, ఆమె లెక్కచేసేదిగాదు.

ఒకానొక సందర్భంలో పురజనుల కోరికపై పుష్పగిరిమఠం పీఠాధిపతులు అయిన జగద్గురు శంకరాచార్యులే ఆమెను పరీక్షించారు. ఆ పరీక్షలో ఆమె మహాభక్తురాలుగా నెగ్గింది. అలాంటి భక్తురాలిని పరీక్షించ సాహసించినందుకు శంకరాచార్యులు

పశ్చాత్తాప పడ్డారు. ఆమెను క్షమాపణ కోరుకొన్నారు. తరిగొండ వాసులకు ఆమె మహాభక్తురాలని ప్రబోధం చేశారు. అయినప్పటికీ కొందరు కొంటె కోణంగులు ఆమె భక్తిని గమనించకయే అవమానించక మానలేదు. మూర్ఖులైనవారి అవమానాల్ని, హింసల్ని భరించలేక వెంగమాంబ తన ఇష్టదైవమైన శ్రీ వేంకటనాథుని నిలయమైన తిరుమల చేరిపోయింది. శేషజీవితాన్ని భగవంతునిపై గ్రంథరచనచేస్తూ గడిపివేసింది. ఆమె పరమ భక్తురాలు. కనుకనే శ్రీ వేంకటనాథుని పిలిచిన 'ఓ' యంటూ పలికేవాడట. ఆమె సేవలకు భగవంతుడు కట్టుబడిపోయాడు. ఆమె యింట ఎల్ల వేళలా ప్రత్యక్షమయ్యేవాడు. మరి భగవంతుడు భక్తుల కధీనుడు గదా! మహాభక్తులకు సాధ్యం కాని దేదీ లేదని వెంగమాంబ జీవితం నిరూపిస్తుంది. అందుకు ఓ చక్కటి ఐతిహ్యం ఉంది. ఒకానొక దినం తలనొప్పితో వెంగమాంబ బాధపడుతూంది. శ్రీ వేంకటేశ్వరుడు భక్తురాలి శిరోవేదనను గమనించాడు. అంతకుముందే భక్తులు సమర్పించిన చిత్తూరు జిల్లాలోని నారాయణవనంలో నేసిన సరిగంచు ధోవతి చెరగు చించి నొప్పి తగ్గడానికి ఆవిడ తలకు గట్టిగాకట్టి వెళ్లిపోయాడు. మరుదినం యథారీతిగా దేవునికి నైవేద్యం తీసుకొని వెళ్లుతూ పళ్లెరంపై ఆ సరిగంచు గుడ్డను కప్పుకొని వెళ్లింది వెంగమాంబ. ఆ సమయానికి సరిగంచు ధోవతి చెరగు చిరిగిన సంగతి గమనించిన అర్చకులు దొంగకోసం గాలిస్తున్నారు. వెంగమాంబ తెచ్చిన గుడ్డను అర్చకులు చూడగా దానికి సరిపోయింది. ఆమే దొంగ-అని ఆమెను శిక్షించాలనీ, ప్రయత్నిస్తున్నారు. ఆమె తన కేమీ తెలియదని చెప్పింది. ఇంతలో ఓ అర్చకుడు కడుపునొప్పితో బాధపడుతూండగా గమనించి అర్చకులలోని పెద్ద వారిని వారించి, అతని నొప్పి తగ్గిపోతే ఆమె నిర్దోషి అని భావిద్దామని భగవంతుని ప్రార్థించాడట. వెంటనే అతడు హాయిగా, ఆనందంగా లేచికూర్చున్నాడట! అంత

వెంగమాంబను నిర్దోషి అనీ, మహాభక్తురాలనీ గమనించారు అర్చకులు. ఆమె పేర హారతి ఇచ్చారు. అప్పటినుంచి వెంగమాంబ హారతి అంటూ జరుగుతూవుంటుందని విని కిడి.

ఈ పరమ భక్తురాలు అనేక గ్రంథాలు రచించింది. అవి అన్నీ భగవంతునిమీద అత్యంతభక్తితో రచించినవే. పొట్టనింపుకోవడానికి మాత్రంకాదు. అంతేగాక రాజులను సైతమాశ్రయించలేదు. రాజులకు రాజైన భగవంతుని ఆశ్రయించింది. ఏడుకొండలపై వెలసిన శ్రీ వేంకటాచలపతినే ఆశ్రయించింది. మధుర భక్తితో అతని గుణగణాలను గానంచేసింది. వైష్ణవ మతపరమైన రచనలే ఎక్కువగా చేసినట్లు తెలుస్తున్నది. ఆమె రచనలు -

1. తరిగొండ నృసింహ శతకము, 2. నరసింహ విలాస కథ, 3. శివనాటకము, 4. రాజయోగసారము, 5. కృష్ణనాటకము, 6. పారిజాతాపహరణ సత్కృతి (యక్షగానము),7. రమా పరిణయము (పెండ్లి పాట), 8. చెంచు నాటకము (యక్షగానము), 9. కృష్ణ మంజరి, 10. శ్రీ రుక్మిణీ నాటకము, 11. గోపికా నాటకము, 12. ద్విపద భాగవతము, 13. వేంకటాచల మాహాత్మ్యము, 14. అష్టాంగ యోగ సారము, 15. జలక్రీడా విలాసము, 16. ముక్తికాంతా విలాసము, 17. వాసిష్ఠ రామాయణము.

వీటిలో చాలావరకు యక్షగానాలు, పదాలు ఉన్నాయి. పైపెచ్చు ఈ కృతులన్నీ ఈనాడు మనకు లభించడంలేదు. వెంగమాంబ రచనల్లో ఈనాడు మనకు రాజయోగసారము, వేంకటాచల మహాత్మ్యము, విష్ణు పారిజాత యక్షగానము, ద్విపద భాగవతము మాత్రమే దొరకుతాయి. ఇంకా తిరుమల వేంకటరమణునిపై రచించిన ఎన్నోపాట లున్నాయి. ఇవిగాక తక్కిన

రచనలేమయ్యాయో తెలియదు. బహుశః వాటిని పరిరక్షించేవారు లేక కాలగర్భంలో కలిసిపోయి ఉంటాయి.

*"నా చిన్ననాట నోనామాలనైన*
*నాచార్యులెవరు నా కానతీలేదు*
*ఇఁక నేను చెప్పుదు నెట్టులో, వాణి*
*నకలంకుడై జిహ్వాయందుంచె గురుడు"* అని

వినయంగా చెప్పుకొంది వెంగమాంబ. ఈమె రచనల్లో అటనట వ్యాకరణానికి లొంగని పదా లున్నమాట వాస్తవమే. అయితే, ఆమె కవిత చాలవరకు పద కవిత. పదకవితలన్నీ చాలవరకు వ్యాకరణానికి లొంగనివే. అంటే వాటిలో వాడుక రూపాలు కోకొల్లలు. అదేరీతిగా వెంగమాంబ కవితల్లోను వాడుక రూపా లున్న వనడం సముచితం. అంతమాత్రంచేత ఆమె కవితకు కలిగిన దోషమేమీ లేదు. వాస్తవానికి సందర్భోచితంగా వాడుక పదమైనా, ప్రయోగించినప్పుడే చక్కటి సందర్భాన్నిస్తుంది. లేని పక్షంలో సముచితంగా ఉండదు.

కందుకూరి వీరేశలింగం పంతులు మొదలుకొని ఈనాటి విమర్శకులదాకా ఎందరో ఆవిడ కవితను వేనోళ్ల పొగడియున్నారు.

*"వినరయ్య కవులార! విద్వాంసులార!*
*వినరయ్య మీరెల్ల విమలాత్ములార!*
*ఘనయతిప్రాస సంగతులు నే నెఱుఁగ*
*వరుస నాక్షేపింప వలదు సత్కృపను"* - అని చెప్పడం

ఆమె వినయానికి చక్కటి నిదర్శనం.

**ఆమె శైలికి ఉదాహరణ. భాగవత ద్విపదలో ధారాశుద్ధితో కూడిన ఆమె శైలిని చవి చూద్దాము :**

"నిలునిలు మర్జున! నీ విపుడతని
చలము పెంపున నేల చంపబూనెదవు?
పదటు దనమున నీ పాపాత్ముఁ డకట!
చెదరక నిదురించు శిశువుల; జంపె
నట్టి క్రూరుని విప్రు డనుచు నీకింత

పట్టి చంపుటగాదు" - అని హృదయానికి హత్తుకొనేలా వర్ణించగలదు. ఇంకా, ఆమెపాటలన్నీ మనోహరమై మన మనస్సులను చూరగొంటాయి.

ఇలాగా తెలుగులో ఉత్తమ కవయిత్రియై పరమ భక్తురాలై యెనభై యేడేళ్ల సంపూర్ణ జీవనం గడపి భగవదైక్యం పొందింది వెంగమాంబ!

# తరిగొండ వెంగమాంబ యక్షగానాలు - ఒక సమీక్ష

-ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

"శ్రీకాంతాత్మ సరోజ చండ కిరణం శీతాంశు బింబాననం
శ్రీ కంఠాబ్జజ సన్నుతాంఘ్రి కమలం చిన్మాత్ర మప్రాకృతమ్।
లోకాతీత మనేక గోపయువతీలోలం పరం సర్వగం
స్వాకారం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥

ఉల్లాస పల్లవిత పాలిత సప్తలోకీ
నిర్వాహ కోరకిత నేమ కటాక్ష లీలామ్।
శేషాద్రి హర్మ్యతల మంగళ దీపరేఖాం
శ్రీవేంకటేశ మహిషీం శ్రియ మాశ్రయామః॥

ఈశానాం జగతోఽస్య వేంకటపతేః విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థల నిత్యవాస రసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్।
పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్॥"

సాహితీ రసజ్ఞులయిన మహాశయులారా! సోదరీమణులారా!

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఆంధ్ర వాఙ్మయ ప్రపంచంలో విశిష్టమయిన స్థానాన్ని అలంకరించిన మహాకవయిత్రి. ఆంధ్రమహాకవుల్లో బమ్మెరపోతన, వేంకటేశ్వరుని భక్తబృందంలో తాళ్ళపాక అన్నమాచార్యులు, శ్రీకృష్ణ భక్తుల్లో మీరాబాయి - మొదలయిన సారస్వతమూర్తులతో సరిపోల్చి ప్రస్తుతింపదగిన ఆధ్యాత్మిక సాహితీమూర్తి, భక్తకవయిత్రి తరిగొండ వెంగమాంబ.

క్రీ.శ. 1730లో రాయలసీమయందలి తరిగొండ గ్రామంలో అవతరించిన ఈ కవయిత్రి శతకం, యక్షగానం,

ద్విపదకావ్యం, పద్యప్రబంధం, తత్త్వకీర్తనలు - ఇత్యాది విభిన్న రచనా ప్రక్రియల్లో మొత్తం పదునెన్మిది గ్రంథాలను రచించి, 18వ శతాబ్దిలో ఆవిర్భవించిన ఆంధ్రవాఙ్మయానికి ఎంతో పెంపును, పరిపుష్టిని ప్రసాదించింది.

లక్ష్మీనృసింహక్షేత్రమయిన తరిగొండ గ్రామం, శ్రీనివాసుడు అధివసించియున్న తిరుమల పుణ్యక్షేత్రం - ఈ రెండూ వెంగమాంబ సాహితీవ్యాసంగానికి ప్రధాన రంగాలై ప్రశస్తి కెక్కాయి. ఈ కవయిత్రి తరిగొండలో ఉన్న కాలంలో అయిదు గ్రంథాలను, తిరుమలక్షేత్రం చేరిన తరువాత పదమూడు గ్రంథాలను రచించింది.

వెంగమాంబ రచించిన పదునెనిమిది గ్రంథాల్లో సరిగ్గా సగం - అనగా తొమ్మిది యక్షగానాలు. అవి నృసింహవిలాసం, శివనాటకం, బాలకృష్ణనాటకం, విష్ణుపారిజాతం, చెంచునాటకం, రుక్మిణీనాటకం, గోపికా నాటకం, జలక్రీడా విలాసం, ముక్తికాంతా విలాసం. ఈ తొమ్మిది యక్షగానాల్లో మొదటి మూడింటిని - అనగా నృసింహవిలాసం, శివనాటకం, బాలకృష్ణనాటకం- అనే మూడు యక్షగానాలను వెంగమాంబ తరిగొండలో రచించింది. విష్ణుపారిజాతం మొదలుకొని ముక్తికాంతావిలాసం వరకు గల ఆరు యక్షగానాలను తిరుమలలో రచించింది.

**యక్షగాన ప్రక్రియ ఉత్పత్తి:**

అసలు, 'యక్షగాన' మంటే ఏమిటి?- అనే విషయం ఈ సందర్భంలో పరిశీలింపదగివుంది. 'యక్షగాన' మనేది ప్రముఖంగా గేయ ప్రధానమయిన రచన. "యక్షగాన" మనే పేరులోనే ఈ అభిప్రాయం ఇమిడివుంది. ఇది అచ్చమైన, తెలుగుదేశీయమైన రచనా ప్రక్రియ. ఈ ప్రక్రియ పురాతన కాలంలో

ఆలయ ప్రాంగణాల్లో అవతరించింది. ప్రాచీన కాలంలో శ్రీశైలాది శివక్షేత్రాల్లోనూ, అహోబలాది విష్ణుక్షేత్రాల్లోనూ కళాకారులు కొందరు పురాణాలలో పేర్కొనబడిన యక్షులయొక్క చిత్ర, విచిత్ర వేషాలను ధరించి, మహాశివరాత్రి, నృసింహజయంతి వంటి పర్వదినాల్లో శివలీలలనూ, విష్ణుగాథలనూ పాటలుగా సమకూర్చి, ఆయా దేవతల ఉత్సవమూర్తుల యెదుట భక్తిప్రపత్తులతో అభినయిస్తూ గానంచేస్తూ వుండేవారు. ఆవిధంగా భగవంతుణ్ణి ఆరాధించే ఉద్దేశంతో ఆవిర్భవించిన ఆ పాటల ప్రదర్శనలు అచ్చట చేరివుండిన ప్రజానీకానికి ఉత్కృష్టమయిన రసానుభూతిని ప్రసాదిస్తూ, ఆనందింపచేస్తూవుండేవి.

ఆవిధంగా, ఆదిలో ఆయాదేవతల ఆరాధనకై ఉద్దేశించిన 'యక్షుల' గాన ప్రదర్శనలు క్రమేణ శిష్టకవులను ఆకర్షించాయి. తత్ఫలితంగా తెలుగులో యక్షగానరచన రూపుదాల్చింది. అప్పటినుండీ - అంటే క్రీ.శ. 14 వ శతాబ్దినుండే యక్షగాన ప్రక్రియ సమాజంలోని అబాలగోపాలాన్ని అలరిస్తూ, నిత్యనూతనంగా కొనసాగుతూవచ్చింది. ఆలా కొనసాగుతూవచ్చిన యక్షగానవాఙ్మయశాఖ క్రీ.శ. 18వ శతాబ్ది నాటికి పరిపూర్ణ వికాసాన్ని పొందింది. ఈ పరిపూర్ణ వికాసవైభవాన్ని తరిగొండ వెంగమాంబ సృజించిన యక్షగాన కృతులన్నీ చక్కగా చాటుతూవున్నాయి.

అక్షరాల రూపంలో సరస్వతిని సాక్షాత్కరింపజేసికొన్న 'కవితా తపస్విని' యైన తరిగొండ వెంగమాంబ వాఙ్మయజీవితం యక్షగాన రచనతోనే ప్రారంభమయింది. ఈ రచనావ్యాసంగం ఆమె సహస్ర చంద్ర దర్శనం కావించేంతదాక - అనగా

ఇంచుమించు 84 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ విస్తరిల్లినట్లు తెలుస్తూవుంది.

**1. నృసింహ విలాసము:**

వెంగమాంబ సృష్టించిన ఒక్కొక్క యక్షగానం ఒక రసమయ రమణీయ రూపకం. వాటిలో మొదటిది 'నృసింహవిలాసం'. ఇది వెంగమాంబ బాల్యరచన. ఇందలి ఇతివృత్తం ప్రహ్లాదుని చరిత్ర. ఇది ఈనాడు అలభ్యం. వెంగమ్మ తరిగొండలో రచించిన రెండవ యక్షగానం 'శివనాటకం'. 'శివవిలాస' మని దీనికి నామాంతరం. 'శివపారిజాత' మనే పేరుకూడ వాడుకలో ఉంది.

**2. శివనాటకము :**

శివనాటకంలోని కథ సంగ్రహంగా ఇది: త్రిలోకసంచారియైన నారదుడు సూర్యునివల్ల అమూల్యమయిన ఒక రత్నాలహారాన్ని పొంది, కైలాస పట్టణానికి వస్తాడు. పార్వతీదేవి మందిరంలో ఉన్న పరమశివునికి ఆ రత్నహారాన్ని భక్తితో సమర్పిస్తాడు. పరమేశ్వరుడు ఆ హారాన్ని పార్వతికి బహూకరిస్తాడు. ఈ వృత్తాంతం తెలిసిన గంగాదేవి రోషపరవశ అవుతుంది; తన ప్రభావంచేత లోకాలన్నింటిలోని జలాలను ఉపసంహరిస్తుంది. తరిగొండ నృసింహుని పత్నియైన లక్ష్మీదేవి, భర్త ఆనతి ననుసరించి ఎఱుకత వేషాన్ని ధరించి, కైలాసానికి వస్తుంది. గంగాదేవికి ఎఱుక చెపుతుంది. 'ఓ గంగాదేవీ! అతిత్వరలో సదాశివుడు నీమందిరానికి విచ్చేసి, నీకోరిక తీర్చగలడు' - అని చెప్పి, ఊరడించి వెళ్తుంది. గంగాదేవి ఆగ్రహంవల్ల సృష్టిలో ఏర్పడిన ఉపద్రవాన్ని గుర్తించిన బ్రహ్మదేవుడు కైలాసానికి వస్తాడు. నారదు డొసగిన రత్నహారంకన్నా మిన్న అయిన ఒక మాణిక్య హారాన్ని శంకరునికి సమర్పిస్తాడు.

శంకరుడు ఆ మాణిక్య హారంతో గంగాదేవిని సమాధానపరుస్తాడు. అనంతరం అంతటా సుఖ,శాంతులు నెలకొంటాయి. గంగా, గౌరీ సమేతుడయిన సదాశివునికి చెలులు మంగళం ఆలాపించటంతో నాటకం సుఖాంతమవుతుంది.

ఈ యక్షగాన నాటకం యొక్క కమనీయశైలికి ఒక ఉదాహరణ:

తన పతియైన తరిగొండ నృసింహుని ఆజ్ఞననుసరించి, ఎఱుకత వేషాన్ని సవదరించి, కైలాస నగరంలోని గంగాదేవీ భవనానికి విచ్చేస్తున్న లక్ష్మీదేవి యొక్క మనోజ్ఞ వేషవర్ణన గల ఈ గేయం ఈ సందర్భంలో చిత్తగింప దగివుంది:

*"వచ్చె నెఱుకో! యెఱుక! యనుచును-వాడవాడల వెంటనూ*
*హెచ్చుగా మందాకినికి తా-నెఱుక చెప్పెద ననుచునూ*
*ఘలుఘలున పాదంబులను చిఱు-గజ్జె లందెలు మ్రోయగా*
*చెలువు మీఱఁగ పసిడిచెఱఁగుల - చీర కుచ్చులు జారఁగా*
*అలరు చందురుకావిరవికెయు - అందముగ రాణించఁగా*
*వెలయు ధళ ధళ వెలుగు భూషణ-ములును వగవగ మించఁగా*

*ప్రమదమలరఁగ విడెము సేయుచు,-బాలకుని ముద్దాడుచూ*
*సుమహితముగా బుట్టి నెత్తిన-సూటి దప్పక నిలుపుచూ*
*క్రమముగా తన కెదురు వచ్చిన-కమలనేత్రల జూచుచూ*
*రమణులారా! యెఱుక చెప్పెద-రండురండని పిలుచుచూ*

*కర కమలమునఁ దనరి తగు బం-గరు గిలక వాయింపుచూ*
*సురుచిరముగా కొడుకుఁ జూచుచు-జోలపాటలు పాడుచూ*
*సరవి పోరటు మాన్పుచును, నిజ-జాతి సుద్దులు చెప్పుచూ*
*మురిపెముగ తరిగొండపుర నర-హరికి శరణని మ్రొక్కుచూ*
*వచ్చె నెఱుకో! యెఱుక! యనుచును-వాడవాడల వెంటనూ*
*హెచ్చుగా మందాకినికి తా-నెఱుక చెప్పెద ననుచునూ"*

**3. బాలకృష్ణనాటకము :**

వెంగమాంబ రచించిన మూడవ యక్షగానం 'బాలకృష్ణ నాటకం.' దీనికే 'కృష్ణనాటక'మని కూడా వ్యవహారం. శ్రీకృష్ణుని వేణుగాన మాధుర్యం చేత ఆకర్షింపబడి, వ్రేపల్లెలోని గోపికలు బృందావనంలోని ఆ వేణుగానలోలుని వద్దకు పరువెత్తి వెళ్ళడం- అనే కథాంశం భాగవతం దశమస్కంధంలో ఉంది. వెంగమాంబ ఆ కథాంశంయొక్క ఆధారంతో స్వతంత్రంగా, సరసమనోహరంగా ఈ బాలకృష్ణనాటకాన్ని తీర్చిదిద్దింది. ఈ నాటకంలో గోపికలు శ్రీకృష్ణుణ్ణి స్తుతించే ఘట్టంలోని దరువు ఈ కవయిత్రియొక్క కవితామాధుర్యానికి ఒక చక్కని ఉదాహరణ:

*"శరణు శరణు త్రిలోకనాయక!-శరణు పురహర సాయకా!*
*శరణు ముక్తిఫలప్రదాయక!-శరణు భక్త సహాయకా!*
*శరణు యోగి మనోబ్జ బంభర!-శరణు శరణు చిదంబరా!*
*శరణు ప్రవిమల కాంచనాంబర!-శరణు మాయాడంబరా!*
*శరణు శ్రీతరిగొండమందిర!-శరణు వత్సధృతేందిరా!*
*శరణు మోహన దివ్యసుందర!-శరణు దరనిభ కంధరా!*
*శరణు శరణు త్రిలోకనాయక!-శరణు పురహర సాయకా!*
*శరణు ముక్తిఫల ప్రదాయక!-శరణు భక్త సహాయకా!"*

**4.విష్ణుపారిజాతము :**

వెంగమాంబ తిరుమలక్షేత్రం చేరిన పిమ్మట రచించిన కృతి 'విష్ణుపారిజాతం'. శ్రీకృష్ణుడు సత్యభామను సంతోషింపచేయటానికై దేవలోకంలోని ఇంద్రుని నందనవనంలోగల పారిజాత కల్పతరువును తీసికొని రావటం ఇందలి ప్రధాన కథ. ఈ నాటకంలో సదాశివుని ఆజ్ఞ ననుసరించి దేవేంద్రుడే స్వయంగా

పారిజాతవృక్షాన్ని శ్రీకృష్ణునికి భక్తి పూర్వకంగా సమర్పించినట్లు ఈ కవయిత్రి కథాంశాన్ని కల్పించింది. ఈ కల్పన ద్వారా వెంగమాంబ తన ఇష్టదైవమైన శ్రీకృష్ణునికి పారిజాతవృక్షాన్ని అపహరించిన దోషాన్ని నివారింపజేసింది.

స్వగ్రామంలో ఎన్నో కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొని తిరుమలక్షేత్రం చేరిన వెంగమాంబకు నందనవనాల నడుమ ఆనంద నిలయంలో ప్రకాశిస్తూవున్న శ్రీనివాసుడు ఆదుకొని రక్షించే ఆశ్రిత పారిజాతంగా గోచరించాడు! అందువల్ల, ఈ కథానాయకుడైన శ్రీకృష్ణునికీ, వేంకటేశ్వరునికీ అభేదాన్ని పాటిస్తూ, కవయిత్రి ఈ యక్షగానకథ చాలవరకు ఉద్యానవనాల్లో జరిగినట్లు చిత్రించింది. ఆకాలంలో తిరుమల ఆలయంలో అమలులో వుండిన చారిత్రక విశేషాలు కొన్ని ఈ నాటకంలో ప్రతిబింబించి వున్నాయి.

కూచిపూడి సిద్ధేంద్రయోగి రచించిన భామాకలాప ప్రదర్శనలపై కూడా ఈ విష్ణుపారిజాత యక్షగానప్రభావం ప్రసరించివుండటం ఈ సందర్భంలో ఎన్నదగిన ఒక సారస్వత విశేషం!

ఈ యక్షగాన నాటకం వెంగమాంబ రచించిన యక్షగానాల్లోనేగాక, యావదాంధ్ర యక్షగాన వాఙ్మయం అంతటిలోనూ మకుట మణిగా రచనా సౌందర్యంతో రాణిస్తూవుంది. వెంగమాంబ తరిగొండలో రచించిన యక్షగానాలకూ, తిరుమల చేరిన పిదప రచించిన యక్షగానాలకూ ఒక ముఖ్య భేదం స్పష్టంగా గోచరిస్తూవుంది. అదేమిటంటే,

ఈ కవయిత్రి తిరుమలక్షేత్రంలో రచించిన యక్షగానాల ఇష్టదేవతాప్రార్థనలలో తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనల ప్రభావం.

వెంగమాంబ తిరుమల చేరుకొన్న కొన్నాళ్లకు తాళ్ళపాక అన్నమాచార్యుల వంశీయులు తమయింటిలో ప్రత్యేకంగా ఉన్న ఒక భాగాన్ని ఆమె నివసించేందుకు ఆదరంతో ఆహ్వానించి ఇచ్చినారు. ఈ కారణంచేత వెంగమాంబకు తాళ్ళపాక అన్నమాచార్యులు, తద్వంశీయులు రచించిన రచనలను పరిశీలించే సదవకాశం దైవికంగా లభించింది.

అందువల్ల, అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనల్లో ముఖ్యమైన వాటిని (తోడయ మంగళంలోని కీర్తనలను) తన యక్షగాన నాటకాల్లో అనుసరించి రచించింది.
ఉదాహరణకు:

*"నారాయణతే నమో నమో భవ నారద సన్నుత నమోనమో" - అనే పల్లవితోగూడిన సంకీర్తనను విష్ణుపారిజాతంలో -*

*"నందాత్మజ! తే నమోనమో సానంద హృదయతే నమో" ఇత్యాది గేయంలో ఇష్టదేవతాప్రార్థనలో అనుసరించింది.*

విష్ణుపారిజాతానికి సంబంధించిన ఇంకొక విశేష మేమంటే - ఇందులో రుక్మిణీ సత్యభామ లిద్దరి వివాహ వృత్తాంతాలతోపాటు, తక్కిన జాంబవతి, మిత్రవింద మొదలయిన ఆరుగురు భార్యల వృత్తాంతాలను ఇందులో సంగ్రహంగా ఆయా పాత్రల ముఖతః వివరించివుండటం. వక్రభాషిణి అనే ఉద్యానవన పాలకురాలు తోటలో తన కెదురుపడిన శ్రీకృష్ణుని భార్యలను ప్రశ్నించి, వారివారి వివాహవృత్తాంతాలను వారిచేత చెప్పించింది.

ఈ కవయిత్రి లోకానుభవానికీ, కవితాచమత్కృతికీ నిదర్శనంగా ఈ నాటకంలో సత్యభామ ఎఱుకతతో సంభాషించే సన్నివేశం పరికింప దగివుంది. ఇందులో సరస్వతీదేవియే ఎఱుకత వేషంలో సత్యభామవద్దకు వస్తుంది. ఆ యిరువురి నడుమ ఇలాగ సంభాషణ సాగింది:

సత్యభామ: *ఏమె ఓ కొరవంజి! యెందుండి వచ్చితివి?*
*ఏమి నీ పేరు నా కెఱిగింపవమ్మా!*

ఎఱుకత: *అలపైడికొండనుండి ఇచ్చటికి వచ్చితినే!*
*పలుకు సింగి అందురే భామ! నాపేరు.*

సత్యభామ: *కంజాక్షి! నీ పేరు ఘనతరంబుగ వింటి*
*మంజు భాషిణిరో! నీ మగని పేరేమే?*

ఎఱుకత: *చెలఁగి యీ పేరంటె చెప్ప సిగ్గానైన*
*నలువయిన సింగఁడే నామగని పేరు.*

సత్యభామ: *అత్తమామల పేరు లనువందఁ జెప్పవే!*
*మత్తేభయాన! విన మనసు బుట్టినది.*

ఎఱుకత: *చెలువ తరిగొండ నరసింగఁడే మామామ*
*మలయు కలుముల సింగి మా యత్త పేరు.*

సత్యభామ: *కొడుకు లెందరె నీకు ఓ కోమలాంగి?*

ఎఱుకత: *ఎందరో లెక్క పెట్టలే నిందువదన!*

సత్యభామ: *ఇంతి యీ పట్టి పేరేమి చెప్పవమ్మ?*

ఎఱుకత: *పడతి! విను చివ్వఁడే బుడుత పేరు.*

సత్యభామ: *సుదతి! నీ వెన్ని దేశముల్ చూచినావు?*
*తెలుపు నీవని పలుకగా జలజనయన*

చాల ముదమంది సకల దేశముల పేర్లు
చెలువ మలరఁగ తా నష్ట చెప్పఁ దొడఁగె.

ఎఱుకత: వివిధ దేశంబులు వింతగాఁ దిరిగి
వివిధంబులైనట్టి విద్యలచేత

పరఁగ అందరి నోళ్ళఁ బడి విజృంభించి
ఇరవుగా నే రచ్చ కెక్కియుండుదును;

కాన మా యత్తయౌ కలుముల సింగి
నానా విధంబుల నను పరీక్షించు

నేనున్న చోటుల నిలువక తిరుగు
తానున్న చోట్లకే తరుణి నన్ పిలుచు

నేను తానొక దిక్కు నిలుచుట అరుదు
పూని నిల్చిన మహాద్భుతముగా నుండు.

**౭. చెంచు నాటకము :**

తిరుమలలో అక్కారాం వెంకటరామదీక్షితులనే అర్చకుల పెద్ద వెంగమాంబకు ఇబ్బందులు కలిగిస్తూవుండినాడు. అందుచేత ఆమె శ్రీస్వామివారి అనుమతితో తుంబురుకోన అనే దట్టమైన అరణ్యప్రాంతాన్ని చేరుకొన్నది. అచ్చటి ఒక కొండ గుహలో 5,6 సంవత్సరాలు తీవ్రంగా తపస్సు చేసింది. ఆ సమయంలో ఆ ప్రాంతాల్లో నివసిస్తూవున్న చెంచువారి ఆచారవ్యవహారాలను ఆధారంచేసికొని, చెంచునాటక మనే యక్షగానాన్ని రచించింది.

చెంచునాటకంలో కథానాయికయైన చెంచిత తమవారు నివసించేటటువంటి తుంబురుకోనలో విహరించటానికి విచ్చేసే వేంకటేశ్వరుని స్వరూపాన్ని తిరుమల దేవాలయంలోనున్న ద్వారపాలకు లైన జయ విజయులతో ఇలా వర్ణిస్తుంది:

"వినరన్న నేఁజూచు వేంకటేశ్వరుఁడు
మినమినమని చాల మెఱిసేటిదేమొ

గట్టిగా తలమీఁద గదియించి, దాని
చుట్టు పూదండలు చుట్టుకొన్నాఁడు.

లలి మించు మొసలిపిల్లలవంటివేమొ
తళుకుగా చెవులకు తగిలించినాఁడు.

పచ్చపచ్చటిదేమొ బహుళానమేన
అచ్చుగా అందందు అతికించినాఁడు.

గుండూటి దొక్కటి కూసేటి దొకటి
రెండుచేతులను ధరించియుండాఁడు.

ఎడమ చేతను కత్తి ఇరవందఁ బట్టి
కుడిచేత ధరణిపై గుఱిబెట్టినాఁడు.

నల్లని మెయిలు వర్ణము గలవాఁడు
తెల్లనై తగు పట్టె తిరుమణివాఁడు

కలికి చూపుల గొప్ప కన్నులవాఁడు
మొలక నవ్వుల వాఁడు ముద్దులవాఁడు

పసపుఁ బూసిన పాత పై హొయల్మీఱ
విసువక వలెవాటు వేసి వేడుకను

ప్రాకటంబుగ నొక పక్షిపై నెక్కి
మా కోనకును వచ్చు మమ్మేల్ల మెచ్చు

నలువొప్ప తరిగొండ నరసింహుఁడగుచు
వెలయు మమ్మేలు ఆ వేంకటేశ్వరుఁడు."

ఈ రీతిగా ఈ వేంకటేశ్వర స్వరూప వర్ణన అత్యంత సహజంగా అలరారుతూ, భాషలోనూ, భావంలోనూ చెంచెత గోపికల జలక్రీడలవరకు గల కథలోని ముఖ్యగాథలను స్వీకరించి కవయిత్రి మనోహరశైలిలో మలిచిన తీరు నిరుపమానమై విలసిల్లుతున్నది.

చెఱసాలలో అవతరించిన శ్రీకృష్ణుని దివ్యమంగళ స్వరూపాన్ని ఈ భక్తకవయిత్రి ఇరువదియైదు ద్విపదలలో స్వతంత్రంగా, అద్భుత రమణీయంగా ఆవిష్కరించింది:

### శ్రీకృష్ణుని దివ్య మంగళ స్వరూపము

"అపుడు పరబ్రహ్మ-మైన విష్ణుండు
కపట రాక్షస గజ-కంఠీరవుండు

శ్రీ పన్నగాచల - శిఖరవాసుండు
నాపాలి తరిగొండ - నారసింహుండు

గణనాధిక ప్రభా-కలితమై, దివ్య
మణిమయంబగు హేమ-మకుటంబుతోడ,

అలకల నొప్పు పా-లార్ధంబుతోడఁ,
దళుకైన భ్రూలతా - ద్వంద్వంబుతోడ,

విమలావృత కటాక్ష - వీక్షలతోడఁ,
గమనీయమగు - టెక్కుగల నాసతోడ,

దళమైన కెంజాయఁ - దగు మోవితోడ,
ధళ ధళ వెలిఁగెడి - దంతాళితోడ,

అందంబు గులికించు - హాసంబుతోడ,
నైందవ బింబోప - మాస్యంబుతోడ,

నురురత్న కుండల - యుగళంబుతోడ
సిరుల జొంపము లీను - చెక్కిళ్లతోడ,

దర, సుదర్శన గదా, - తామరసముల
భరియించు పటు చతు - ర్బాహులతోడ,

ఘన కౌస్తు భాంచిత - కంఠంబుతోడ,
వనమాలికా హార - వారంబుతోడ,

వనధిజ కిరవైన - వక్షంబుతోడ,
వనద సంకాశమౌ - వర్ణంబుతోడ,

నపరిమితాబ్జ భ-వాండంబు లొప్ప
నుపమింప సూక్ష్మమౌ - ను దరంబుతోడ,

ఘనుఁడైన హాటక - గర్భున కనిశ
మునికి యౌ నాభీ ప-యోజంబుతోడ,

నా దిత్య నిభ మేఖ-లావృత భవ్య
దేదీప్యమాన దీ-ధితి కటితోడ,

భూరి తటిల్లతా - పుంజ విస్ఫూర్తి
వారించు కాంచన - వసనంబుతోడ,

మరకత స్తంభ స-మానమై చాల
నొఱపు గల్గిన యూరు - యుగళంబుతోడ,

వారిధి కన్యాకా - వర హస్త యుగళ
సారోపచరిత స-జ్జంఘులతోడ,

నార్త రక్షణ బిరు - దాంకంబు లగుచు
స్ఫూర్తితో మ్రోయు నూ-పురములతోడ,

నిగమాంత వీథుల - నిరతంబుఁ దిరుగఁ
దగియున్న పాదప-ద్మంబులతోడ,

మొనసి వామాంగుష్ఠ-మున సంతతంబు
దనరుచున్నట్టి మం-దాకినితోడ,

శతకోటి మన్మథ - సౌందర్య ధుర్య
వితత విభ్రమ మూర్తి - విభవంబుతోడ,

నారూఢకోటి చం-ద్రార్క హుతాశ
తారా తటిత్ప్రభా - తతులకు మూల

కారణమైన ప్ర-కాశంబుతోడ
ధీరుఁడై దేవకీ - దేవి గర్భమున

మొనసి నభోమాస-మునఁ గృష్ణపక్ష
మున నష్టమి నిశీథ-మునను రోహిణిని

సగము రాతిరి వేళ - సంపూర్ణ కళల
జగదీశుఁ డుదయించె - జగతీ తలమున."

ఒక్క మాటలో ఈ యక్షగానంలోని ప్రతి సన్నివేశమూ పరమ ఆహ్లాదదాయకంగా విరాజిల్లుతూవున్నది.

**బాల భాష:**

తరిగొండ వెంగమాంబ జలక్రీడా విలాసయక్షగానంలో భాషకు సంబంధించిన ఒక వినూతనత్వాన్ని ప్రవేశపెట్టింది. అదేమంటే బాలకృష్ణుణ్ణి ఆ వయస్సుకు తగిన బాలభాషలో

మాట్లాడించడం. సాధారణంగా చిన్నపిల్లలు మాట్లాడే రీతిలో తొక్కుపలుకులతో (వచ్చీరాని బాలభాషతో) బలరామకృష్ణులతో మాట్లాడించటం ఇందులో భాషాపరంగా గోచరించే ఒక విన్నూత్న ప్రక్రియ.

**9. ముక్తికాంతా విలాసము :**

వెంగమాంబ వెలయించిన యక్షగానాల్లో చివరిది ముక్తికాంతా విలాసం. ఇందలి విషయం వేదాంతం. జగదీశ్వరుడు, ముక్తికాంత, జ్ఞానకాంత, భక్తికాంత, మాయాశక్తి, వైరాగ్యశక్తి మున్నగువారు ఇందలి పాత్రలు. తాత్త్విక విషయాలను సామాన్యజనులకు సైతం బోధపడేట్లు సరళమైన భాషలో సులభంగా, సుందరంగా రచించటంలో ఈ కవయిత్రీమతల్లి సిద్ధహస్తురాలని ఈ యక్షగానం నిరూపిస్తున్నది.

తరిగొండ లక్ష్మీనృసింహుడు జ్ఞానస్వరూపుడైన యోగి; తిరుపతి వేంకటేశ్వరుడు భక్తిప్రధానుడైన భోగి. ఈ యిరువురికీ అభిన్నుడైన జగదీశ్వరుడు ముక్తికాంతను కూడుకొనటంద్వారా భక్తి, జ్ఞానాల సమన్వయమే ముక్తి-అనే ఆధ్యాత్మిక సందేశం ఇందులో వెల్లడవుతున్నది.

**తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనల బాణీల అనుసరణ:**

ఇదే వ్యాసంలో ఇంతకుముందు పేర్కొనినట్లు వెంగమాంబ అన్నమాచార్యుల సంకీర్తనల బాణీలను తమ యక్షగానాల్లో ఇష్టదేవతా ప్రార్థనాదికంలో చక్కగా అనుసరించింది. అయితే, అన్నమయ్యలాగా అధ్యాత్మ సంకీర్తనలనూ, శృంగార సంకీర్తనలనూ రచింపజాలిన మానసిక పరిణతి, భావుకత ఈ కవయిత్రికి ఉండినప్పటికీ, అలాంటి సంకీర్తనలను ప్రత్యేకంగా రచింపక పోవటానికి కారణాన్ని ఈ క్రింది విధంగా ఊహింపవచ్చు:-

పరమ భక్తాగ్రగణ్యుడయిన అన్నమాచార్యుల సంకీర్తనలచే మిగుల పరితుష్టుడయిన తిరువేంగళనాథుడు అలాంటి సంకీర్తనలను మఱియొక రెవ్వరు రచించినా తాను విననొల్లనని ప్రతిజ్ఞ చేసి పలికినాడట! ఈ ప్రతిజ్ఞావిషయాన్ని అన్నమయ్య పౌత్రుడైన చిన తిరుమలాచార్యులు'సంకీర్తన లక్షణం' లోనూ, అన్నమయ్య దౌహిత్రుడైన రేవణూరి వేంకటార్యుడు 'శకుంతలా పరిణయ' ప్రబంధం యొక్క అవతారికలోనూ స్పష్టంగా వక్కాణించియున్నారు:

"క. *నక్తంచరారి తనకును*
*భక్తుండైనట్టి తాళపాకన్నయ చా*
*టూక్తి పదబంధకవితా*
*రక్తుండై, యితరవాగ్విరక్తుండయ్యెన్."*
*-సంకీర్తన లక్షణము,11వ పద్యము.*

"వ. *"భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల*
*నితరుల సంకీర్తనంబు లాలింపను"-అని ప్రతిజ్ఞాపించెను.*
*-శకుంతలా పరిణయం అవతారిక.*

**ప్రశస్తి:**

మొత్తంమీద వస్తువైవిధ్యము, రచనా రామణీయకము తరిగొండ వెంగమాంబ యక్షగానాలకు ప్రధాన లక్షణాలు."కావ్యేషు నాటకం రమ్యం; నాటకేషు శకుంతలా" - అన్నట్లు ఆంధ్ర సారస్వతంలోని మధురకవితా శాఖకు చెందిన అసంఖ్యాక యక్షగాన సముదాయంలో వెంగమాంబ వెలయించిన యక్షగానాలు తొమ్మిదీ నవరత్నాలలాగా ప్రకాశిస్తూ ఆ శాఖకంతటికీ అక్షరాలంకారాలై అలరారుతూ వున్నాయి.

ఈ సందర్భంలో ప్రసిద్ధులైన వాఙ్మయపరిశోధకుల అభిప్రాయాలు ప్రముఖంగా ప్రస్తావింపదగివున్నాయి.

ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్రకారులైన ఆచార్య యస్.వి. జోగారావుగారు ఈ విధంగా పేర్కొన్నారు:

“వెంగమాంబ యక్షగాన కృతులన్నియు మంచి నాటకపు వాటము గల్గి యుండును. అందలి దరువు లెక్కువగా ప్రసిద్ధ తాళప్రధానములు. అట నట రాగములు పేర్కొనబడినవి. ద్విపదలు, మంజరులు, పద్యములు, సీసార్థములు, కందార్థములు, వచనములు, ఏలలు, సువాలలు, గొబ్బిళ్లు, ధవళములు, శోభనములు, మంగళహారతులు, చూర్ణికలు, దండకములు మొదలగు పలురకముల రచనావిశేషములు అనేకములు గలవు.

లోకోక్తులు, ప్రయోగ విశేషములు ననేకములు గలవు.

ఆటవికజాతుల జీవిత విశేషములనుండి గహనములైన యోగశాస్త్ర రహస్యములవరకు గల అనేక విషయములు ఆమెకు అధిగతార్థములు. సవతుల కయ్యము, ఎఱుక ఘట్టము మొదలగు పట్టులందు అభినివేశముతోడి నిపుణ నిర్వహణమును ప్రకటించినది. ఆమెవలె ఇన్ని యక్షగానములు ఇంత సమర్థముగా రచించిన కవయిత్రులు లేరు. సరికదా! కవులును అరుదు!”

పరిశోధనా పరమేశ్వరులైన విద్యారత్న నిడుదవోలు వేంకటరావుగారు తరిగొండ వెంగమాంబ యక్షగానాలను ఈ విధంగా ప్రశంసించారు:

*"In this branch of literature Vengamamba occupies a prominent place. No doubt there are some poets and poetesses who compiled yakshaganas. These works reveal her proficiency not only in Sahitya but also in*

*Sangita, as yakshagana is a combination of the two arts.... All the works of Vengamamba strictly adhere to the technique of yakshagana. They contain different vairieties of musical compositions like Daruvu, Dvipada Manjari, yela, gobbillu, suvvalalu, Dhavalamulu, Shobhanamulu, Mangala harathulu. The style and nature of the conversation employeed by the poetess reveal her mastery over the Telugu language.*

**ముగింపు:**

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ యక్షగానాలను గూర్చిన ఈ ప్రసంగవ్యాసం ముక్తికాంతావిలాసం చివరి గేయంతో మంగళాంతంగా ముగింపదగివుంది:

*"మంగళం, మంగళం నృసింహా! తే మంగళం ॥పల్లవి॥*

*మంగళప్రద! విహంగవాహన! భు*
*జంగ శయన! భవభంగా! అ*
*నంగ జనక! సారంగ వరద! యోగి*
*పుంగవాత్మ కమలభృంగ! దివ్యాంగా! ॥మంగళం॥*

*ధీర! మందరోద్ధార! నిగమ సం*
*చార! జలధి గంభీరా! శృం*
*గార పూరితాకారా! శ్రీమనో*
*హార! సద్భక్తమందార! చిత్సారా! ॥మంగళం॥*

*శ్రీయహోబలేశ! శేషశైలాధీశ!*
*నా ఆశ! తరిగొండనాథా! ప*
*ద్మాయతేక్షణ! విధేయ నిర్జర*
*హాయ! దూరీకృత మాయ! మునిగేయా!* ॥మంగళం॥

*మంగళం, మంగళం నృసింహ! తే మంగళం*"

T.T.D. Religious Publications Series No. : 814
Price : Rs. 35/-




## మహా నిర్యాణము :-

క్రీ.శ. 1817 ఈశ్వర-శ్రావణ శుద్ధ నవమినాడు - ఈ మహాజ్ఞాని, మహాయోగిని, భక్తకవయిత్రి, తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, సజీవసమాధి చెందింది.

Published by Dr. K.V.Ramanachary, IAS., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D.Press, Tirupati.